# భవిష్యత్ ప్రజాపాలన

మా వార్త రేపటి భవిష్యత్‌కు నిదర్శనం

bhavishyatprajapalana.in / epaper.bhavishyatprajapalana.in

తెలుగు దినపత్రిక

ASN NEWS

ఎడిటర్ : చిట్ల విజయ్‌కుమార్ రెడ్డి  తెలంగాణ - రంగారెడ్డి  సంపుటి : 01  సంచిక : 214  బుధవారం , సెప్టెంబర్ 02, 2026 ,  పేజీలు - 12  వెల : 1 /-





## యధావిధిగా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్

**సింగిల్ బెంచ్ తీర్పుపై స్టే విధించిన హైకోర్టు**

**హైదరాబాద్,సెప్టెంబర్ 01 :** కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఊరట లభించింది. పథకాల అమలుపై సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను సీజే ధర్మాసనం రద్దు చేసింది. పథకాలపై స్టే విధించడాన్ని సవాల్‌చేస్తూ ప్రభుత్వం దాఖలుచేసిన అప్పీలుపై హైకోర్టు మంగళవారం విచారణ చేపట్టింది. ఈ పథకాల నిమిత్తం ప్రభుత్వం 2014 నుంచి జారీ చేసిన 8 జీవోలను సవాల్‌చేస్తూ న్యాయవాది విజయ్‌గోపాల్ వ్యక్తిగత హోదాలో దాఖలు

మిగతా2లో...

## కొండా వ్యవహారంపై పంచాయితీ

- కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ
- దాదాపు గంట పాటు జరిగిన సమావేశం
- మంత్రుల పనితీరు, పార్టీ అంతర్గత అంశాలపై రిపోర్ట్


2లో

## స్వదేశీ నినాదంతో ముందుకు సాగండి

- బంగారాన్ని అనవసరంగా కొనకండి
- డెస్టినేషన్ పేరుతో విదేశాల్లో పెళ్లిళ్లకు దూరం కండి
- దేశప్రజల సమిష్టి కృషితోనే జిడిపి వృద్ధిరేటు
- దేశ జీడీపీ 7.8 శాతం మేర వృద్ధి సాధించడం గర్వకారణం
- ఇన్‌స్టా వేదికగా ప్రధాని మోడీ దేశ ప్రజలకు అభినందనలు



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 01 :** భారత్ సాధించిన వృద్ధి రేటు దేశ సమష్టి శక్తికి నిదర్శనమని భారత ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. నిరాశావాదులు మాత్రం తమ అసత్యాలను వ్యాప్తి చేస్తూనే ఉన్నారని విమర్శించారు. యుద్ధాలు, సరఫరా వ్యవస్థల్లో అడ్డంకుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా గడ్డు పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత్ మెరుగైన వృద్ధి రేటు సాధించిందని చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారత దేశ జీడీపీ ఏకంగా 7.8 శాతం మేర వృద్ధి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రధాని మోదీ దేశ ప్రజలకు అభినందనలు చెప్పారు. 7.8 శాతం వృద్ధి రేటు నమోదవడంతో దేశవ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోందని అన్నారు. దేశ ప్రజల పట్టుదల, శక్తిసామర్థ్యాలు గొప్పవని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా గడ్డు పరిస్థితులు నెలకొన్నా భారత్ వృద్ధి పథంలో

మిగతా2లో...

## భారత్‌కు మరిన్ని ఎస్-400 ట్రయంఫ్ క్షిపణి వ్యవస్థ

- రష్యాతో డీల్ కుదుర్చుకోనున్న భారత్



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 01 :** 'ఆపరేషన్ సిందూర్'లో సమర్థవంతంగా పనిచేసిన రష్యన్ ఎస్-400 ట్రయంఫ్ క్షిపణి వ్యవస్థలకు భారత్ మరోసారి కొనుగోలు చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. వీటి అవసరాలు పెంచుకోవాలని భారత రక్షణశాఖ నిర్ణయించి నట్లు సమాచారం. భారత వైమానిక దళం కోసం మరో ఐదు ఎస్-400 వ్యవస్థలను కొనుగోలు చేసేందుకు జారీచేసిన టెండర్‌కు రష్యా స్పందించినట్లు సమాచారం. ఈ మేరకు 5 కొత్త వ్యవస్థలను భారత్‌కు విక్రయించేందుకు రష్యా అంగీకరించి నట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. భారత సైనిక వ్యవస్థలో 'సుదర్శన్'గా పిలుస్తున్న ఎస్-400..

మిగతా2లో...

## హైడ్రా రంగనాథ్‌కు హైకోర్టులో ఊరట

- సింగిల్ జడ్జ్ ఉత్తర్వులను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు


2లో

## ప్రశాంతంగా గణెళిశ్ ఉత్సవాలు

**అధికారులు, గణెళిశ్ ఉత్సవ సమితితో మంత్రి సమీక్ష**



**హైదరాబాద్,సెప్టెంబర్ 01 :** సెప్టెం బర్ 14 నుంచి జరిగే గణెళిశ్ ఉత్సవాలను ప్రశాంతంగా, ఉత్సాహపూరిత వాతావరణంలో జరుపుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో సన్నాహక సమావేశం జరిగింది. ఉన్నతాధికారులు, భాగ్యనగర్ గణెళిశ్ ఉత్సవ సమితితో సమావేశం జరిగిందని

మిగతా2లో...

## ఎంపీ ల్యాడ్స్ నిధులపై దుష్ప్రచారం తగదు

- ఎంపీలపై అభాండాలు వేయడం సరికాదు
- ఎంపవర్డ్ ఇండియన్ సంస్థ నివేదికపై బండి



**కరీంనగర్,సెప్టెంబర్ 01 :** ఎంపీ ల్యాడ్స్ నిధుల వినియోగంపై దుష్ప్రచారాలు తగవని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఎంపవర్డ్ ఇండియన్ సంస్థ విడుదల చేసిన నివేదికపై బండి స్పందించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా కేటాయిస్తున్న ఎంపీ ల్యాడ్స్ నిధులను వినియోగించు కోవడంలో పార్లమెంట్ సభ్యులు పూర్తిగా వెనుకబడ్డారన్న ఆ సంస్థ నివేదిక సత్యదూరమని బండి సంజయ్

మిగతా2లో...

## కొత్తగూడెం విమానాశ్రయ ప్రతిపాదనపై సానుకూలత

- 7న కేంద్ర సాంకేతిక బృందం పర్యటన
- నాలుగు నుంచి ఐదు ప్రత్యామ్నాయ స్థలాల పరిశీలన
- సాంకేతిక నివేదిక అనంతరం తదుపరి చర్యలు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు రామ్మోహన్ నాయుడి హామీ



2లో

## మత్స్యకారుల కుటుంబాలకు పింఛను పంపిణీ

**మత్స్యకారులతో చంద్రబాబు మాటామంతీ**



**నర్సాపురం,సెప్టెంబర్ 01 :** పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం నియోజ కవర్గం మొగల్తూరులో ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు మంగళవారం పర్యటించారు. పేదల సేవలో కార్యక్రమంలో భాగంగా మత్స్యకారుల కుటుంబాలకు పింఛను పంపిణీ చేశారు. వేటకు వెళ్లే ఫెర్రీ పాయింట్‌కు ముఖ్య మంత్రి మొదట చేరుకున్నారు. పడవల వద్ద కూర్చున్న పలుగురు మత్స్యకారులతో ముచ్చ టించారు. తిరుమని స్వామి

మిగతా2లో...

# కొండా వ్యవహారంపై పంచాయితీ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 01 :**కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కేసీ వేణుగోపాల్ తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం అయ్యారు. మంగళవారం నాడిక్కడ లోథీ రోడ్ లోని కేసీ వేణు గోపాల్ నివాసానికి వెళ్లి ఆయనను కలిశారు. దాదాపు గంటసేపు పార్టీ, పాలనా అంశాలపై చర్చలు జరిపారు. మంత్రి వర్గ విస్తరణ, శాఖల మార్పు, మంత్రి కొండా సురేఖ, ప్రణాళిక సంఘం చైర్మెన్ జీ చిన్నారెడ్డిల తీరుపై క్రమశిక్షణ కమిటీ రిపోర్ట్ నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది. వెయ్యి రోజుల పాలనపై ఇరువురు నేతలు మాట్లాడుకున్నారు. మంత్రి కొండా సురేఖ వ్యవహారంపై ఏం చేయాలనే దానిపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డితో పాటు మరికొందరు నేతలు పార్టీ లైన్ దాటి మాట్లాడుతున్న తీరు, దానివల్ల ప్రభుత్వానికి జరుగుతున్న రాజకీయ నష్టం వంటి అంశాలపై చర్చించారు. ఇలాంటి విషయాలపై పార్టీ అధిష్టానం ఫోకస్ చేయాలనీ సీఎం కోరినట్టు తెలిసింది. రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ దీనిపై లోతైన విచారణ జరిపిన తర్వాతే... నివేదికను అధిష్టా నంకు అందజేసినట్లు వివరించారు. మంత్రుల పనితీరు, పార్టీ అంతర్గత అంశాలపై కేసీకి సీఎం రేవంత్ రెడ్డి రిపోర్ట్ అందజేశారు. ఆయా శాఖల వారీగా పనితీరు వివరాలు, మంత్రుల వ్యవహారం, పార్టీలో మంత్రి పదవులు ఆసిస్తున్న నేతల పేర్లను ప్రస్తా వించినట్లు తెలిసింది. వీటితో పాటు నామినేటెడ్ పోస్టుల భర్తీపైనా చర్చ జరిగింది. సుదీర్ఘ కాలంగా పార్టీ వెన్నంటే ఉన్న సీనియర్లు, యువ నేతలకు అవకాశం కల్పిం చాలని సూత్రప్రాయంగా నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఇదే సందర్భంలో వెయ్యి రోజుల పాలన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న కార్య క్రమాలను తెలియజేశారు.

**నేడు కేసీతో మీనాక్షి నటరాజన్, మహేశ్ కుమార్ భేటి**

పార్టీ లైన్ దాటుతున్న నేతలకు చెక్ పెట్టేలా నేడు అధిష్టానం కీలక సమావేశం నిర్వహించనుంది. పార్టీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ నేతృత్వంలో ఏఐసీసీ హెడ్ ఆఫీసులో బుధవారం ఈ భేటి జరగనుంది. ఇందులో పార్టీ రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ లు హాజరుకానున్నారు. ఈ భేటిలో కీలకంగా మంత్రి కొండా సురేఖ, ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డిల అంశాలు ప్రధానంగా చర్చకు రానున్నట్లు ఏఐసీసీ వర్గాల ద్వారా తెలిసింది. అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన తీరుపై రాష్ట్ర వ్యాప్త సంబురాలు, క్షేత్రస్థా యిలో పార్టీని మరింత బలోపేతం వ్యవ హారాలపై చర్చించనున్నారు. పార్టీ చీఫ్ ఖర్గేతోనూ పీసీసీ చీఫ్ భేటి కానున్నారు.

# ఎంపీ ల్యాడ్స్ నిధులపై దుష్ప్రచారం తగదు

(మొదటి పేజీ తరువాయి)

కుమార్ తెలిపారు. ఎంపీ ల్యాడ్స్ కింద పంపిన ప్రతిపాదనలకు సంబంధించి పనుల పురోగతి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా ఎంపీలపై అభాండాలు వేయడం సరికాదని పేర్కొన్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఎంపీ ల్యాడ్స్ కింద రూ.17.50 కోట్లు కేటాయించగా.. అందులో ఇప్పటికే రూ.16.47 కోట్లు వినియోగించామని ఆయన స్పష్టం చేశారు. అందుకు సంబంధించిన వివరాలను గణాంకాలతో సహా బండి సంజయ్ మీడియాకు వివరించారు. 'కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి గత మూడేళ్లలో కమ్యూనిటీ హాళ్లు, బోర్‌వెల్స్, హైమాస్ట్ లైట్లు, సీసీ రోడ్ల నిర్మాణాల కోసం స్థానిక ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు 627 ప్రతిపాదనలు కలెక్టర్‌కు పంపాం. ఇందులో కరీంనగర్ జిల్లా నుంచి 313, హన్మకొండ నుంచి 39, జగిత్యాల నుంచి 45, రాజన్న సిరిసిల్ల నుంచి 151, సిద్దిపేట నుంచి 79 పనులకు సంబంధించిన ప్రతిపాదనలున్నాయి. వీటిలో 82.29 శాతం పనులకు ఆయా జిల్లాల కలెక్టర్లు ఆమోదం తెలిపారు. మిగిలిన పనుల మంజూరు అంశం ప్రాసెస్‌లో ఉంది. మొత్తంగా కేంద్రం కేటాయించిన రూ.17.5 కోట్లలో 94.1 శాతం మేరకు అంటే రూ.16.47 కోట్ల నిధులకు సంబంధించిన పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయని కేంద్ర మంత్రి వివరించారు.

ఇందులో 16వ లోక్‌సభ సభ్యుడిగా కొనసాగిన బోయినపల్లి వినోద్ కుమార్ తన ఐదేళ్ల కాలంలో వినియోగించని రూ.2.5 కోట్లను సైతం తాను ఖర్చు చేసినట్లు బండి సంజయ్ తెలిపారు. వాస్తవానికి స్థానిక సమస్యల పరిష్కారానికి సంబంధించి కేంద్రం ఏటా కేటాయిస్తున్న ఎంపీ ల్యాడ్స్ నిధులు సరిపోవడం లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా నిధులను ఏటా పెంచాలని కోరుతూ ఇప్పటికే ఎంపీల నుంచి కేంద్రానికి అనేక విజ్ఞప్తులు వెళు న్నాయని తెలిపారు. అయినప్పటికీ ఎంపీ ల్యాడ్స్ నిధులే ఖర్చు చేయడం లేదంటూ ఎంపవర్డ్ ఇండియన్ సంస్థ ప్రచారం చేయడం అన్యాయమని పేర్కొన్నారు. ఎంపీ ల్యాడ్స్ నిధుల కేటాయింపు, ఎంపీల ప్రతిపాదనలు, జిల్లా కలెక్టర్ల ఆమోదం, వివిధ శాఖల అధికారుల కార్యాచరణ, అమలు, పనుల పూర్తి వరకు అనేక దశలు ఉన్నాయని తెలిపారు. ఇవేవీ పట్టించుకోకుండా ఏకపక్షంగా పార్లమెంట్ సభ్యులు ఎంపీ ల్యాడ్స్ నిధులనే వినియోగించుకోవడం లేదని ఆరోపణ చేయడమంటే బట్ట కాల్చి మీద వేయడమేనని మండిపడ్డారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరో 7 నెలల సమయం ఉన్నప్పటికీ తన వద్ద ఎంపీ ల్యాడ్స్ నిధులే మిగలలేదని, ఆ నిధులకు సంబంధించిన ప్రతిపాదనలన్నీ ఎప్పుడో సంబంధిత జిల్లాల కలెక్టర్లకు పంపామని వివరించారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం తన వద్దకు వచ్చే ప్రజల విజ్ఞప్తులను పరిష్కరించేందుకు అవసరమైన నిధుల కోసం సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) ఫండ్స్‌ను కూడా సేకరిస్తున్నామనే విషయాన్ని ఆ సంస్థ గుర్తుంచుకోవాలన్నారు. ఇకనైనా ఎంపీ ల్యాడ్స్ నిధులకు సంబంధించి నగదు కేటాయింపు, ఎంపీల ప్రతిపాదనలు, జిల్లా కలెక్టర్ల ఆమోదం, వివిధ శాఖల అధికారుల కార్యాచరణ, అమలు, పనుల పూర్తి వరకు దశలవారీగా వాస్తవాలను ఆ సంస్థ పరిగణనలోకి తీసుకుని, వాటిని ప్రజల ముందు ఉంచాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కోరారు.

## కొత్తగూడెం విమానాశ్రయ ప్రతిపాదనపై సానుకూలత

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 01 :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు ప్రతిపాదనకు సంబంధించి నాలుగు నుంచి ఐదు ప్రత్యామ్నాయ స్థలాలను పరిశీలించేందుకు కేంద్ర సాంకేతిక బృందం సెప్టెంబర్ 7న తెలంగాణలో పర్యటించనుంది. న్యూఢిల్లీలో మంగళవారం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడితో సమావేశమైన అనంతరం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ విషయాన్ని వెల్లడించారు. గతంలో పరిశీలించిన రెండు స్థలాలు సాంకేతిక కారణాలతో విమానాశ్రయ నిర్మాణానికి అనుకూలంగా లేవని తేలడంతో, తాజాగా నాలుగు నుంచి ఐదు ప్రత్యామ్నాయ స్థలాలను గుర్తించినట్లు మంత్రి తెలిపారు. ఈ స్థలాల్లోని భౌగోళిక, వాతావరణ పరిస్థితులతోపాటు విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన సాంకేతిక సాధ్యాసాధ్యాలను కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తుందని చెప్పారు.

కేంద్ర సాంకేతిక బృందం నివేదిక అనుకూలంగా వచ్చిన అనంతరం కొత్తగూడెం విమానాశ్రయం ఏర్పాటుకు అవసరమైన తదుపరి చర్యలను కేంద్ర ప్రభుత్వం చేపడుతుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు హామీ ఇచ్చినట్లు మంత్రి తుమ్మల తెలిపారు. తెలంగాణలోని మామునూరు (వరంగల్), ఆదిలాబాద్ విమానాశ్రయాల ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సెప్టెంబర్ 2న కేంద్ర ప్రభుత్వంతో చర్చించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తండ్రి, దివంగత ఎర్రన్నాయుడు తన చిరకాల మిత్రుడని మంత్రి తుమ్మల గుర్తుచేసుకు న్నారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఉన్న ఈ ప్రాంత ప్రాధాన్యాన్ని, జిల్లా ప్రజలకు విమానాశ్రయం అవసరాన్ని కేంద్ర మంత్రికి వివరించినట్లు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజల దీర్ఘకాల ఆకాంక్షను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లాను. నా విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి,

వెంటనే కేంద్ర సాంకేతిక బృందాన్ని పంపేందుకు చర్యలు చేపట్టిన కేంద్ర మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడికి, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు' అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

## హైడ్రా రంగనాథ్‌కు హైకోర్టులో ఊరట

**హైదరాబాద్,సెప్టెంబర్ 01 :** హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హై కోర్టులో ఊరట లభించింది. శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కేసులో ఆయనపై సింగిల్ బెంచ్ ఇచ్చిన ఆర్డర్‌ను డివిజన్ బెంచ్ సస్పెండ్ చేసింది. తదుపరి విచారణ నవంబర్ 3వ తేదీకి న్యాయస్థానం వాయిదా వేసింది. అప్పటి వరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ని మార్చాలనే సింగిల్ బెంచ్ ఆర్డర్‌ను తాత్కాలికంగా డివిజన్ బెంచ్ సస్పెండ్ చేసింది. తదుపరి ఆదేశాల వరకు లోతుకుంటా భూముల జోలికి వెళ్లవద్దని హై కోర్టు స్పష్టం చేసింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ తరఫున హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు మాజీ సీజే జస్టిస్ రాజీవ్ శక్దర్ వాదనలు వినిపించారు. శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కేసుపై అప్పీల్‌కు హైడ్రా కమిషనర్ వెళ్లిన విషయం తెలిసిందే. ఇదే కేసులో రంగనాథ్‌ని తప్పించి మరో అధికారిని నియమించాలని సింగిల్ జడ్జి గతంలో తీర్పునిచ్చారు. ఈ క్రమంలోనే సింగిల్ జడ్జి తీర్పుని హైడ్రా కమిషనర్ రంగనాథ్ డివిజన్ బెంచ్‌లో సవాల్ చేశారు.

# రాహుల్ గాంధీపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

- దుర్మార్గ చర్యగా అభివర్ణించిన మంత్రి జూపల్లి



**నాగర్ కర్నూల్,సెప్టెంబర్ 01 :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయించడం కేంద్ర ప్రభుత్వ దుశ్చర్య అని తెలంగాణ మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ మత రాజకీయాలకు తెర లేపారని ధ్వజమెత్తారు. ప్రధానమంత్రి అవకాశాలు వచ్చిన సోనియాగాంధీ కుటుంబం తీసుకోలేదని చెప్పుకొచ్చారు. రాహుల్ గాంధీపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టినందుకు.. నిరసనగా ఈరోజు (మంగళవారం) నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రం అంబేడ్కర్ చౌరస్తా వద్ద గంటసేపు రోడ్డుపై బైఠాయించి మంత్రి జూపల్లి కృష్ణారావు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడారు. రాహుల్ గాంధీ భారత్ జోడోయాత్ర నిర్వహించి దేశ ప్రజలను చైతన్యం చేశారని మంత్రి జూపల్లి ప్రస్తావించారు. అలాంటి కుటుంబంపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేయడం దుశ్చర్యగా భావిస్తున్నామని అన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే.. ఉత్తరప్రదేశ్‌లోని అల్ది హల్ద్వానిలోని ర్యాలీ వేదికను ఎక్కారని.. శుద్ధి చేసిన వారిపై కేసు నమోదు చేయకుండా.. ఆ విషయాన్ని ప్రశ్నించిన రాహుల్ గాంధీపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టడమేంటని ప్రశ్నించారు. 'మోదీ హటావో దేశ్‌కి బచావో.. ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' అని మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పాల్గొన్నారు.

## స్వదేశీ నినాదంతో ముందుకు సాగండి

(మొదటి పేజీ తరువాయి)

దూసుకుపోతోందని అన్నారు. భారత దేశ ప్రగతిని ఇలాగే కొనసాగించాల్సిన అవసరం ఉందని కూడా ప్రధాని చెప్పారు. ఆత్మనిర్భరత సాధించడం అవసరమని మరోసారి చెప్పారు. స్వదేశీ వస్తువులకు దేశ ప్రజలు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనవసర విదేశీ పర్యటనలు, బంగారం కొనుగోళ్లు వద్దని అన్నారు. విదేశీ మారకనిల్వల పొదుపు కోసం భారత్‌లోనే వివాహాది శుభకార్యాలు జరుపుకోవాలని సూచరించారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు అభినందనలు తెలిపిన ఆయన.. గతంలో చేసిన విజ్ఞప్తినే మరోసారి గుర్తుచేశారు. స్వదేశీ వస్తువులనే కొనుగోలు చేయాలని, విదేశీ ప్రయాణాలు వద్దని, అవసరం లేకుండా బంగారం కొనొద్దని మరోసారి కోరారు. ప్రస్తుతం కిర్గిస్థాన్ పర్యటనలో ఉన్న ఆయన ఈ మేరకు ఇన్‌స్టా వీడియో విడుదల చేశారు. దేశ ప్రజలకు అభినందనలు. 7.8? వృద్ధి గొప్ప విషయం. ప్రజల సంకల్ప బలం, కృషికి ఇది నిదర్శనం. ప్రపంచం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో భారత్ ఈ అసాధారణ ఘనతను దక్కించుకుంది. ప్రపంచం యుద్ధంలో మునిగిపోయింది. ఎటుచూసినా యుద్ధ వార్తలే.. సంక్షోభాలే. సరఫరా గొలుసు పూర్తిగా దెబ్బతింది. 2020లో కొవిడ్ తర్వాత నుంచి నేటి వరకు ఎక్కడా స్థిరత్వం కనిపించడం లేదు. అయినా భారత్ పురోగమిస్తోందని మోదీ తన వీడియోలో పేర్కొన్నారు. పర్యటనల కోసం విదేశాలకు వెళ్లొద్దు. విదేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు దూరంగా ఉండండి. 'భారత్‌లోనే వివాహం చేసుకోండి' అనే మంత్రాన్నే మనం పాటిద్దాం. అవసరం లేకపోతే బంగారాన్ని కొనడం మానుకోండి. స్థానికంగా తయారైన వస్తువులు, సేవలు ఎంత ఎక్కువగా ఎంచుకుంటే.. దేశం అంత ఎక్కువగా అభివృద్ధి చెందుతుంది. మనం స్వావలంబనకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఉంటే.. స్వాతంత్ర్యం వచ్చి 100 ఏళ్లు పూర్తయ్యేనాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదుగుతామనే విశ్వాసం నాకు ఉందని మోదీ పేర్కొన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంచనా వేసిన 7 శాతం కంటే ప్రస్తుత వృద్ధి రేటు ఎక్కువ. అమెరికా- ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయంగా అనిశ్చితులు, ఇంధన సరఫరాకు అవరోధాలు వంటి పరిస్థితులను తట్టుకొని భారత ఆర్థిక వ్యవస్థ రాణించడం విశేషం. ఈ వృద్ధిని దేశ ప్రజలు వేడుకలా నిర్వహించుకోవాలి. అదే సమయంలో వికసిత్ భారత్ దిశగా కృషి చేయాలి. 140 కోట్ల మంది ప్రజల ఐక్యత.. దేశాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్తుందని ప్రధాని అన్నారు.

## భారత్‌కు మరిన్ని ఎస్-400 ట్రయంఫ్ క్షిపణి వ్యవస్థ

(మొదటి పేజీ తరువాయి)

గతేడాది ఆపరేషన్ సిందూర్‌లో అదరగొట్టింది. శత్రువుల వైపు నుంచి వచ్చిన ప్రమాదాలను విజయవంతంగా అడ్డుకోవడంలో ఈ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసిందని భారత రక్షణ వర్గాలు తెలిపాయి. ఎస్-400 పనితీరుకు సంబంధించి పశ్చిమ వైమానిక కమాండ్ అధిపతి ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా గతంలో ఓ పోడ్‌కాస్ట్‌లో కీలక విషయాలు వెల్లడించారు. పాకిస్థాన్ వైమానిక దళానికి చెందిన నిఘా విమానాన్ని 314 కి.మీ. దూరంలో ఎస్-400 కూల్చివేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఇంత దూరంలో భూమి నుంచి ప్రయోగించిన గగనతల రక్షణ క్షిపణి లక్ష్యాన్ని ఛేదించడం అత్యంత అరుదని నాడు రక్షణ రంగంలో చర్చ కూడా జరిగింది. ఎస్-400 అనేది ఒకే మిసైల్ కాదు. ఇందులో అత్యాధునిక రాడార్లు, కమాండ్ వ్యవస్థలు, వివిధ రకాల క్షిపణులు వంటి అనేక భాగాలుంటాయి. వీటిలోని కొన్ని క్షిపణులకు 400 కి.మీ. వరకు లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యం ఉంటుంది. దీంతో శత్రు విమానాలు భారత గగనతలానికి చేరకముందే వాటిని గుర్తించి ఎదుర్కోగలవు. ఈ కారణంగానే భారత్ తన బహుళస్థాయి వైమానిక రక్షణ వ్యవస్థలో ఎస్-400కు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. 2018లో కుదిరిన తొలి ఒప్పందం ప్రకారం.. భారత్ మొత్తం 5 ఎస్-400 యూనిట్లను కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఇందులో ఇప్పటివరకు 4 యూనిట్లు భారత్‌కు అందాయి. ఇంకో యూనిట్ నవంబర్ నాటికి అందే అవకాశముంది. తాజాగా మరో 5 యూనిట్ల కోసం భారత్ ఆసక్తి చూపుతోందని సమాచారం.

## యథావిధిగా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్

(మొదటి పేజీ తరువాయి)

చేసిన పిటిషన్‌లో ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకపోవడంతో పథకాల అమలును నిలిపివేస్తూ సింగిల్ జడ్జి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ 2014 నుంచి అమలవుతున్న సంక్షేమ పథకాలపై పిటిషన్ దాఖలైందన్నారు. ఈ పథకాల అమలు.. పిటిషనర్‌పై ఎలాంటి ప్రభావం చూపడంలేదని, అతని హక్కులకూ భంగం వాటిల్లలేదని, అంతేకాకుండా పథకం లబ్దిదారు కూడా కాదన్నారు. ఇది ప్రజాప్రయోజన వ్యాజ్యం కాదని పేర్కొన్నారు. షాదీ ముబారక్ లాంటి పథకాన్ని సుప్రీంకోర్టు అనుమతించిందని, అలాంటిదే కల్యాణలక్ష్మి పథకమన్నారు. ఈ పిటిషన్ సింగిల్ జడ్జి వద్ద విచారణార్హం కాదని, ప్రభుత్వ విధాన నిర్ణయాలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించే పరిధి ఈ డివిజన్ బెంచ్‌కు ఉందన్నారు. పథకం అమలుపై ఉన్న మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేయాలని కోరారు. ఏజీ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం.. స్టేను ఎత్తివేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

## ప్రశాంతంగా గణేశ్ ఉత్సవాలు

(మొదటి పేజీ తరువాయి)

ఉత్సవాలు ప్రశాంతంగా జరగడంపై చర్చించినట్లు చెప్పారు. సామూహిక ఉత్సవాలు జరిగేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గణేశ్ మండపాల నిర్వహణ, శానిటేషన్, భద్రత, సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటుపై చర్చించామన్నారు. భక్తులకు మొక్కల పంపిణీ చేయాలని, చేనేత కండువాలు వాడాలని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితిని కోరామన్నారు.

మట్టి వినాయకులను వాడి... పర్యావరణాన్ని కాపాడాలని మంత్రి పిలుపునిచ్చారు. బోనాల ఉత్సవాల సమయంలో మంచి వర్షాలు కురవాలని అన్ని ఆలయాల్లో పూజలు చేసినట్లు తెలిపారు. వినాయక మండపాల్లో ఎల్‌నినో కష్టాల నుంచి గ్గటెక్కించి.. మంచి వర్షాలు కురవాలని పూజలు చేయాలని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితికి ప్రభుత్వం నుంచి సూచించామన్నారు. కోర్టులను గౌరవిస్తూనే ఉత్సవాలు జరుపుకుంటున్నామని తెలిపారు. ప్రజలే స్వచ్ఛందంగా ఉత్సవాలు జరుపుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

## మత్స్యకారుల కుటుంబాలకు పింఛను పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)

అనే మత్స్యకారునికి స్వయంగా సీఎం పింఛను సొమ్మును అందజేశారు. వారి కుటుంబాల యోగక్షేమాలు, సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించే పథకాల పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారు. వేట సమయంలో ఎదురయ్యే ఇబ్బందులను కూడా సీఎం అడిగి తెలుసుకున్నారు. సముద్రంలో మత్స్యకారులు గల్లంతవుతున్న ఘటనలపై ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల దాదాపు 20 రోజుల పాటు సముద్రంలో కనిపించకుండా పోయిన కోనసీమకు చెందిన మత్స్యకారులను సురక్షితంగా తిరిగి తీసుకురావడంలో కోస్ట్‌గార్డ్, నేవీ, కేంద్ర మెరైన్ విభాగాల సహకారం తీసుకున్న విషయాన్ని సీఎం వారికి వివరించారు. మత్స్యకారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పథకాలు అమలవుతున్న తీరును సీఎం చంద్రబాబు వారిని అడిగి తెలుసుకున్నారు. మత్స్యకారుల సేవలో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న రూ.20 వేల ఆర్థిక సాయం వేట నిషేధ సమయంలో తమను ఆదుకుంటోందని మత్స్యకారులు సీఎంకు తెలిపారు. ఈ సమయంలోనే తమతో పాటు పడవలోకి రావాలని ఓ మత్స్యకారుడు సీఎంను ఆహ్వానించారు. వారి ఆహ్వానం మేరకు మత్స్యకారులతో కలిసి బోటులో ప్రయాణిం చారు. సముద్రంలో వేటకు వెళ్లినప్పుడు రోజువారీ జీవితం ఎలా ఉంటుంది? ఎన్ని గంటలు సముద్రంలో ఉండాలి? ఆ సమయంలో భోజనం ఎలా చేస్తారు? వంటి విషయాలను సీఎం అడిగి తెలుసుకున్నారు.

# మాలల ఛలో సెక్రటేరియట్ ఉద్రిక్తత



- రోస్టర్‌ను సవరించాలని, విద్యా, ఉద్యోగ అవకాశాలలో జివో 99 వల్ల తీవ్ర నష్టం జరుగుతుందని, ధర్నా జరిగింది

**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 2 :** తక్షణమే రద్దు చేయాలని రాష్ట్రర అద్యక్షులు పిల్లి సుధాకర్ పిలుపుతో భారీగా తరలివచ్చిన మాలలలు, నిర్బంధాలను చేదించుకొని సెక్రటేరియట్‌ను ముట్టడించిన వైనం. రాష్ట్ర వ్యాప్తంగా అరెస్టుల పర్వం. పోలీసుల తోపులటలో జాతీయ అధికార ప్రతినిధి దార సత్యం కు తీవ్ర గాయం, హాస్పిటల్ కు తరలింపు, రాష్ట్ర అద్యక్షులు పిల్లి సుధాకర్‌పై పోలీసుల దాడి అస్వస్థతకు గురి. ఈరోజు ఉదయం నుండి గ్రూపులుగా సెక్రటేరియట్ వద్ద అరెస్టులు హైదరాబాద్ వివిధ పోలీస్ స్టేషన్‌లకు తరలింపు.. సికింద్రాబాద్ ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ కు రాష్ట్ర అద్యక్షులు, వారి బృందం తరలింపు. రేవంత్ రెడ్డి అహంకార దోరణితో తన గొయ్యి తానే తీసుకుంటున్నాడు. మాలలపై కక్ష్య సాదింపు ఎందుకు? రోస్టర్‌ని సవరించి, మాలలకు ఇరవై లోపు రెండు పాయింట్స్ కేటాయించాలి.. జివో నంబర్ 99 రద్దు చేయాలని డిమాండ్.. పోలీసులు గుండాల్లా వ్యవహరించారు. కనీసం ఆడవాళ్ళను మహిళా పోలీసులతో అరెస్ట్ చేయలేదు ఇది దుర్మార్గం.. మాలలపై జరిగిన పోలీసుల, దాడిని ప్రజాస్వామికవాదులు ఖండించాలి.

నాలుగు దఫాలుగా ముట్టడి విజయవంతం, వందల మంది అరెస్ట్ గోల్కొండ, ముషీరబాద్,నాంపల్లి, సైఫాబాద్, బోరబండ,,అసిఫానగర్‌లకు తరలింపు.

ఈ సందర్భంగా రాష్ట్ర అద్యక్షులు పిల్లి సుధాకర్ మాట్లాడుతూ.... రోస్టర్ ద్వారా మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతుంది, జీవో 99 ని రద్దుచేసి మాల గ్రూప్ - 3 లోని 26 కులాలకు న్యాయం చేయాలి, 20 లోపు రెండు రోస్టర్ పాయింట్లను మాలలకు కేటాయించాలని డిమాండ్ చేశారు, మ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాలలపై కక్షపూరితంగా వ్యవహరిస్తూ మాలల్ని విద్యా ఉద్యోగ అవకాశాలకు దూరం చేస్తున్నాడని



అన్నారు ఈరోజు మాలలపై జరిగిన దాడి హేయమైన చర్య ప్రభుత్వం ముఖ్యమంత్రి దీనికి బాధ్యత వహించాలి, రోస్టర్ విధానంలో 20 లోపు రెండు



పాయింట్లు మాలలకు కేటాయించాలని చెప్పి డిమాండ్ చేస్తున్నాము, ప్రజాస్వామ్యబద్ధంగా సెక్రెటరియట్ కు వచ్చిన మాలలపై పోలీసులు అమానుషంగా దాడి చేసి గాయపరచారు, దీనిని తీవ్రంగా ఖండిస్తూ అన్ని జిల్లాలలో నల్ల బ్యాడ్జిలతో అంబేద్కర్ విగ్రహాల ముందు నిరసన తెలుపలని పిలుపునిస్తున్నాం. వచ్చే అసెంబ్లీ నీకు అసెంబ్లీ సమావేశాలలో రోస్టర్ ను సవరించకపోతే ప్రభుత్వంతో మాలలు యుద్ధం చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తెలంగాణ వ్యాప్తంగా హాజరైనారు మేడి అంజయ్య, నల్లాల కనకరాజు, ర్యాకం శ్రీరాములు,నాయకోటి రవికాంత్,అసాది పురుషోత్తం,గౌడెల్లి చంద్రశేఖర్, చిట్టిమళ్ళ సమ్మయయ్య,,సుందర్ రావు, చింత సత్తి, రమణమూర్తి,బుట్టి సత్యనారాయణ,జెల్ల ప్రభాకర్, నీరటి రాములు,అల్లిబిల్లి మహేందర్,గంటల రేణుక, కనక భారతి,తీట్ల ఈశ్వరి, శీలం పుష్పలత, దొడ్డి మణెమ్మ,జక్కుల లలిత,జక్కుల సుమిత్ర, సుజాత, గజెల్లి లక్ష్మణ్, ఆరె కిషోర్, నీరటి శ్రీనివాస్, బ్యాగరి వెంకటేష్, గుజ్జుక పరుశరామ్, కాడె శంకర్, పసుల అశోక్, తిరుపతి,కాల్వ నరేష్,బెజ్జం రమేష్, పనికల శ్రీనివాస్, బొల్లం రాంకుమార్, ఉసిల్ల ఉదయ్, సాదు కుమారస్వామి, బండారి మహేందేర్, సంపతీ రఘు తవ్వ జయపాల్,తుప్పరి నర్సింగరావు,దార సాత్విక్, గుండమళ్ళతిరుపతి,' ఎరుమళ్ళ యాదగిరి, గార ఉపేందర్, లింగం కుమార్, రావుల శ్రీనివాస్, నిరంజన్, గాజుల భాస్కర్, పుట్టి.శ్రీనివాసరావు వాసు మల్ల గౌతమ్, సెనగ ప్రభాకర్ ఇంజ.బాబి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు తక్షణమే యూనిఫామ్స్ అందించాలి



బీఆర్‌ఎస్‌వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ

**దేవరకొండ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వడ్త్య:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు తక్షణమే యూనిఫామ్స్ అందించాలని బీఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం దేవరకొండ పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. విద్యా సంవత్సరం ప్రారంభమై నేటికి నాలుగు నెలలు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇప్పటివరకు యూనిఫామ్స్ అందించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్నారని, వారికి అవసరమైన యూనిఫామ్స్‌ను సకాలంలో అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే విద్యార్థులకు యూనిఫామ్స్ అందించాల్సి ఉండగా, నాలుగు నెలలు గడిచినా వాటి పంపిణీ జరగకపోవడం బాధాకరమన్నారు. దీనివల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, విద్యార్థుల సమస్యల పరిష్కారం విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బొడ్డుపల్లి కృష్ణ విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యార్థులందరికీ వెంటనే యూనిఫామ్స్ అందించాలని, విద్యార్థుల సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

# రంగనాథ్‌కి హృదయపూర్వక అభినందనలు!



**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 2:** సింగిల్ బెంచ్ తీర్పు సస్పెండ్ కావడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నాము. న్యాయం, నిజాయితీ, ప్రజాసేవ పట్ల మీ అంకితభావానికి ఇది మరింత బలాన్నిస్తుంది. మీ సేవలు నిరంతరం కొనసాగాలని కోరుకుంటూ... హృదయపూర్వక అభినందనలు, అన్నే సత్యనారాయణ చెప్పారు.


**రంగనాథ్‌కి హృదయపూర్వక అభినందనలు!**

**హైదరాబాద్ సిటీ ప్రతినిధి, సెప్టెంబర్ 2:** సింగిల్ బెంచ్ తీర్పు సస్పెండ్ కావడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నాము. న్యాయం, నిజాయితీ, ప్రజాసేవ పట్ల మీ అంకితభావానికి ఇది మరింత బలాన్నిస్తుంది. మీ సేవలు నిరంతరం కొనసాగాలని కోరుకుంటూ..... హృదయ పూర్వక అభినందనలు, అన్నే సత్యనారాయణ చెప్పారు.


# వరుణదేవుడి కోసం పాత్లావత్ తండా మొక్కు
## ఆంజనేయుడి సన్నిధిలో సామూహిక పూజలు



- పంటలు పండాలని.. ప్రజలు బాగుండాలని.. వర్షం కోసం తండా వాసుల ప్రత్యేక ప్రార్థన
- వర్షాల కోసం పాత్లావత్ తండాలో ప్రత్యేక పూజలు

**దేవరకొండ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వడ్త్య:** దేవరకొండ/వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని, రైతులు, ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కోరుతూ పాత్లావత్ తండాలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్ పాత్లావత్ భారతి – ధర్మా నాయక్ ఆధ్వర్యంలో జై శ్రీ ఆంజనేయం గుడి వద్ద ఈ పూజలు ఘనంగా జరిగాయి. తండాకు చెందిన పెద్దలు, యువకులు, మహిళలు, చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ ఏకమై వరుణదేవుడిని ప్రార్థించారు. హోమం నిర్వహించి, ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వాంకుడావత్ రాజ్ కుమార్, బాలు, తరియా, కాలో, రాజు, టిక్యా, కోటి, నరేష్, శ్రీకాంత్, సురేష్, గణేష్, నిఖిల్, శంకర్, సీతారాం తదితరులు మరియు గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ భారతి మాట్లాడుతూ వర్షాలు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని, ఊరి శ్రేయస్సు కోసం, పాడి పంటలు బాగుండాలని ఈ పూజ చేశామని తెలిపారు.

# టెక్నాలజీకి రెట్రో లుక్

కొందరు రెట్రో లుక్‌ను అమితంగా ఇష్టపడతారు. అదే సమయంలో.. ఆధునిక టెక్నాలజీని కూడా కోరుకుంటారు. అలాంటి వారికి Bumpboxx BB-777 మంచి చాయిస్. ఇది 270వా భారీ అవుట్‌పుట్ పవర్‌ను అందిస్తుంది. ఇందుకోసం దీనిలో ఆరు డ్రైవర్స్ స్పీకర్ సెటప్.. 6.25 అంగుళాల సూపర్ వూఫర్లు (రెండు), 6.25 అంగుళాల కో యాక్సిల్ స్పీకర్లు (రెండు), హార్న్ ట్వీటర్లు (రెండు) ఏర్పాటు చేశారు.

**టెక్నాలజీకి రెట్రో లుక్**

**ధర: రూ.74,000 దొరుకుచోటు:**


కొందరు రెట్రో లుక్‌ను అమితంగా ఇష్టపడతారు. అదే సమయంలో.. ఆధునిక టెక్నాలజీని కూడా కోరుకుంటారు.


# దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత అంబులెన్స్ సేవలు ప్రారంభం

- జెండా ఊపి ప్రారంభించిన స్థానిక ఎమ్మెల్యే బాలు నాయక్, జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్



**దేవరకొండ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వడ్త్య :** దేవరకొండ పేద ప్రజలకు అత్యవసర వైద్య సేవలు మరింత చేరువ చేయాలనే సంకల్పంతో దేవరకొండ ప్రాంతీయ ఆసుపత్రికి 'సమాచార హక్కు ప్రచార్ సమితి' (SHPS) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత అంబులెన్స్ సేవలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రాంతీయ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్, జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, డీసీహెచ్‌ఎస్ మాతృ నాయక్ ముఖ్య అతిథులుగా హాజరై, జెండా ఊపి అంబులెన్స్ సేవలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, ఆపదలో ఉన్న పేద రోగులకు సకాలంలో అత్యవసర వైద్యం అందేలా ఉచిత అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తీసుకు రావడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. అనంతరం సమాచార హక్కు ప్రచార్ సమితి (SHPS) రాష్ట్ర అధ్యక్షులు కాట్రావత్ రాజు నాయక్ మాట్లాడుతూ.. ప్రజల ప్రాణాలను కాపాడటం, అత్యవసర సమయాల్లో పేద రోగులకు అండగా నిలవడమే తమ సంస్థ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఆసుపత్రి సిబ్బంది, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి పకడ్బందీగా రీ సర్వేను చేపట్టాలి

- రైతుల సమక్షంలోనే కొలతలు నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

**నాగర్ కర్నూల్: భవిష్యత్ ప్రజా పాలన జర్నలిస్ట్ రఘు సాగర్ :** జిల్లాలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో చేపట్టిన భూముల రీ సర్వే పనులను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం కొల్లాపూర్ నియోజకవర్గంలోని మొలచింతలపల్లి గ్రామ శివారులో కొనసాగుతున్న భూముల రీ సర్వే పనులను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అదనపు కలెక్టర్ బి చెన్నయ్య, ఆర్డిఓ బన్సీలాల్ లతో కలిసి కొనసాగుతున్న రీ సర్వే ప్రక్రియను పరిశీలించి, అధికారులను సంబంధి భూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ......, ప్రతి సర్వే నంబర్‌ను క్షుణ్ణంగా కొలిచి, సంబంధిత వివరాలను పక్కాగా డిజిటలైజ్ చేయాలని, రీ సర్వే ప్రక్రియతో పాటు ప్రతి గ్రామానికి సంబంధించిన డిజిటల్ మ్యాపులను కూడా సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. భూముల హద్దులు, విస్తీర్ణం విషయంలో ఎలాంటి తేడాలు లేకుండా అత్యంత జాగ్రత్తగా కొలతలు చేపట్టాలని, ముఖ్యంగా రైతుల సమక్షంలోనే సర్వే నిర్వహించాలని స్పష్టం చేశారు. భవిష్యత్తులో భూ వివాదాలకు అవకాశం లేకుండా రీ సర్వే ప్రక్రియను పూర్తి స్థాయిలో పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. మొలచింతలపల్లి గ్రామంలో ప్రస్తుతం 41,954 ఎకరాల 16 గుంటల భూమి విస్తీర్ణం ఉన్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. రీ సర్వే ద్వారా భూములకు సంబంధించిన హద్దులు, విస్తీర్ణం, ఇతర వివరాలను పక్కాగా నమోదు చేసి డిజిటల్ రికార్డులను రూపొందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట ఏడీ గిరిధర్, తహసీల్దార్ మాధవి, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.







# వెంకట్ రెడ్డి నగర్ డివిజన్లో విద్యుత్ అధికారులతో బస్తి బాట ఆకారపు అరుణ్ పటేల్



- రాబోయే వినాయక చవితి వేడుకల సందర్భంగా అధికారులతో బస్తి బాట నిర్వహించిన ఆకారపు అరుణ్ పటేల్
- శ్రీనివాసపురం,మధుర నగర్,రామ్ శంకర్ నగర్, కామాక్షపురం, రామ్ రెడ్డి నగర్, వెంక రెడ్డి నగర్ కాలనీలలో పర్యటన

**ఉప్పల్,సెప్టెంబర్ 1(భవిష్యత్ ప్రజాపాలన):** రేపు జరగబోయే వినాయక చవితి ఉత్సవాల దృష్టిలో పెట్టుకొని వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల పెద్దలు మరియు యువకుల అభ్యర్థన మేరకు యువనాయకుడు ఉప్పల్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ పటేల్ ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ అధికారులతో బస్తీ బాట కార్యక్రమం నిర్వహించారు. మండపాల వద్ద భక్తులకు, నిమర్జన సమయంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను కోరారు. ముఖ్యంగా ప్రమాదకరంగా ఉన్న పాత మెయిన్ ఎలక్ట్రిక్ వైర్ల స్థానంలో తక్షణమే నూతన కేబుల్ వైర్లను వేయాలని విద్యుత్ శాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, అధికారులు ఏఈ మేఘనాథ్ లైన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ లైన్మెన్ వెంకటేష్ కాంగ్రెస్ పార్టీ వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షులు రాజి రెడ్డి, మధుర నగర్ కాలనీ అధ్యక్షుడు మానకొండ రెడ్డి ప్రధాన కార్యదర్శి జగదీష్ బాలయ్య రామ్ రెడ్డి అధ్యక్షులు





సత్యనారాయణ వెంకన్న మల్లయ్య అరుణ్ సాయి,రాగి వెంకట్ రెడ్డి రంజిత్ రెడ్డి కృష్ణ గౌడ్ జలంధర్ కిషోర్ భాను శేఖర్ శ్రీను నవీన్ ముదిరాజ్ సునీత నాగ చారి అశోక్ హరీష్ పాషా శివ సాయి శీను భాస్కర్ శ్రీనివాస్పురం మధుర నగర్ రామ్ శంకర్ నగర్ కామాక్షిపురం రాంరెడ్డి నగర్ కాలనీవాసులు, వెంకట్ రెడ్డి నగర్ కాలనీ వాసులు డివిజన్ నాయకులు, కార్యకర్తలు మరియు వర్కింగ్ కమిటీ సభ్యులు కాలనీ వాసులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం

- గుర్తింపు కార్డులు, బస్‌పాస్‌లు ఇస్తామని సీఎం ప్రకటన.. జనగాంలో పాలాభిషేకం

**జనగాం,సెప్టెంబర్ 1 (భవిషత్ ప్రజాపాలన):**



తెలంగాణ ఉద్యమ కారులకు 250 గజాల ఇంటి స్థలం, గుర్తింపు కార్డులు, బస్‌పాస్‌లు అందిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఉద్యమకారులు జనగాం చౌరస్తాలో పాలాభిషేకం నిర్వహించారు. ముఖ్య మంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు గండి శ్రీను మాదిగ, మేధావుల ఫోరం జిల్లా అధ్యక్షుడు గొంగళ్ల కుమార్, సావిత్రిభాయి పూలే ఫౌండేషన్ చైర్మన్ యాసరపు కర్ణాకర్‌తో పాటు పలువురు ఉద్యమకారులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు చేసిన పోరాటాలను గుర్తించి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఉద్యమకారుల సంక్షేమానికి ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపట్టాలని వారు కోరారు. సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

బుధవారం,
సెప్టెంబర్ 02, 2026

భవిష్యత్ ప్రజాపాలన
తెలుగు దినపత్రిక



# ఇంజాపూర్‌లో ఘనంగా తీజ్ వేడుకలు

- **సేవాలాల్ మహారాజ్ ఆశయాలను ఐక్యతతో ముందుకు తీసుకెళ్లాలి: డాక్టర్ రాజ్ కుమార్ జాదవ్**

**రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన:** హైదరాబాద్ ఇంజాపూర్‌లో బంజారా సమాజం ఆధ్వర్యంలో తీజ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బంజారా జాతి సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, జీవన విధానాన్ని ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ వేడుకలు అంగరంగ వైభవంగా సాగాయి. ఈ కార్యక్రమానికి డాక్టర్ రాజ్ కుమార్ జాదవ్ హాజరై బంజారా సమాజ సభ్యులకు తీజ్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తీజ్ పండుగ బంజారా సమాజానికి ఎంతో విశిష్టమైన పండుగ అని డాక్టర్ రాజ్ కుమార్ జాదవ్ పేర్కొన్నారు. తరతరాలుగా బంజారా ప్రజలు తమ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ ఈ పండుగను నిర్వహిస్తూ వస్తున్నారని తెలిపారు. ఆధునిక కాలంలో ఎన్నో మార్పులు చోటుచేసుకుంటున్నప్పటికీ తమ మూలాలను, ఆచారాలను, సంస్కృతిని మరచిపోకుండా భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

**సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గంలో పయనించాలి**

ఈ సందర్భంగా డాక్టర్ రాజ్ కుమార్ జాదవ్ మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ బోధనలు బంజారా సమాజానికి ఎప్పటికీ మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. సేవాలాల్ మహారాజ్ సూచించిన ఐక్యత, సోదరభావం, సేవాభావం, నిజాయితీ వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. సమాజంలోని చిన్నా పెద్దా తేడాలు లేకుండా అందరూ ఒకే కుటుంబంలా కలిసి పనిచేసినప్పుడే బంజారా సమాజం మరింత అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. బంజారా సమాజ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని డాక్టర్ రాజ్ కుమార్ జాదవ్ అన్నారు. యువత విద్యపై ప్రత్యేక దృష్టి సారించి ఉన్నత స్థాయికి ఎదగాలని, ఉద్యోగ మరియు ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. అదే సమయంలో తమ సంస్కృతి, సంప్రదాయాలు, పూర్వీకుల ఆచార వ్యవహారాలపై అవగాహన పెంచుకుని వాటిని భావితరాలకు అందించాలని కోరారు.

**మన సంస్కృతే మన అసలైన గుర్తింపు**

"మన సంస్కృతి మన ఉనికికి గుర్తింపు.. మన సంప్రదాయాలు మన పూర్వీకులు మనకు అందించిన అమూల్యమైన వారసత్వం. కాలం మారినా మన మూలాలను మరచిపోకూడదు. సేవాలాల్ మహారాజ్ చూపిన ఐక్యతా మార్గంలో నడుస్తూ మన సంస్కృతిని కాపాడి భావితరాలకు అందించినప్పుడే మన బాధ్యత నెరవేరుతుంది" అని డాక్టర్ రాజ్ కుమార్ జాదవ్ అన్నారు. తీజ్ వేడుకల్లో బంజారా మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సంప్రదాయ దుస్తులు ధరించి, సంప్రదాయ పాటలు పాడుతూ, నృత్యాలతో సందడి చేశారు. తీజ్ పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సంప్రదాయ ఆచారాలతో



ఇంజాపూర్‌లో పండుగ వాతావరణం నెలకొంది. చిన్నారులు సైతం ఉత్సాహంగా పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

**సంస్కృతి పరిరక్షణకు ప్రాధాన్యం**

బంజారా సమాజానికి సంబంధించిన పండుగలు, ఆచారాలు, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు పరిచయం చేయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగ పడతాయని నాయకులు పేర్కొన్నారు. పండుగల ద్వారా సమాజంలో ఐక్యత పెరగడంతోపాటు యువతకు తమ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కలుగుతుందని తెలిపారు. ప్రతి గ్రామం, ప్రతి తండాలో బంజారా సంస్కృతి పరిరక్షణకు కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

**సమాజ అభివృద్ధితో పాటు సంస్కృతి పరిరక్షణ**

బంజారా సమాజం విద్య, ఉద్యోగం, వ్యాపారం, రాజకీయ, సామాజిక రంగాల్లో మరింత ముందుకు సాగాలని డాక్టర్ రాజ్ కుమార్ జాదవ్ ఆకాంక్షించారు. సమాజ అభివృద్ధి ఎంత ముఖ్యమో, సంస్కృతి పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని అన్నారు. ఆధునికతను స్వీకరిస్తూనే తమ మూలాలను కాపాడుకోవాలని సూచించారు. తీజ్ వేడుకలు బంజారా సమాజంలో ఆనందాన్ని, ఐక్యతను, సోదరభావాన్ని నింపాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి హాజరైన డాక్టర్ రాజ్ కుమార్ జాదవ్‌కు బంజారా సమాజ నాయకులు, పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొర్ర కల్యాణ్ నాయక్‌తో పాటు బంజారా సమాజ నాయకులు, పెద్దలు, మహిళలు, యువత, చిన్నారులు మరియు తదితరులు పాల్గొన్నారు. తీజ్ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బంజారా సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణే లక్ష్యంగా భవిష్యత్‌లో మరిన్ని సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

# సంచార పశు వైద్య అంబులెన్స్‌పై ఆకస్మిక తనిఖీలు

- **మందుల నిల్వలు.. సిబ్బంది పనితీరుపై అధికారుల పర్యవేక్షణ**
- **అత్యవసర సమయంలో పశు రైతులకు తక్షణ వైద్య సేవలు అందించాలని సూచన**

**రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన :** పశు రైతులకు అత్యవసర సమయాల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన సంచార పశు వైద్యశాల అంబులెన్స్‌లను జిల్లా స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నారు. అంబులెన్స్‌ల పనితీరు, అందులో పనిచేస్తున్న సిబ్బంది విధులు, మందుల నిల్వలు, అత్యవసర వైద్య పరికరాల పరిస్థితిని పరిశీలిస్తూ పశు రైతులకు సేవలు మరింత సమర్థవంతంగా అందేలా చర్యలు తీసుకుంటున్నారు. సంచార పశు వైద్యశాల అంబులెన్స్‌లు గ్రామీణ ప్రాంతాల్లో పశు రైతులకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తున్నాయి. పశువులకు అకస్మాత్తుగా అనారోగ్యం కలిగినప్పుడు, అత్యవసర చికిత్స అవసరమైన సందర్భాల్లో రైతులు దూర ప్రాంతాల్లోని పశువైద్యశాలలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అంబులెన్స్ ద్వారా వైద్య సేవలు అందుతున్నాయి.

**ఆకస్మిక తనిఖీలతో సిబ్బంది పనితీరుపై పర్యవేక్షణ**

జిల్లా అంబులెన్స్ కార్యనిర్వాహణ అధికారులు ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ అంబులెన్స్‌లో పనిచేస్తున్న సిబ్బంది విధుల నిర్వహణను పరిశీలిస్తున్నారు. విధులకు హాజరు, అత్యవసర కాల్స్‌కు స్పందించే విధానం, పశు రైతులకు అందిస్తున్న సేవలు, వైద్య సేవల నాణ్యత వంటి అంశాలను పరిశీలిస్తున్నారు. అదేవిధంగా అంబులెన్స్‌లో అవసరమైన మందులు, ఇంజెక్షన్లు, వైద్య పరికరాలు, ఇతర అత్యవసర సామగ్రి అందుబాటులో ఉన్నాయా లేదా అనే విషయాన్ని అధికారులు తనిఖీ చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో మందుల కొరత కారణంగా వైద్య సేవలకు అంతరాయం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచిస్తున్నారు.

**అత్యవసర వేళల్లో అందుబాటులో ఉండాలి**

పశు రైతులకు అత్యవసర సమయంలో సంచార పశు వైద్య అంబులెన్స్ సేవలు ఎంతో కీలకమని అధికారులు పేర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పశువులు రైతుల జీవనోపాధిలో కీలక భాగంగా ఉన్నందున వాటికి సకాలంలో వైద్యం అందించడం ద్వారా రైతులకు ఆర్థిక నష్టాన్ని నివారించవచ్చని తెలిపారు. "పశువుకు అత్యవసర వైద్యం అవసరమైన సమయంలో ఒక్క నిమిషం ఆలస్యం కూడా రైతుకు నష్టాన్ని కలిగించవచ్చు. అందుకే సంచార పశు వైద్య అంబులెన్స్




సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి. అవసరమైన మందులు, వైద్య పరికరాలు సిద్ధంగా ఉంచుకుని అత్యవసర సమయంలో పశు రైతులకు తక్షణమే సేవలు అందించాలి." అని అధికారులు సూచిస్తున్నారు.

**మందుల నిల్వలపై ప్రత్యేక దృష్టి**

అంబులెన్స్‌లో ఉన్న మందుల నిల్వలను అధికారులు ప్రత్యేకంగా పరిశీలిస్తున్నారు. అవసరమైన మందులు పూర్తిస్థాయిలో ఉన్నాయా, గడువు తేదీలు సక్రమంగా ఉన్నాయా, మందులను సరైన పద్ధతిలో భద్రపరుస్తున్నారా అనే అంశాలను తనిఖీ చేస్తున్నారు. అత్యవసర వైద్య సేవలకు ఉపయోగించే పరికరాలు పనిచేస్తున్నాయా లేదా అన్నది కూడా పరిశీలిస్తున్నారు. అంబులెన్స్ ఎల్లప్పుడూ అత్యవసర సేవలకు సిద్ధంగా ఉండేలా చూసుకోవాలని సిబ్బందికి సూచిస్తున్నారు. వాహనం నిర్వహణ, పరిశుభ్రత, వైద్య సామగ్రి అందుబాటు వంటి అంశాల్లో నిర్లక్ష్యం చేయరాదని స్పష్టం చేస్తున్నారు.

**పశు రైతులకు సేవలే లక్ష్యం**

సంచార పశు వైద్యశాల అంబులెన్స్‌ల ప్రధాన లక్ష్యం గ్రామీణ ప్రాంతాల్లోని పశు రైతులకు సకాలంలో వైద్య సేవలు అందించడమేనని అధికారులు పేర్కొన్నారు. రైతులు తమ పశువులకు అత్యవసర వైద్య అవసరం ఏర్పడినప్పుడు అందుబాటులో ఉన్న సంచార పశు వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. "పశు సంపదను కాపాడటం అంటే రైతు కుటుంబాల ఆర్థిక భద్రతను కాపాడటమే. పశు రైతులకు సకాలంలో నాణ్యమైన వైద్యం అందించడంలో సంచార పశు వైద్య అంబులెన్స్‌లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ప్రతి సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి రైతులకు అందుబాటులో ఉండాలి." అని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బస్ భవన్‌లో మీడియా సమావేశంలో

**మంత్రి పొన్నం ప్రభాకర్, రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ**

**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ సెప్టెంబర్ 2:** తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వంలో అధికారంలోకి వచ్చి 1000 రోజులు అవుతున్న సందర్భంగా రవాణా శాఖ & ఆర్టీసీ విజయాలు ప్రగతి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లో మహా లక్ష్మీ పథకం ద్వారా ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించాం.. ఇప్పటి వరకు 347.36 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారు. 12167 కోట్లు ఆదా చేసుకున్నారు. మహిళలు ఆర్థిక వృద్ధి సాధిస్తున్నారు.. అనేక మహిళా ప్రయోజనాలు జరిగాయి అని సర్వేలు చెబుతున్నాయి.. దేశంలో మొదటిసారిగా 600 బస్సులకు మహిళలను యజమానులను చేయడం జరిగింది. ప్రతి బస్సుకు 69,468 రూపాయలను ఈఎంఐ చెల్లిస్తుండగా నెలకు 4 కోట్లు చెలుస్తున్నాం.. ఇప్పటి వరకు 29.31 కోట్లు చెల్లించాం.. గతంలో 67;శాతం ఉంటే ఇప్పుడు 89శాతం ఆక్యుపెన్సీ పెరిగింది.. ఈవీ బస్సులు, నియామకాలు, కొత్త బస్సుల, సర్వీసు నుండి రిమూవ్ అయిన వారికి ఉద్యోగాలు ఇవ్వడం జరిగింది. 2932 కొత్త బస్సులు కొనుగోలు చేశాం.. 1024 ఎలక్ట్రిక్ బస్సులు విజయవంతంగా నడుస్తున్నాయి.. హైదరాబాద్ నగరంలో మరో 2200 కొత్త ఎలక్ట్రిక్ బస్సులు రోడ్డెక్కబోతున్నాయి. 1424 కారుణ్య నియామకాలు చేపట్టాం.. పేద ప్రజలకు లైఫ్ లైన్..దేశంలో ఇండియన్ లైఫ్ లైన్ రైల్వే లాగా ఆర్టీసీ లైఫ్ లైన్, ఎంఎంటీఎస్, మెట్రో, ఆర్టీసీ సమన్వయంతో లాస్ట్ మైల్ వరకు కనెక్టివిటీ చేయడం జరుగుతుంది.. ఎలక్ట్రానిక్ పేమెంట్ ట్రిమ్ మిషన్‌ల ద్వారా టికెట్ ఇవ్వడం జరుగుతుంది. తార్నాక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అభివృద్ధి చేయడం జరిగింది.. ఆర్టీసీ కమికులకు రెండు పీఆర్సీలు ఇచ్చాం.. 5 డీఏలు ఇచ్చాం..పెండింగ్ డీఏలు లేవు.. యూనియన్ ఎన్నికలు జరుపుతున్నాం..



తరువాత విలీనం ప్రక్రియ పూర్తి చేస్తాం.. ఆర్టీసీ విప్లవాత్మక మార్పులు జరుగుతున్నాయి. పీఎం డ్రైవ్ కింద హైదరాబాద్‌లో ఈవీ బస్సులు నడుపుతున్నం.. సర్వీసు నుండి రిమూవ్ అయిన దాదాపు 244 మంది ఉద్యోగులను ప్రత్యేక ఐఏఎస్ కమిటీ ద్వారా తిరిగి తీసుకోవడం జరిగింది.. హైదరాబాద్‌లో కాలుష్యాన్ని తగ్గించడానికి ఈవీ పాలసీ తీసుకొచ్చాం 1400 కోట్ల పన్ను మినహాయింపు ఇచ్చాం.. బస్ స్టేషన్లు ఆధునీకరిస్తున్నాం.. పెద్దపల్లి, ఏటూరు నాగారం డిపోలు ఇచ్చాం.. సిసిఎస్ బకాయిలు 1096 కోట్ల నుండి 939 కోట్లకు తగ్గించాం.. పిఎఫ్ బకాయిలు 2108 కోట్లు నుండి 1710 కోట్లకు తగ్గించాం.. ఎస్ ఆర్ బి ఎస్ & ఎస్‌బిటి బకాయిలు 513 కోట్ల నుండి 485 కోట్లకు తగ్గించబడ్డాయి.. 4538 ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చాం.. 1000 డ్రైవర్, 743 శ్రామిక, పోస్టుల నియామకాలు పూర్తయ్యాయి వచ్చే నెలలలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలు అందివ్వడం జరుగుతుంది. 1500 కండక్టర్ నియామకాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఎక్కడ పొరపాటు జరగకుండా పారదర్శకంగా పోలీస్ డిపార్ట్మెంట్ ద్వారా నియామకాలు చేపట్టాం.. 240 డీజిల్ బస్సులు రిటైర్ఫిట్మెంట్ చేస్తున్నాం.. హైదరాబాద్‌లో ఆటో లను రిటైర్ఫిట్మెంట్ చేయడానికి 1.50లక్షలు సహాయం అందిస్తుంది.. ఆర్టీసీ దేశంలో ఉన్నత స్థానంలో ఉంది అంటే క్షేత్ర స్థాయిలో పని చేస్తున్న డ్రైవర్ కండక్టర్‌ల కృషి అభినందనీయం.. గోదావరి పుష్కరాలుకు బస్ స్టేషన్లు ఆధునికరిస్తున్నాం.. బస్‌లు రన్ చేస్తాం.. మేడారం జాతర కు విజయవంతంగా బస్‌లు రన్ చేశాం.. ఆర్టీసీలో ఎక్కడ వేధింపులు ఉండవద్దనీ రవాణా శాఖ చెక్ పోస్టులు ఎత్తివేసింది.. జిల్లాలో ఎన్ఫోర్స్మెంట్ టీంలు పెంచింది.. టిఎస్ నుండి టిజీగా మార్చుకున్నాం.. వాహన& సారథి తీసుకొచ్చాం.. స్క్రాప్ పాలసీ తీసుకొచ్చాం.. గత 10 సంవత్సరాలుగా వాహన సారథి లో చేరనిధి తెలంగాణ మాత్రమే ముఖ్యమంత్రి సూచనలతో చేరాం.. ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్ట్‌లు ప్రారంభిస్తున్నాం.. రవాణా శాఖలో 113 ఏఎన్‌విఐలు 50 మంది కానిస్టేబుల్, 20 మంది జూనియర్ అసిస్టెంట్, 4 ఎన్‌వీలు లను నియమించాం.. రోడ్ సేఫ్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.. అర్రైవ్ అలైవ్ ద్వారా పోలీస్ శాఖా ద్వారా అనేక కార్యక్రమాలు చేపట్టాం.. రహవీర్ స్కీమ్ అమలు చేస్తున్నాం..ప్రమాదం జరిగినపుడు వెంటనే హాస్పిటల్ లో జాయిన్ చేయాలి.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో డిప్యూటీ సీఎం గారు ఎప్పటికప్పుడు రావాల్సిన నిధులు మంజూరు చేస్తున్నారు.. శాసన సభ నడుస్తున్నప్పుడు అన్ని జిల్లాల ప్రజా ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశాం.. వాళ్ళు చాలా సంతృప్తి వ్యక్తం చేశారు.. ప్రజా ప్రతినిధులు కొత్త రూట్‌లు అడిగితే బస్‌లు వేస్తున్నాం.. హైదరాబాద్‌లో 370 కొత్త రూట్‌లలో బస్‌లు నడిపిస్తున్నాం.. గ్రామాల్లో కూడా బస్ రూట్‌లులేని ప్రాంతాల్లో బస్ లు నడిపిస్తున్నాం.. దేశంలో నంబర్ 1గా ఆర్టీసీ రవాణా శాఖ ఎదుగుతుంది మా సిబ్బంది కృషి అధికారుల పనితీరుతో ఆర్టీసీ మరింత అభివృద్ధి చెందుతుంది. ప్రతి నెల మంగళవారం కార్మికుల గ్రీవెన్స్ ఏర్పాటు చేశాం..వారి సమస్యలు పరిష్కారం చేస్తున్నాం. ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికల్లో గెలిచిన ప్రతినిధులతో అధికారుల కమిటీ వేసి విలీన ప్రక్రియ పూర్తి చేస్తాం.. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఇబ్బందులు రాకుండా ఇక్కడ చర్యలు తీసుకుంటున్నాం.. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం తో పాటు సంస్థ ప్రగతి ను ముందుకు తీసుకుపోతాం.. రోడ్ సేఫ్టీ సెస్ రోడ్డు భద్రత కు ఉపయోగించుకునేలా చట్టం చేసుకుని ముందుకు పోతున్నాం.. రవాణా శాఖలో అనేక సంస్కరణలు తీసుకొచ్చినమ్.. విభజనలో రెండు రాష్ట్రాలు సామరస్య పూర్వకంగా పరిష్కరించుకుంటాం..రాత్రి బస్సులు నడుపుతుంటే మహిళలకు రక్షణ ఉంటుందని కోరారు.. కొన్ని రూట్‌లలో హైదరాబాద్‌లో నైట్ బస్సులు నడుస్తున్నాయి..

# ఘనంగా వంశీ గౌడ్-భార్గవి వివాహ వేడుకలు

- **నూతన వధూవరులను ఆశీర్వదించిన ప్రముఖులు.. బంధుమిత్రుల సందడి**
- **మన్నెగూడలో వైభవంగా వివాహ మహోత్సవం**

**మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన, రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం:** మన్నెగూడలోని జి.వి.ఆర్. కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో వంశీ గౌడ్-భార్గవి వివాహ మహోత్సవం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్నేహితులు, శ్రేయోభిలాషుల సమక్షంలో అత్యంత వైభవంగా జరిగింది. సమ్మెట్ గెనుకుంట్ల నర్సింలు గౌడ్ ఏకైక కుమారుడు వంశీ గౌడ్, చింతాకుల లక్ష్మి-కీ.శే. చింతాకుల లక్ష్మయ్య దంపతుల ఏకైక కుమార్తె భార్గవి (బీకాం) వివాహ బంధంతో ఒక్కటయ్యారు. వేదమూర్తులైన బ్రాహ్మణోత్తములు నిర్ణయించిన శుభ ముహూర్తంలో వేద మంత్రోచ్ఛారణల నడుమ వివాహ క్రతువులు ఘనంగా నిర్వహించారు. "వివాహ బంధం రెండు మనసుల కలయిక మాత్రమే కాదు.. రెండు కుటుంబాల అనుబంధానికి నాంది. ప్రేమ, పరస్పర గౌరవం, నమ్మకంతో నూతన దంపతుల జీవితం ఆనందంగా సాగాలి" అంటూ ఈ సందర్భంగా పలువురు ఆకాంక్షించారు. వివాహ వేడుకకు బడంగ్‌పేట్ 30వ వార్డు కార్పొరేటర్ స్వప్న జంగారెడ్డి, ఎంసీఆర్ కాలనీ అధ్యక్షుడు సురేష్, నరసింహ చౌదరి, మాజీ అధ్యక్షుడు అరుణ్, మాజీ కార్యదర్శి నర్సింగ్ నాయక్, జయరాం నాయక్, కాలనీ సీనియర్ సభావత్ రాములు నాయక్, చింటూ నాయక్, ప్రసాద్ తదితర ప్రముఖులు, నాయకులు, బంధుమిత్రులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివాహ మహోత్సవానికి విచ్చేసిన అతిథులకు వధూవరుల కుటుంబ సభ్యులు ఆత్మీయ స్వాగతం పలికారు. నూతన దంపతులను ఆశీర్వదించేందుకు పెద్ద సంఖ్యలో బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు తరలిరావడంతో ఫంక్షన్ హాల్‌లో సందడి నెలకొంది. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల ఆనందోత్సాహాల మధ్య వివాహ వేడుక కన్నుల పండువగా సాగింది. వధూవరుల కుటుంబ సభ్యులు తమ ఆహ్వానాన్ని మన్నించి వివాహ వేడుకకు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. వంశీ గౌడ్-భార్గవి దంపతుల నూతన దాంపత్య జీవితం ప్రేమ, అనురాగం, పరస్పర నమ్మకం, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో నిండి ఉండాలని బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

## బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్

# ప్రెస్ మీట్ తెలంగాణ భవన్




రేవంత్ రెడ్డి సిగ్నేచర్ భాష మురికి భాష
అంబర్ పేటలో రేవంత్ మరోసారి బజారు భాష మాట్లాడారు
కేసీఆర్ గారు తెలంగాణ పాలిట నంది
అన్నిటినీ తట్టుకుని ప్రాణ త్యాగానికి సిద్దపడి కేసీఆర్ తెలంగాణ తెచ్చారు
కాంగ్రెస్ పందికొక్కులు, రాబందుల చేతిలో తెలంగాణ బందీ అయింది
కాంగ్రెస్ నేతలూ పందికొక్కులా పందులా ప్రజలు డిసైడ్ చేస్తారు
రేవంత్ రెడ్డి !మీ నుంచి ప్రజలు నిజాలు ఆశించడం లేదు
ప్రజలు తన చేతిలో మోసపోవాలని కోరుకుంటారబి రేవంత్ రెడ్డి ఎపుడో చెప్పారు
బీ ఆర్ ఎస్ సీనియర్ నాయకులను తిట్టేందుకే 15 కోట్ల ప్రజా ధనం తో సభ పెట్టుకుంటున్నావ్
రేవంత్ వెయ్యి రోజుల పాలన వెయ్యి రోజుల పీడన,వెయ్యి రోజుల వంచన
కేటీఆర్ ఇచ్చిన నిరసన కార్యక్రమాలు ప్రజాస్వామ్య బద్దంగా ఉన్నాయి
ఛార్జీషీట్ కాంగ్రెస్ నేరస్థుల మీద వేస్తున్నాం
కాంగ్రెస్ దొంగల నుండి యూనిఫార్మ్ లేకుండా గస్తీ తిరుగుతున్న
ఇది ప్రిలిమినరీ ఛార్జీషీట్ మాత్రమే
మీరు చేసిన నేరాలకు ఏ శిక్షలు ఉంటాయో చార్జీ షీట్ లో పెడతాం
సీఎం ఎక్కడికి రమ్మంటారో అక్కడకు వస్తా
అవుట్ సోర్సింగ్ ,కాంట్రాక్టు వాళ్లకు నెల మొదటి తారీఖున వస్తున్నాయా తెలుసుకుందాం
కాంగ్రెస్ సానుభూతిపరురాలు అయిన రిటైర్డ్ ఉద్యోగి లలిత కుమారి కమిషన్ ఇస్తేనే బెనిఫిట్స్ ఇస్తున్నారని ఆరోపించారు
కే టీ ఆర్ ఇచ్చిన పిలుపులో రాజ్యాంగాన్ని ఎక్కడా ఉల్లంఘించలేదు
ఆర్టికల్ 19 ప్రకారం ప్రజలకు నిరసన తెలిపే హక్కు ఉంది
మిర్యాల గూడ లో 3 న కే టీ ఆర్ సభకు అనుమతి ఎందుకు నిరాకరించారు ?
సెక్షన్ 30 ఎందుకు పెట్టారు ?
హై కోర్టుకు వెళితే గానీ సరూర్ నగర్ సభకు అనుమతి ఇవ్వలేదు
రాష్ట్రం లో సెక్షన్ 30 ఎందుకు పెట్టారు ?
డీజీపీ క్రికెట్ లో సెంచరీ కొట్టాడు .తప్పుల్లో సెంచరీ కొట్టొద్దు
ఏవైనా మత పరమైన ఊరేగింపులు ఉంటే తప్ప సెక్షన్ 30 పెట్టరు
33 నెలలుగా రాష్ట్రంలో అప్రకటిత కర్ఫ్యూ అమల్లో ఉంది
మా నేతలు హరీష్ రావు ఇంకా చాలా మందిని అనేక సందర్భాల్లో హౌజ్ అరెస్టులు చేశారు
పెళ్ళికి పోయినా చావుకు పోయినా పోలీసులు మా పై నిఘా పెడుతున్నారు
రేవంత్ రెడ్డి భాషతోనే రాష్ట్రం లోనే నేరాల సంఖ్య పెరుగుతోంది
రూపారెడ్డి, శిరీషాల హత్యలు జరగడానికి రేవంత్ రెడ్డి హోం మంత్రిగా ఫెయిల్ కావడమే కారణం
రేవంత్ రెడ్డి పొలాలు రక్తంతో పండుతాయన్నారు
అచ్చం పేట లో ఓ వ్యక్తి శవాన్ని సమాధి నుంచి బయటకు తీసి దహనం చేశారు .ఎందుకంటే అట్లా చేస్తే వర్షాలు పడ్తాయని ఆ గ్రామస్థులు చెప్పారు
సీఎం మూఢనమ్మకాలు ప్రచారం చేస్తున్నారు
సీఎం మీ డ్యూటీ మీరు సరి చేయకుండా ప్రతిపక్ష నేతను తప్పుపట్టి రాజీనామా చేయమంటున్నారు
ప్రతిపక్ష నేత ను రాజీనామా చేయమంటూ ర్యాలీలకు పిలుపునిస్తే సెక్షన్ 30 వర్తించదా ?
కేసీఆర్ 3 .0
తెలంగాణ ను మళ్ళీ ఎట్లా బాగు చేయాలో కేసీఆర్ రాత్రిబవలు ఆలోచిస్తున్నారు
17లోక్ సభలో రాహుల్ ఐదు సార్లు కూడా డిబేట్ లో పాల్గొనలేదు
16వ లోక్ సభలో రాహుల్ అడిగిన ప్రశ్నలు సున్నా
సోనియా ఎన్ని సార్లు లోక్ సభ కు వచ్చారో లెక్కలు తీద్దామా ?
రేవంత్ ఢిల్లీ కి 77 సార్లు వెళ్ళావ్ ..అసెంబ్లీ కి ఎన్ని సార్లు వచ్చావ్
మల్కాజ్ గిరి ఎంపీ గా రేవంత్ హాజరు 20 శాతం మాత్రమే
పిచ్చి పిచ్చి విమర్శలు రేవంత్ మానుకోవాలి
తెలంగాణ ను మూడు భాగాలుగా విభజించి సీఎం మంత్రులు పంచుకుంటున్నారు
పోలీసుల అనుమతితోనే మేము నిరసనలు చేస్తాం
కాంగ్రెస్ కో న్యాయం బీ ఆర్ ఎస్ కో న్యాయం అన్నట్టు పోలీసులు వ్యవహరించవద్దు
రేవంత్ రెడ్డి హోం మంత్రిగా పోలీసులతో పదే పదే తప్పులు చేయిస్తున్నారు
పోలీసులు రేవంత్ అక్రమ ఆదేశాలకు లొంగిపోవద్దు
ఫోరెన్సిక్ ల్యాబ్ లో బీ ఆర్ ఎస్ నేతల పై తప్పుడు సాక్ష్యాధారాలను సృష్టించే కుట్ర జరుగుతోంది
..ఫోన్ ట్యాపింగ్ కేసులో కక్ష తోనే బీ ఆర్ ఎస్ నేతలకు నోటీసులు ఇచ్చారు
...రేవంత్ సభలకు అన్నీ అనుమతులు తీసుకుంటున్నారా ?
...సుప్రీం కోర్టు కాక్రోచ్ జనతా పార్టీ ర్యాలీ కి కి అనుమతివ్వాల్సిందేనని ఢిల్లీ పోలీసులకు ఆదేశాలిచ్చింది
సుప్రీం కోర్టు ఆదేశాలు ఇక్కడ వర్తించవా ?
బీ ఆర్ ఎస్ శాంతి యుత పద్ధతుల్లోనే వ్యవహరిస్తుంది .రేవంత్ కల్లోల భాష లాగా మేము మాట్లాడం
సీఎం అక్రమ ఆదేశాలను డీజీపీ పోలీసు అధికారులు పట్టించుకోకుండా బీ ఆర్ ఎస్ నిరసనలకు అనుమతి ఇవ్వాలి
సెక్షన్ 30 ఎత్తేయాలి
ఫోన్ ట్యాపింగ్ కేసులో రెండు సిట్ లు వేయడం తెలుగు రాష్ట్రాల్లో ఇదే ప్రథమం
..శాంతి భద్రతలు అదుపు తప్పడానికి పోలీసులు ఫోన్ ట్యాపింగ్ లాంటి కేసులపై దృష్టి సారించడమే కారణం
రేవంత్ రెడ్డి దగ్గర మార్కులు కొట్టేయడానికి బీ ఆర్ ఎస్ నేతలపై కక్ష తో పని చేస్తున్న పోలీసులకు కెసిఆర్ 3 .0 పాలనలో శిక్షలు తప్పవు
(ఈ ప్రెస్ మీట్ లో కార్పొరేషన్ మాజీ చైర్మన్లు రామచంద్ర నాయక్ ,పల్లె రవికుమార్ ,గాంధీ నాయక్ ,బీ ఆర్ ఎస్ నేతలు బొమ్మెర రామమూర్తి ,హరి రమాదేవి పాల్గొన్నారు )

### 70వ ఎస్‌జీఎఫ్ఐ జిల్లా స్థాయి పాఠశాల క్రీడా పోటీలను ప్రారంభించిన
## టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ గారు



హైదరాబాద్ జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (SGFI) అంతర్ పాఠశాల జిల్లా స్థాయి క్రీడా పోటీలు-2026-27 మంగళవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ప్రారంభ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడా పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి బాటలు వేయవచ్చని అన్నారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలికి దోహదం చేస్తాయని పేర్కొన్నారు. గ్రామీణ, ప్రభుత్వ పాఠశాలల్లోని క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతో ఉపయోగపడతాయని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. విద్యార్థులు గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని ఆయన ఆకాంక్షించారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో బాలురు, బాలికలకు వివిధ క్రీడాంశాల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచే క్రీడాకారులను గుర్తించి, తదుపరి స్థాయి పోటీలకు ఎంపిక చేయడం ద్వారా వారికి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు లభిస్తాయని నిర్వాహకులు తెలిపారు.

# పశువుల ప్రాణాలకు ఆపన్నహస్తం..
## 1962 సంచార పశు వైద్యశాల అంబులెన్స్ సేవలు

- **వర్షాకాలంలో పశువులకు అత్యవసర వైద్యం.. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచన**



**రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన :** పశుపోషక రైతులకు అండగా తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సంచార పశు వైద్యశాల అంబులెన్స్ 1962 సేవలు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్నాయి. ప్రతి అసెంబ్లీ నియోజక వర్గానికి ఒకటి చొప్పున 119 నియోజకవర్గాలకు 119 అంబులెన్సులను ప్రభుత్వం అందుబాటులో ఉంచి పశువులకు అత్యవసర వైద్య సేవలను అందిస్తోంది.

**అత్యవసర వేళల్లో 1962కు ఫోన్ చేస్తే వైద్య సేవలు**

పశువులకు అకస్మాత్తుగా అనారోగ్యం కలిగినా, ప్రమాదాలు జరిగినా, ప్రసవ సమయంలో అత్యవసర పరిస్థితులు ఎదురైనా పశుపోషక రైతులు 1962 సంచార పశు వైద్యశాల అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పశువుల వద్దకే వైద్య సిబ్బంది చేరుకుని అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్సలు అందించడం ఈ సేవల ప్రధాన ఉద్దేశ్యంగా ఉంది.

**వర్షాకాలంలో మరింత అప్రమత్తత అవసరం**

ప్రస్తుతం వర్షాకాలం కొనసాగుతున్న నేపథ్యంలో పశువులకు వివిధ రకాల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. పశువుల్లో అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా 1962కు సమాచారం అందించి సంచార పశు వైద్యశాల సేవలను పొందాలని కోరుతున్నారు. వర్షాల కారణంగా తేమ, అపరిశుభ్ర వాతావరణం, మేతలో మార్పులు తదితర కారణాలతో పశువులకు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంటుందని, అత్యవసర పరిస్థితుల్లో సమయం వృథా చేయకుండా వైద్య సహాయం పొందడం ఎంతో కీలకమని అధికారులు పేర్కొంటున్నారు.

**అంబులెన్స్ సేవలకు ఆకస్మిక తనిఖీలు**

సంచార పశు వైద్యశాల అంబులెన్సులు నిరంతరం అందుబాటులో ఉండేలా జిల్లా అంబులెన్స్ కార్యనిర్వాహణ అధికారులు ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. అంబులెన్స్‌లలో సిబ్బంది పనితీరు, మందుల నిల్వలు, అవసరమైన వైద్య పరికరాలు తదితర అంశాలను పరిశీలిస్తూ అత్యవసర సమయంలో పశు రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సేవలు అందించాలని సిబ్బందికి సూచిస్తున్నారు. అంబులెన్స్‌లో అవసరమైన మందులు, వైద్య సామగ్రి అందుబాటులో ఉన్నాయా లేదా అనే విషయాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పశువులకు సకాలంలో వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నారు.

**సేవలకు నిదర్శనంగా అంబులెన్స్ ఫొటోలు**

ఇప్పటివరకు సంచార పశు వైద్యశాల అంబులెన్స్‌ల ద్వారా అందించిన సేవలకు సంబంధించిన ఫొటోలు పశువులకు అత్యవసర సమయాల్లో అందుతున్న వైద్య సహాయానికి మచ్చుతునకగా నిలుస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పశువుల వద్దకే వెళ్లి వైద్య సేవలు అందించడం ద్వారా రైతులకు ఈ సేవలు ఎంతో ఉపయోగకరంగా మారాయి. పశువుల ఆరోగ్యం రైతు కుటుంబాల ఆర్థిక భద్రతకు బలమైన ఆధారం. అత్యవసర వేళలో ఒక్క ఫోన్ కాల్‌తో పశువుల వద్దకే వైద్య సేవలు చేరేలా ప్రభుత్వం అందిస్తున్న 1962 సేవలను ప్రతి పశుపోషక రైతు సద్వినియోగం చేసుకోవాలి.

**రైతులకు కీలక సూచన**

పశువులకు అత్యవసర వైద్య అవసరం ఏర్పడినప్పుడు సమీపంలోని పశు వైద్య సిబ్బందిని సంప్రదించడంతో పాటు 1962 సంచార పశు వైద్యశాల అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలని అధికారులు కోరుతున్నారు. పశువుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే వైద్య సహాయం పొందితే ప్రాణనష్టం, ఆర్థిక నష్టాన్ని నివారించవచ్చని సూచిస్తున్నారు. 119 నియోజకవర్గాలు.. 119 అంబులెన్సులు.. పశు రైతులకు నిరంతర వైద్య సేవలు అందిస్తూ సంచార పశు వైద్యశాల అంబులెన్స్ వ్యవస్థ ముందుకు సాగుతోంది.

## ప్రపంచ స్థాయి విద్యా వ్యవస్థ అంటూ బడాయి కొట్టే రేవంత్ రెడ్డి..
### నెలలు గడుస్తున్నా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడం సిగ్గుచేటు



మాజీ మంత్రి బిఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు

గత రెండున్నరేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో తెలంగాణలోని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. అధ్యాపకులు, నాన్‌టీచింగ్ సిబ్బందికి నెలల తరబడి జీతాలు అందక నరకం చూస్తున్నారు. అద్దెలు, విద్యుత్ బిల్లులు, యూనివర్సిటీ ఫీజులు, ఇతర నిర్వహణ ఖర్చులు భరించలేక కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. మీ తీరు వల్ల ఒకప్పుడు రాష్ట్రంలో సుమారు 960గా ఉన్న ప్రైవేట్ డిగ్రీ కళాశాలల సంఖ్య ఇప్పుడు దాదాపు 650కి పడిపోయింది. అంటే ఇప్పటికే సుమారు 310 కళాశాలలు తగ్గిపోయాయి. ఇదే పరిస్థితి కొనసాగితే మరిన్ని కళాశాలలు మూతపడే ప్రమాదం ఉంది. దీని ప్రభావం అత్యధికంగా గ్రామీణ తెలంగాణపై పడుతుంది. చిన్న పట్టణాలు, మండలాలు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ కళాశాలలు పరిమితంగా ఉన్న నేపథ్యంలో ప్రైవేట్ కళాశాలలే పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్య అందించే ప్రధాన కేంద్రాలు. ఒక కళాశాల మూతపడటం అంటే ఆ ప్రాంతంలోని వందలాది, వేలాది మంది విద్యార్థులకు ఉన్నత విద్య దూరం కావడమే. ముఖ్యంగా పేద, బడుగు, బలహీన వర్గాలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉన్నత విద్యకు భరోసాగా నిలిచింది. ప్రభుత్వం చెల్లించాల్సిన నిధులను ఏళ్ల తరబడి పెండింగ్‌లో పెట్టడం వల్ల ఆ భారం కళాశాలలు, అధ్యాపకులు, సిబ్బంది, చివరికి విద్యార్థులపైనే పడుతోంది. తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ & పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు తమ సమస్యలను మా దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రం అందించారు. కొన్ని కళాశాలల్లో అధ్యాపకులు, సిబ్బందికి 5 నుంచి 10 నెలల వరకు జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలాది కుటుంబాల జీవనోపాధితో ముడిపడి ఉన్న ఈ సమస్యపై ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణం. బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చే నాటికి 2500 కోట్ల ఫీజు రియింబర్స్ మెంట్ బకాయిలు ఉంటే, ఆ బకాయిలు చెల్లించి ఆ పథకాన్ని కొనసాగించినం. కేసీఆర్ గారు.. పెద్ద నోట్ల రద్దు జరిగినా, కరోనా విపత్తు వచ్చినా ఫీజు రియింబర్స్ మెంట్ ఆపలేదు. తొమ్మిదిన్నరేండ్లలో గత కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన బకాయిలతో సహా 19,500 కోట్లు ఫీజు రియింబర్స్ మెంట్ రూపంలో కేసీఆర్ ప్రభుత్వం చెల్లించింది. మేనిఫెస్టోలోనేమో. "ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ వర్గాల విద్యార్థులందరికి ఫీయి రియింబర్స్ మెంట్ తో పాటు పాత బకాయిలు పూర్తిగా చెల్లింపు" అన్నరు. ఇప్పటికి మూడు బడ్జెట్లు అయిపోయినయి. దాదాపు 10,000 కోట్ల బకాయిలు పెండింగ్ లో ఉన్నయి. వైయస్ఆర్ గారు ప్రారంభించిన పథకం అంటూ గొప్పలు చెప్పుకునే మీకు ఆ పథకాన్ని సక్రమంగా అమలు చేసే బాధ్యత లేదా? ఇది కేవలం ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల సమస్య కాదు.. విద్యార్థుల భవిష్యత్తు, అధ్యాపకులు, సిబ్బంది మనుగడకు సంబంధించిన సమస్య. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే పూర్తిగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం. భవిష్యత్తులో బకాయిలు పేరుకుపోకుండా ప్రతి విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నిర్ణీత గడువులో విడుదల చేసే శాశ్వత విధానాన్ని అమలు చేయాలని కోరుతున్నాం. ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయకుంటే ఈ అంశంపై అసెంబ్లీని స్తంభింప చేస్తామని హెచ్చరిస్తున్నాం.

# 102 అంబులెన్స్ సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలి

- **ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలకు 102 పైలట్ ధార అశోక్ విజ్ఞప్తి**



**రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన :** గర్భిణీలు, హైరిస్క్ గర్భిణీలు, ప్రసవ సమయాల్లో అత్యవసర పరిస్థితులు ఎదుర్కొంటున్న మహిళలు, నవజాత శిశువులు, చిన్నారులకు అత్యవసర సమయాల్లో 102 అంబులెన్స్ సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలని 102 అంబులెన్స్ పైలట్ ధార అశోక్ సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో 102 అంబులెన్స్ సేవలపై ప్రతి కుటుంబానికి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

**ఆశా డే సమావేశంలో అవగాహన కార్యక్రమం**

కందుకూరు మండలంలోని కందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆశా డే సమావేశంలో 102 అంబులెన్స్ సేవలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హుమేరా మేడం సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో కందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 102 అంబులెన్స్ పైలట్ ధార అశోక్ మాట్లాడుతూ గర్భిణీలకు సకాలంలో వైద్య సేవలు అందించడంలో 102 అంబులెన్స్ సేవలు ఎంతో కీలకమైనవని తెలిపారు. గర్భిణీలను ఆసుపత్రికి సురక్షితంగా తరలించేందుకు అవసరమైన సమయంలో 102 అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

**ప్రతి కుటుంబానికి 102 సేవపై అవగాహన కల్పించాలి**

గ్రామీణ ప్రాంతాల్లో అనేక కుటుంబాలకు 102 అంబులెన్స్ సేవలపై పూర్తి అవగాహన లేకపోవచ్చని ధార అశోక్ తెలిపారు. అందువల్ల ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు తమ పరిధిలోని ప్రతి గర్భిణీ, వారి కుటుంబ సభ్యులకు 102 అంబులెన్స్ సేవల గురించి ముందుగానే వివరించాలని కోరారు. ప్రసవ సమయం దగ్గరపడినప్పుడు ప్రైవేట్ వాహనాల కోసం ఎదురుచూడకుండా, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే 102 అంబులెన్స్ సేవలను వినియోగించుకునేలా గర్భిణీలు, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని సూచించారు. సమయానికి అంబులెన్స్ అందుబాటులోకి రావడం ద్వారా తల్లి, బిడ్డను సురక్షితంగా ఆసుపత్రికి తరలించే అవకాశం ఉంటుందని తెలిపారు.

**హైరిస్క్ గర్భిణీలపై ప్రత్యేక దృష్టి**

హైరిస్క్ గర్భిణీలను ముందుగానే గుర్తించి వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం ఎంతో అవసరమని ధార అశోక్ పేర్కొన్నారు. ఇలాంటి గర్భిణీలకు అత్యవసర పరిస్థితి ఏర్పడే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. గర్భిణీలను గుర్తించడం నుంచి ఆసుపత్రికి సురక్షితంగా తరలించే వరకు ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది, 102 అంబులెన్స్ సిబ్బంది మధ్య సమన్వయం ఎంతో కీలకమని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో సమన్వయంతో పనిచేస్తే తల్లి, శిశువుల ప్రాణాలను కాపాడేందుకు మరింత మెరుగైన అవకాశాలు ఉంటాయని చెప్పారు.

**తల్లి, శిశు ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం**

తల్లి, శిశు ఆరోగ్య పరిరక్షణలో ప్రభుత్వ వైద్య సేవలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ధార అశోక్ అన్నారు. ముఖ్యంగా గర్భిణీలకు ప్రసవానికి ముందు, ప్రసవ సమయంలో, ప్రసవం అనంతరం అవసరమైన వైద్య సేవలు సకాలంలో అందేలా క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు కీలక బాధ్యత పోషిస్తున్నారని తెలిపారు. నవజాత శిశువులు, చిన్నారులకు అత్యవసర వైద్య అవసరాలు ఏర్పడినప్పుడు కూడా 102 అంబులెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలో ప్రజలకు నిరంతరం అవగాహన కల్పించడం ద్వారా ప్రభుత్వ అత్యవసర రవాణా సేవలు మరింత మందికి చేరువవుతాయని పేర్కొన్నారు.

**సకాలంలో స్పందిస్తే ప్రాణాలు కాపాడవచ్చు**

అత్యవసర వైద్య పరిస్థితుల్లో ప్రతి నిమిషం ఎంతో విలువైనదని ధార అశోక్ అన్నారు. గర్భిణీకి ప్రసవ నొప్పులు ప్రారంభమైనప్పుడు లేదా హైరిస్క్ గర్భిణీ ఆరోగ్య పరిస్థితిలో మార్పులు కనిపించినప్పుడు ఆలస్యం చేయకుండా 102 అంబులెన్స్ సేవలను సంప్రదించాలని సూచించారు. "అత్యవసర సమయంలో ఆలస్యం చేయకుండా సకాలంలో వైద్య సహాయం పొందడం తల్లి, బిడ్డల ఆరోగ్యానికి ఎంతో ముఖ్యం. 102 అంబులెన్స్ సేవ ప్రతి అవసరమైన గర్భిణీకి చేరాలి. గ్రామస్థాయిలో ప్రతి కుటుంబానికి 102 సేవపై అవగాహన కల్పించి, అవసరమైన సమయంలో ఈ ఉచిత ప్రభుత్వ రవాణా సేవను సద్వినియోగం చేసుకునేలా చేయాలి" అని ధార అశోక్ విజ్ఞప్తి చేశారు.

**ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంల పాత్ర కీలకం**

గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణీలకు ప్రభుత్వ వైద్య సేవలను చేరువ చేయడంలో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంల పాత్ర ఎంతో కీలకమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. తమ పరిధిలోని గర్భిణీల వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, హైరిస్క్ గర్భిణీలను గుర్తించి అవసరమైన సమయంలో వెంటనే 102 అంబులెన్స్ సేవలను వినియోగించుకునేలా కుటుంబ సభ్యులకు ముందస్తు అవగాహన కల్పించాలని కోరారు.

**అంబులెన్స్ సిబ్బందితో సమన్వయం**

అత్యవసర పరిస్థితుల్లో 102 అంబులెన్స్ సిబ్బందికి సరైన సమాచారం అందించడం, గర్భిణీ ఉన్న ప్రదేశాన్ని స్పష్టంగా తెలియజేయడం, అవసరమైన వైద్య వివరాలను అందుబాటులో ఉంచడం ద్వారా సేవలు వేగంగా అందేలా సహకరించాలని సూచించారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది, 102 అంబులెన్స్ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే తల్లి, శిశు ఆరోగ్య పరిరక్షణలో మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చని ధార అశోక్ తెలిపారు. కందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమంలో కందుకూరు పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. 102 అంబులెన్స్ సేవలను గ్రామీణ ప్రాంతాల్లో మరింత విస్తృతంగా ప్రజలకు చేరువ చేసి, అత్యవసర సమయంలో ప్రతి గర్భిణీ, నవజాత శిశువు, చిన్నారికి సకాలంలో రవాణా సౌకర్యం అందేలా కృషి చేయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. "అవగాహన ఉన్న ప్రతి కుటుంబం.. అత్యవసర వేళలో సరైన నిర్ణయం తీసుకోగలదు. 102 సేవపై ప్రతి ఇంటికీ సమాచారం చేరితే తల్లి, శిశు ఆరోగ్య పరిరక్షణ మరింత బలోపేతం అవుతుంది" అని ధార అశోక్ పేర్కొన్నారు.

## పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం



**సర్పంచ్ విజయ నాగన్న గౌడ్**

**భవిష్యత్ ప్రజాపాలన పాలకుర్తి:** గ్రామపంచాయతీ సర్పంచ్ కమ్మగాని విజయ నాగన్న గౌడ్ ప్రజాహిత కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అంజలి కిడ్నీ కేర్ హాస్పిటల్ సౌజన్యంతో సర్పంచ్ ఆధ్వర్యంలో కిడ్నీ సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలను పేద ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు.. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డ్ నెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

# యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌కు చేరిన నైనీ మైన్ తొలి బొగ్గు రేక్






**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ సెప్టెంబర్ 2:** యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ విద్యుత్ ఉత్పత్తిలో ఒక కీలకమైన మైలురాయిని అధిగమించింది. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఒడిశాలోని 'నైనీ' బొగ్గు గని నుండి సేకరించిన అత్యంత నాణ్యమైన బొగ్గుతో కూడిన మొదటి రైల్వే రేక్ (రైలు) 4000 టన్నుల బరువుతో ఈరోజు ప్లాంట్‌కు చేరుకుంది. ఈ తొలి బొగ్గు రేక్‌ను టీజీజెన్‌కో డైరెక్టర్ (బొగ్గు & లాజిస్టిక్స్) శ్రీ బి.నాగ్య, మరియు డైరెక్టర్ (థర్మల్ & ప్రాజెక్ట్స్) శ్రీ వై. రాజశేఖర్ రెడ్డిలు ఘనంగా స్వాగతించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్లు శ్రీనివాసరావు, సురేష్, సూర్యనారాయణలు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**ముఖ్య విశేషాలు:**

**విద్యుత్ రక్షణకు భరోసా:** నైనీ బ్లాక్ నుండి వచ్చిన అధిక నాణ్యత కలిగిన ఈ బొగ్గు, రాష్ట్ర ఇంధన అవసరాలను తీర్చడానికి గరిష్ట సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తి చేయడానికి ఎంతో దోహదపడుతుంది. ఒడిశా నుండి సుదీర్ఘ దూరం సుమారు 1050 కిలోమీటర్లు రవాణా చేయాల్సి వచ్చినప్పటికీ, ఈ బొగ్గు యొక్క ఉత్తమ నాణ్యత మరియు అధిక ఉష్ణ సామర్థ్యం కారణంగా బాయిలర్ల పనితీరు మెరుగవుతుంది. ఇది బూడిద సమస్యలను తగ్గించి రవాణా వ్యయాన్ని పూర్తిగా సమర్థిస్తుంది.

**సమన్వయంతో విజయం:** గౌరవ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ప్రత్యేక చొరవతో టీజీజెన్‌కో, సింగరేణి, మరియు భారతీయ రైల్వేల మధ్య అద్భుతమైన సమన్వయం సాధించి సుదూర రవాణా ప్రక్రియ విజయవంతంగా సాధ్యమైంది. రాబోయే రోజుల్లో నైనీ మైన్ నుండి నిరంతరాయంగా బొగ్గు రేకులు రావడం వల్ల వైటీపీఎస్‌లో తగినంత బొగ్గు నిల్వలు అందుబాటులో ఉంటాయి. ఇది రాష్ట్రానికి నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందించడానికి గ్యారెంటీ ఇస్తుంది.



## వరద కాలువ నీటి కోసం మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ ఆధ్వర్యంలో

# రాస్తారోకో.. దిగొచ్చిన అధికారులు

- **10 నిమిషాల్లోనే కాల్వకు నీటి విడుదల - సెప్టెంబర్ 3న మిర్యాలగూడకు కేటీఆర్**

**నాగార్జునసాగర్ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వద్య:** నాగార్జునసాగర్ నియోజకవర్గంలో సాగు, తాగు నీటి కోసం వరద కాలువకు నీళ్లు విడుదల చేయాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, రైతులు మంగళవారం హైదరాబాద్-సాగర్ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. SLBCలో లెవెల్ కెనాల్ కు నీళ్లు విడుదల చేసి చెరువులు, కుంటలు నింపాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రైతులతో కలిసి రహదారిపై ధర్నాకు దిగడంతో దిగొచ్చిన ప్రభుత్వం వెంటనే వరద కాలువకు నీళ్లు విడుదల చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ధర్నాకు దిగిన 10 నిమిషాల్లోపే అధికారులు కాలువకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ మాట్లాడుతూ.. ప్రజల తాగు, సాగు నీటి అవసరాలు తీర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. శ్రీశైలం జలాశయం నుంచి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా ఆంధ్రప్రదేశ్ వందలాది టీఎంసీల నీటిని అక్రమంగా





ఈ ధర్నాను అధికార పార్టీ నేతలు పోలీసుల సహకారంతో అడ్డుకునేందుకు శతవిధాలా ప్రయత్నించారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. పోలీసులు అడ్డుకున్నప్పటికీ తరలిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆంధ్రా ప్రయోజనాలు తప్ప తెలంగాణ ప్రయోజనాలు పట్టడం లేదని ఎద్దేవా చేశారు. పోతిరెడ్డిపాడు దోపిడీని అడ్డుకుని ఉంటే ఇప్పటికే నాగార్జునసాగర్ జలాశయం పూర్తిగా నిండి, సాగర్ ఎడమ కాలువకు కూడా సాగు నీళ్లు వచ్చేవని అన్నారు. నాగార్జునసాగర్ జలాశయం తలాపున ఉన్నా నియోజకవర్గ ప్రజలకు తాగునీరు లేకపోవడం సిగ్గుచేటని అన్నారు. 100 కి.మీ దూరంలో ఉన్న ఖమ్మం జిల్లాకు నీళ్లు తీసుకెళ్తుంటే ఇక్కడి చెరువులు నింపాలనే సోయి లేకపోవడం దురదృష్టకరమన్నారు. జానారెడ్డి, ఆయన కుటుంబం నాగార్జునసాగర్ ప్రజలు ఇచ్చిన అధికారంతో రాజకీయంగా వర్ధిల్లుతున్నారే తప్ప నియోజకవర్గానికి చేసిందేమీ లేదని విమర్శించారు. SLBC లెవెల్ కెనాల్‌తో పాటు పెద్దవూర మండలం కుంకుడు చెట్టు తండా సమీపంలో రైతులు వేసిన పంటలను కాపాడేందుకు D8, D9 కెనాల్ లకు కూడా నీటిని విడుదల చేసి చెరువులు నింపాలని డిమాండ్ చేశారు. సాగర్ ఎడమ కాలువ రైతు సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 3న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మిర్యాలగూడకు వస్తున్నారని, రైతులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు..

## బీసీ విద్యార్థులకు అన్యాయం



- **నల్లబ్యాడ్జీలతో టీఆర్పీ యూత్, విద్యార్థుల నిరసన**

**జనగామ,సెప్టెంబర్ 1 (భవిష్యత్ ప్రజాపాలన ):** బీసీ విద్యార్థుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న అన్యాయ వైఖరిని నిరసిస్తూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) యూత్, విద్యార్థులు మంగళవారం జనగామలో నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆదేశాల మేరకు అంబేద్కర్ విగ్రహం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. టీఆర్వీఎస్ జిల్లా అధ్యక్షుడు వెంపటి అజయ్ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో టీఆర్పీ యూత్ జిల్లా అధ్యక్షుడు పిట్టల సురేష్ మాట్లాడుతూ.. బీసీ విద్యార్థుల సంక్షేమానికి బడ్జెట్‌లో కేటాయించిన నిధులను ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఖర్చు చేయడం లేదని ఆరోపించారు. స్కాలర్‌షిప్‌ల కోసం రూ.1,900 కోట్లు కేటాయించగా కేవలం రూ.365 కోట్లే ఖర్చు చేశారని తెలిపారు. హాస్టళ్ల సంక్షేమానికి రూ.435 కోట్లు కేటాయిస్తే రూ.315 కోట్లే ఖర్చు చేశారని పేర్కొన్నారు. రెండు కోట్ల మంది బీసీ జనాభాకు ఓవర్సీస్ విద్యానిధి కింద కేవలం రూ.83 కోట్లు కేటాయించడం అన్యాయమన్నారు. బీసీల కోసం స్టడీ సర్కిళ్ల నిర్వహణకు రూ.50 కోట్లు కేటాయిస్తామని ప్రకటించి కేవలం రూ.4 లక్షలు కేటాయించడం సిగ్గుచేటని విమర్శించారు. బీసీ విద్యార్థులకు ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తోందని, వారి హక్కుల సాధన కోసం ఉద్యమాలను మరింత ఉద్ధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీఆర్పీ యూత్ జిల్లా నాయకుడు బాలశివుడు, విద్యార్థులు చందు, అశోక్, సంగీత, రాధిక, విజయ, ప్రణీత, సుమలత తదితరులు పాల్గొన్నారు.

## డ్రై రన్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి..

## పనులను వేగవంతం చేయాలి



- **అంజనగిరి రిజర్వాయర్‌లో నిర్మిస్తున్న మిషన్ భగీరథ ప్రత్యామ్నాయ పంప్‌హౌస్ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**

**నాగర్‌కర్నూల్: భవిష్యత్ ప్రజా పాలన జర్నలిస్ట్ రఘు సాగర్ :** జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గం నార్లాపూర్ గ్రామ శివారులోని అంజనగిరి రిజర్వాయర్‌లో నిర్మిస్తున్న మిషన్ భగీరథ ప్రత్యామ్నాయ పంప్‌హౌస్ పనులను మంగళవారం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, రెవెన్యూ అదనపు కలెక్టర్ చెన్నయ్య, కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంప్‌హౌస్ నిర్మాణం, పంపుల ఏర్పాటు, విద్యుత్ సరఫరా, మోటార్లు, నీటిని ఎత్తిపోసే వ్యవస్థ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అంజనగిరి రిజర్వాయర్ నుంచి మిషన్ భగీరథ పంప్‌హౌస్ ద్వారా నీటిని ఎత్తిపోసేందుకు మొత్తం ఆరు పంపులను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో నాలుగు పంపుల పనులు తుది దశకు చేరుకున్నాయని, ఈ నెల 7వ తేదీన డ్రై రన్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. డ్రై రన్ విజయవంతమైన అనంతరం నీటిపారుదల శాఖ అధికారులు నీటిని విడుదల చేసిన వెంటనే వెట్ రన్ నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఒక్కో పంపు 1.7 మెగావాట్ల సామర్థ్యంతో పనిచేస్తూ 9,000 క్యూబిక్ మీటర్ల నీటిని ఎత్తిపోసే విధంగా ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ...., పంప్‌హౌస్ నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. డ్రై రన్‌కు ముందే అన్ని సాంకేతిక, విద్యుత్ పనులను పూర్తిస్థాయిలో తనిఖీ చేసి ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని సూచించారు. డ్రై రన్ అనంతరం వెట్ రన్‌కు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేసి పంప్‌హౌస్‌ను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాల్లోని 3,912 గ్రామాలకు తాగునీరు అందించే లక్ష్యానికి అనుగుణంగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రజలకు నిరంతరంగా, సురక్షితమైన తాగునీరు అందేలా పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని స్పష్టం చేశారు. సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించి పనుల్లో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట మిషన్ భగీరథ ఈఎన్‌సీ కృపాకర్ రెడ్డి, సీఈ లలిత, ఎస్ఈ జగన్‌మోహన్ రెడ్డి, ఈఈ సుధాకర్ సింగ్, నీటిపారుదల శాఖ ఈఈ అమర్ సింగ్, ఏఈలు, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు తదితరులు ఉన్నారు.

## కొత్తగూడెం విమానాశ్రయ ప్రతిపాదనపై

## సెప్టెంబర్ 7న కేంద్ర సాంకేతిక బృందం పర్యటన

- **నాలుగు నుంచి ఐదు ప్రత్యామ్నాయ స్థలాల పరిశీలన**
- **సాంకేతిక నివేదిక అనంతరం తదుపరి చర్యలు చేపడతామని కేంద్ర మంత్రి హామీ**
- **కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడితో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భేటీ**



**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ సెప్టెంబర్ 2:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు ప్రతిపాదనకు సంబంధించి నాలుగు నుంచి ఐదు ప్రత్యామ్నాయ స్థలాలను పరిశీలించేందుకు కేంద్ర సాంకేతిక బృందం సెప్టెంబర్ 7న తెలంగాణలో పర్యటించనుంది. మంగళవారం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడితో సమావేశమైన అనంతరం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ విషయాన్ని వెల్లడించారు. గతంలో పరిశీలించిన రెండు స్థలాలు సాంకేతిక కారణాలతో విమానాశ్రయ నిర్మాణానికి అనుకూలంగా లేవని తేలడంతో, తాజాగా నాలుగు నుంచి ఐదు ప్రత్యామ్నాయ స్థలాలను గుర్తించినట్లు మంత్రి తెలిపారు. ఈ స్థలాల్లోని భౌగోళిక, వాతావరణ పరిస్థితులతోపాటు విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన సాంకేతిక సాధ్యాసాధ్యాలను కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తుందని చెప్పారు. కేంద్ర సాంకేతిక బృందం నివేదిక అనుకూలంగా వచ్చిన అనంతరం కొత్తగూడెం విమానాశ్రయం ఏర్పాటుకు అవసరమైన తదుపరి చర్యలను కేంద్ర ప్రభుత్వం చేపడుతుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు హామీ ఇచ్చినట్లు మంత్రి తుమ్మల తెలిపారు. తెలంగాణలోని మామునూరు (వరంగల్), ఆదిలాబాద్ విమానాశ్రయాల ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సెప్టెంబర్ 2న కేంద్ర ప్రభుత్వంతో చర్చించే అవకాశం ఉందని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తండ్రి, దివంగత ఎర్రన్నాయుడు తన చిరకాల మిత్రుడని మంత్రి తుమ్మల గుర్తుచేసుకున్నారు. భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం ఉన్న ఈ ప్రాంత ప్రాధాన్యాన్ని, జిల్లా ప్రజలకు విమానాశ్రయం అవసరాన్ని కేంద్ర మంత్రికి వివరించినట్లు తెలిపారు. “భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజల దీర్ఘకాల ఆకాంక్షను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లాను. నా విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి, వెంటనే కేంద్ర సాంకేతిక బృందాన్ని పంపేందుకు చర్యలు చేపట్టిన కేంద్ర మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడికి, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు” అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.





## రాహుల్‌పై అక్రమ కేసు ఉపసంహరించాలి





- **ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతును అణచివేయడం సరికాదు**
  **కాట సుధా శ్రీనివాస్ గౌడ్**

**సెప్టెంబర్ 1:** నేటి మన దేశం కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై నమోదు చేసిన కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీపై కేసు నమోదును నిరసిస్తూ బండ్లగూడ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు రాహుల్ గాంధీకి మద్దతుగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. అనంతరం మహాత్మా గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాట సుధా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న రాహుల్ గాంధీని రాజకీయంగా ఎదుర్కోలేక ఆయనపై కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ప్రజల హక్కుల కోసం ప్రశ్నించే గొంతును అణచివేయడానికి కేసులను ఉపయోగించడం సరికాదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల తరఫున ప్రశ్నించడం, ప్రభుత్వ విధానాలను విమర్శించడం ప్రతిపక్షాల బాధ్యత అని ఆమె అన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో రాహుల్ గాంధీ నిరంతరం పోరాడుతున్నారని పేర్కొన్నారు. అలాంటి నాయకుడిపై కేసులు నమోదు చేయడం ద్వారా ప్రశ్నించే హక్కును కాలరాయాలని ప్రయత్నించడం తగదన్నారు. రాహుల్ గాంధీపై నమోదు చేసిన కేసును తక్షణమే ఉపసంహరించుకోవాలని కాట సుధా శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య హక్కులు, రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 4న గోవిందోత్సవ 2026 వేడుకలు



**ఖైరతాబాద్, సెప్టెంబర్ 1(భవిష్యత్ ప్రజాపాలన):** పురస్కరించుకొని శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ఈ నెల నాలుగున శామీర్పేటలోని త్రిపుర రిసార్ట్‌లో గోవిందోత్సవ్ 2026 వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ జూబ్లీహిల్స్ కన్వీనర్ నరేంద్ర కె తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని సమర్థ కృష్ణ దాసు, అనిల్ లతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... గోపాలకృష్ణుడి జన్మదిన వేడుకలను ప్రతి ఏడు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తామని తెలిపారు. ఈ ఏడాది భక్తుల కోరిక మేరకు షామీర్పేటలోని త్రిపుర రిసార్ట్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వేడుకల్లో భాగంగా భక్తి గీతాలాపన, నృత్య ప్రదర్శన కార్యక్రమాలు ఉంటాయని అన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వేదిక వద్దకు చేరుకునేందుకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. వేడుకల్లో పాల్గొనదలచిన వారు 9052975933 నెంబర్ లో సంప్రదించాలని సూచించారు.

## కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై నిరసనలకు బీఆర్ఎస్ సన్నద్ధం

- **జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో సెప్టెంబరు 1 నుంచి 8 వరకు కార్యక్రమాలు**

**హైదరాబాద్, సెప్టెంబరు 1 (భవిషత్త్ ప్రజాపాలన ):** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో విఫలమైందని ఆరోపిస్తూ జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో సెప్టెంబరు 1 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలపై బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా నిరసన కార్యక్రమాల పూర్తి వివరాలతో కూడిన కరపత్రాన్ని మాజీ ఎమ్మెల్యే విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని నాయకులకు పిలుపునిచ్చారు.

**డివిజన్ల వారీగా ఓటరు జాబితాల పంపిణీ**

ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిన అనంతరం వచ్చిన ఓటరు జాబితాలను డివిజన్ల వారీగా మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి పంపిణీ చేశారు. ఓటరు జాబితాలను పరిశీలించి, మార్పులు, చేర్పులు, తొలగింపులు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. అదేవిధంగా జీహెచ్ఎంసీ బీఎల్ఓలు



ఇంటింటికీ పంపిణీ చేస్తున్న నోటీసుల కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ బీఎల్ఏలు చురుగ్గా పాల్గొనాలని కోరారు. ఓటర్లకు అందుతున్న నోటీసుల వివరాలను పరిశీలిస్తూ, ఓటర్లకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్లు దేదీప్య,రాజు పటేల్, వివిధ డివిజన్ల అధ్యక్షులు, బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా.. ప్రతి ప్రభుత్వ సేవను

## ప్రజలకు చేరువ చేయడమే కాంగ్రెస్ ప్రజా పాలన ధ్యేయం






- **దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో 5 పడకల నుంచి 10 పడకలకు డయాలసిస్ కేంద్రం విస్తరణ - సదరం క్యాంపు, అంబులెన్స్ ప్రారంభం**
- **త్వరలో దేవరకొండలోనే వెహికల్ రిజిస్ట్రేషన్ సేవలు.. కొత్త మండలాలకు ఇంటిగ్రేటెడ్ మండల కార్యాలయాల సముదాయాలు**

**దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్**

**దేవరకొండ, భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వద్య :** ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా దేవరకొండ నియోజకవర్గంలో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు, ప్రభుత్వ సౌకర్యాలు అందుబాటులోకి తీసుకువచ్చే దిశగా పలు కీలక కార్యక్రమాలు చేపట్టినట్లు దేవరకొండ ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలు నాయక్ గారు తెలిపారు. దేవరకొండ



ప్రభుత్వ ఆసుపత్రిలో గతంలో 5 పడకల సామర్థ్యంతో ఉన్న డయాలసిస్ కేంద్రాన్ని 10 పడకలకు విస్తరించి, అవసరమైన వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాలతో అందుబాటులోకి తీసుకువచ్చారు. జిల్లా కలెక్టర్ శ్రీ చంద్రశేఖర్‌గారు, DMHO, RDO, వైద్యాధికారులు, వైద్య సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలు నాయక్ గారు ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న పేద, మధ్యతరగతి ప్రజలు డయాలసిస్ కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా దేవరకొండలోనే మెరుగైన వైద్య సేవలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులు పెంచడంతో పాటు, పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

**దివ్యాంగులకు సదరం సేవలు ఇక దేవరకొండలోనే**

దివ్యాంగులు పింఛన్ తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు అవసరమైన సదరం సర్టిఫికెట్ కోసం గతంలో నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చేదని, దీనివల్ల దివ్యాంగులు, వారి కుటుంబ సభ్యులు అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమస్యను గుర్తించి, దివ్యాంగులకు సేవలను వారి ఇంటి ముంగిటకు తీసుకువచ్చే ఉద్దేశంతో దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలోనే వారానికి రెండు రోజులు సదరం క్యాంపులు నిర్వహించే విధంగా ప్రత్యేక కేంద్రాన్ని జిల్లా కలెక్టర్, వైద్యాధికారులతో కలిసి ప్రారంభించినట్లు చెప్పారు. "దివ్యాంగులు సర్టిఫికెట్ కోసం నల్లగొండకు వెళ్లాల్సిన పరిస్థితి ఇక ఉండకూడదు. ప్రయాణ ఖర్చులు, సమయం, శారీరక ఇబ్బందులు తగ్గించి.. ప్రభుత్వ సేవలు వారికి మరింత చేరువ చేయాలన్నదే మా ఉద్దేశం" అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

**దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ ప్రారంభం**

అత్యవసర పరిస్థితుల్లో రోగులకు తక్షణ వైద్య సేవలు అందించేందుకు దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో =బూ ఆధ్వర్యంలో అంబులెన్స్ సేవలను ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలు నాయక్ గారు జిల్లా కలెక్టర్ శ్రీ చంద్రశేఖర్ గారు, =ఙూ, వైద్యాధికారులు, వైద్య సిబ్బందితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అత్యవసర వైద్య పరిస్థితుల్లో ఒక్క నిమిషం కూడా ఎంతో విలువైనదని, రోగులను సకాలంలో ఆసుపత్రికి తరలించేందుకు అంబులెన్స్ సేవలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. రోగుల ప్రాణాలను కాపాడటమే ప్రభుత్వ వైద్య వ్యవస్థ ప్రధాన లక్ష్యంగా ఉండాలని, దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిని మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**దేవరకొండలో వైద్య సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత**

దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధితో తనకు ఉన్న అనుబంధాన్ని ఎమ్మెల్యే గుర్తుచేశారు. 2009లో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయడానికి కృషి చేశానని తెలిపారు. అనంతరం ప్రభుత్వ స్థాయిలో జరిగిన ప్రయత్నాలతో ఆసుపత్రి విస్తరణకు మార్గం సుగమమైందన్నారు. "గతంలో నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు దేవరకొండ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ఆసుపత్రి విస్తరణకు కృషి చేశాను. ఇప్పుడు మళ్లీ ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రేవంత్ రెడ్డి గారి ప్రజా పాలనలో దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిని మరింత బలోపేతం చేస్తున్నాం. ప్రజల ఆరోగ్యం విషయంలో ఎక్కడా రాజీపడే ప్రసక్తే లేదు" అని బాలు నాయక్ గారు అన్నారు.

**ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాలు మరింత చేరువ కావాలి**

దేవరకొండ నియోజకవర్గంలో పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. గతంలో RDO కార్యాలయం మిర్యాలగూడలో ఉండగా, దేవరకొండకు RDO కార్యాలయం తీసుకు రావడానికి తాను చేసిన కృషి ఫలించిందని గుర్తుచేశారు. ప్రస్తుతం కొత్తగా ఏర్పడిన మండలాల్లో ప్రజలు వివిధ ప్రభుత్వ శాఖల కోసం వేర్వేరు ప్రాంతాలకు తిరగాల్సిన అవసరం లేకుండా ఒకే చోట అన్ని శాఖల సేవలు అందే విధంగా ఇంటిగ్రేటెడ్ మండల కార్యాలయాల సముదాయాలను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

**వాహన రిజిస్ట్రేషన్ సేవలు కూడా దేవరకొండలోనే**

ప్రస్తుతం దేవరకొండ నియోజకవర్గ ప్రజలు వాహనాల రిజిస్ట్రేషన్ తదితర పనుల కోసం మిర్యాలగూడకు వెళ్లాల్సి వస్తోందని, దీనివల్ల ప్రజలకు సమయం, డబ్బు వృథా అవుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. "దేవరకొండ ప్రజలు వాహన రిజిస్ట్రేషన్ కోసం మిర్యాలగూడకు వెళ్లాల్సిన అవసరం లేకుండా దేవరకొండలోనే ఈ సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన అన్ని ప్రక్రియలను పూర్తి చేశాం. త్వరలోనే దేవరకొండలోనే సంబంధిత కార్యాలయాన్ని ఏర్పాటు చేసి సేవలు అందిస్తాం" అని తెలిపారు.

**దేవరకొండ అభివృద్ధే లక్ష్యం**

రేవంత్ రెడ్డి గారి ప్రజా పాలనలో దేవరకొండ నియోజకవర్గానికి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పెద్ద ఎత్తున తీసుకురావడానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే బాలు నాయక్ గారు తెలిపారు. "ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ఒక్కొక్కటిగా నెరవేర్చే దిశగా ముందుకు వెళ్తున్నాం. వైద్యం, విద్య, సాగునీరు, రహదారులు, తాగునీరు, ప్రభుత్వ కార్యాలయాలు, సంక్షేమ పథకాలు.. ఇలా ప్రతి రంగంలో దేవరకొండ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే నా లక్ష్యం. నా హయాంలోనే సాధ్యమైనంత ఎక్కువ అభివృద్ధి పనులు పూర్తి చేసి దేవరకొండను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తాను" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు వేగంగా, పారదర్శకంగా, అందుబాటులో ఉండేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ శ్రీ దీ చంద్రశేఖర్ గారు, ఙవీూ, దేవరకొండ =ఙూ, పట్టణ మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మెన్లు ఆలంపల్లి నర్సింహా, వడ్త్య దేవేందర్, హన్మంత్ వెంకటేష్ గౌడ్, దేవరకొండ మండల అధ్యక్షుడు మరుపాకుల సురేష్ గౌడ్, కౌన్సిలర్లు, వివిధ మండలాల అధ్యక్షులు, కాంగ్రెస్ ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, ఆర్టిఐ నాయకులు,ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గోసేవలో మానవత్వపు పరిమళం



- **గోవుల సేవలో భగవాన్ ఫౌండేషన్ చైర్మన్ దూదుచౌహాన్**
- **మూగజీవుల పట్ల అపారమైన ప్రేమ.. గోరక్షణకు అండగా నిలుస్తున్న సేవా స్ఫూర్తి**

**మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన :** "మాటలు లేని మూగజీవికి మనం అందించే ఒక్క ముద్ద ఆహారం.. ఒక్క చుక్క నీరు.. ఒక్క క్షణం చూపించే ఆప్యాయత కూడా గొప్ప సేవే. జీవిని ప్రేమించే హృదయంలోనే నిజమైన మానవత్వం ఉంటుంది." అనే సందేశాన్ని ఆచరణలో చూపిస్తూ భగవాన్ ఫౌండేషన్ చైర్మన్ దూదుచౌహాన్ గోసేవలో నిమగ్నమయ్యారు. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా, కల్వకుర్తి నియోజకవర్గం, కడ్తాల్ మండలం మైసిగండి పరిధిలోని సింహా ప్యాలెస్ గోశాలలో భగవాన్ ఫౌండేషన్ చైర్మన్ దూదుచౌహాన్ గోవులకు సేవా కార్యక్రమం నిర్వహించారు. గోశాలకు చేరుకున్న ఆయన గోవులను ఆప్యాయంగా పలకరిస్తూ, వాటి పరిస్థితిని పరిశీలిస్తూ, స్వయంగా గోవులకు ఆహారం అందించారు. గోవుల పట్ల ఆయన చూపించిన ప్రేమాభిమానాలు అక్కడి వారిని విశేషంగా ఆకట్టుకున్నాయి.

**గోవుల కళ్లలో కనిపించిన ఆప్యాయత**

గోశాలలో గోవుల మధ్య కొంతసేపు గడిపిన దూదుచౌహాన్.. వాటి ఆరోగ్యం, ఆహారం, సంరక్షణ వంటి అంశాలను పరిశీలించారు. గోవులను ప్రేమగా తాకుతూ, వాటికి ఆహారం అందిస్తూ సేవ చేసిన తీరు అందరి మనసులను హత్తుకుంది. మూగజీవుల పట్ల ప్రేమను మాటల్లో కాకుండా చేతల్లో చూపించిన ఆయన సేవా స్ఫూర్తిని పలువురు అభినందించారు. "మనిషికి భాష ఉంది.. మూగజీవికి భాష లేదు. కానీ దాని కళ్లలోని భావాలను అర్థం చేసుకోవడం మానవత్వం. ఒక జీవి ఆకలి తీర్చగలిగితే అంతకంటే గొప్ప తృప్తి మరొకటి ఉండదు" అనే సందేశంతో ఆయన గోసేవకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

**గోసేవ అంటే.. సంస్కృతికి సేవ**

భారతీయ సంస్కృతిలో గోవుకు అత్యంత పవిత్రమైన స్థానం ఉందని, గోవుల సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా భావించాలని దూదుచౌహాన్ పేర్కొన్నారు. గోశాలల్లో ఉన్న గోవులకు ఆహారం, నీరు, వైద్యం, పరిశుభ్రమైన వాతావరణం వంటి మౌలిక సౌకర్యాలు అందేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. "గోరక్షణ అనేది ఒక్కరి బాధ్యత కాదు.. సమాజం మొత్తం బాధ్యత. గోవును కాపాడటం అంటే ఒక మూగజీవిని మాత్రమే కాపాడటం కాదు.. మన సంస్కృతి, సంప్రదాయం, జీవకారుణ్య విలువలను కాపాడటం" అని ఆయన అన్నారు.

**సేవలోనే సంతృప్తి.. సమాజానికి స్ఫూర్తి**

భగవాన్ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలకు మరింత ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతున్నామని దూదుచౌహాన్ తెలిపారు. అవసరంలో ఉన్న మనుషులకు అండగా నిలవడంతో పాటు, మూగజీవుల సంరక్షణకు కూడా తన వంతు సహకారం అందించడం తన బాధ్యతగా భావిస్తున్నానన్నారు. సేవా కార్యక్రమాలు కేవలం ప్రచారం కోసం కాకుండా.. ఒకరి జీవితంలో, ఒక జీవి జీవితంలో చిన్న మార్పు తీసుకురావాలనే సంకల్పంతో కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. గోశాలలకు సామాజిక సంస్థలు, దాతలు, సేవాభావం కలిగిన వ్యక్తులు తమ వంతు సహకారం అందించాలని కోరారు.

**"జీవకారుణ్యమే నిజమైన ఆధ్యాత్మికత"**

గోవులకు సేవ చేసిన సందర్భంగా దూదుచౌహాన్ మాట్లాడుతూ.. దేవుడిని ఆలయంలో వెతకడంతో పాటు, మన చుట్టూ ఉన్న జీవుల్లోనూ దైవత్వాన్ని చూడాలని అన్నారు. "ఆకలితో ఉన్న జీవికి అన్నం పెట్టిన చేతులు.. ప్రార్థన చేసిన చేతులకంటే తక్కువ కావు. దాహంతో ఉన్న జీవికి నీళ్లు అందించిన హృదయం.. దేవుడి ఆశీస్సులకు అర్హమైన హృదయం. సేవలోనే నిజమైన సంతృప్తి ఉంటుంది" అని ఆయన పేర్కొన్నారు. మైసిగండి పరిధిలోని సింహా ప్యాలెస్ గోశాలలో గోవులకు సేవ చేస్తూ దూదుచౌహాన్ చూపించిన ఆప్యాయత, సేవా భావం అక్కడి వారిలో ఆనందాన్ని నింపింది. ఆయన గోసేవ కార్యక్రమం పలువురికి స్ఫూర్తిగా నిలిచింది.

**ఒక మంచి మాట.. ఒక మంచి పని.. ఒక జీవికి కొత్త ఆశ**

"మనిషి ఎంత సంపాదించాడన్నది గొప్ప కాదు.. తన వల్ల ఎన్ని ప్రాణాలు సంతోషించాయన్నదే అసలైన గొప్పతనం. మన చేతులతో చేసే చిన్న సేవ.. ఒక మూగజీవికి పెద్ద వరంగా మారవచ్చు." ఈ భావనతో గోసేవను కొనసాగిస్తున్న భగవాన్ ఫౌండేషన్ చైర్మన్ దూదుచౌహాన్ సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని, గోరక్షణకు మరింత మంది ముందుకు రావాలని స్థానికులు ఆకాంక్షించారు.

# సబితమ్మ చొరవతో.. హర్షగూడ రహదారికి మహర్దశ!

- **గుంతలమయమైన రోడ్డుకు కొత్త రూపం.. పనులను పరిశీలించిన ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి**
- **పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు పనులు వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశం**

**రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన :** "ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే నిజమైన ప్రజాసేవ.. రహదారి బాగుంటే గ్రామ అభివృద్ధికి కొత్త బాటలు పడతాయి" అనే లక్ష్యంతో మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మహేశ్వరం నియోజకవర్గ శాసనసభ్యురాలు పి. సబితా ఇంద్రారెడ్డి ప్రత్యేక చొరవతో హర్షగూడ ప్రజల చిరకాల సమస్యగా ఉన్న ప్రధాన రహదారి పనులు ప్రారంభమ య్యాయి. మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని మంఖాల్ డబుల్ బెడ్‌రూమ్ నుంచి హర్షగూడ గ్రామానికి వచ్చే ప్రధాన రహదారి కొంతకాలంగా పూర్తిగా గుంతలమయంగా మారి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న విషయం తెలిసిందే. ఈ రహదారి దుస్థితితో వాహనదారులు, గ్రామస్థులు నిత్యం అవస్థలు పడుతుండటంతో రోడ్డు నిర్మాణం చేపట్టాలని పలుమార్లు ప్రజల నుంచి విజ్ఞప్తులు వచ్చాయి.

**గతంలోనే నిధుల మంజూరు.. శిలాఫలకం**

హర్షగూడ మాజీ ఉపసర్పంచ్ రవి నాయక్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజల సమస్యను అప్పటి విద్యాశాఖ మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. ప్రజల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకున్న సబితా ఇంద్రారెడ్డి రహదారి అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపి కొత్త రోడ్డు వైడనింగ్ కోసం నిధులు మంజూరు చేయడంతో పాటు శిలాఫలకం ఏర్పాటు చేయించారు. అయితే రోడ్డు పనులు ప్రారంభించేందుకు సిద్ధమవుతున్న సమయంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పనులకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. దీంతో రోడ్డు నిర్మాణం ఆలస్యమై గ్రామస్థులు మరికొంతకాలం ఇబ్బందులు ఎదుర్కొన్నారు.





**కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నా.. ఎమ్మెల్యే చొరవతో పనులకు కదలిక**

ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ, స్థానిక ఎమ్మెల్యేగా పి.సబితా ఇంద్రారెడ్డి ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ హర్షగూడ రహదారి పనులు ప్రారంభమయ్యేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేశారు. ఆమె ప్రత్యేక చొరవతో నిలిచిపోయిన రహదారి పనులు తిరిగి ప్రారంభం కావడంతో హర్షగూడ గ్రామ ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

**పనుల నాణ్యతపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి**

హర్షగూడ రహదారి పనులు ఏ విధంగా జరుగుతున్నాయో తెలుసుకునేందుకు పి. సబితా ఇంద్రారెడ్డి స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి రోడ్డు పనులను పరిశీలించారు. సంబంధిత అధికారులు, హర్షగూడ మాజీ ఉపసర్పంచ్ రవి నాయక్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, యూత్ క్లబ్ యువకులు, వివిధ సంఘాల యువకులతో కలిసి రహదారి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ప్రజలకు దీర్ఘకాలం ఉపయోగపడేలా పనులు చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. రోడ్డు నిర్మాణంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా పనులను పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. నిలిచిపోయిన హర్షగూడ–మహేశ్వరం సీసీ రోడ్డు పనులు వేగవంతం చేయాలి ఇదే సందర్భంగా కొన్ని రోజులుగా నిలిచిపోయిన హర్షగూడ నుంచి మహేశ్వరం వరకు సీసీ రోడ్డు పనులపైనా ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి ఆరా తీశారు. రహదారి పనులు ఎందుకు నిలిచిపోయాయనే వివరాలను అధికారులను అడిగి తెలుసు కున్నారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో పనులను ఇక ఆలస్యం చేయకుండా వెంటనే తిరిగి ప్రారంభించి, వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. రహదారి నిర్మాణ పనుల్లో వేగంతో పాటు నాణ్యతకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

**ప్రజల ఇబ్బందులే.. తమ సమస్యగా భావిస్తున్నాం**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ప్రజలకు అవసరమైన రహదారులు, డ్రైనేజీ, తాగునీరు తదితర మౌలిక వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకు వచ్చిన వెంటనే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. "అభివృద్ధి అంటే కేవలం భవనాలు నిర్మించడం కాదు.. ప్రజలు సురక్షితంగా, సౌకర్యవంతంగా ప్రయాణించే రహదారులు నిర్మించడమే నిజమైన అభివృద్ధికి తొలి అడుగు" అని సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నట్లు తెలిపారు.

**సబితమ్మకు రవి నాయక్ ప్రత్యేక కృతజ్ఞతలు**

రోడ్డు పనులు ప్రారంభం కావడంపై హర్షగూడ మాజీ ఉపసర్పంచ్ రవి నాయక్ హర్షం వ్యక్తం చేశారు. గ్రామ ప్రజల చిరకాల సమస్యను పరిష్కరించేందుకు సబితా ఇంద్రారెడ్డి గతంలోనే స్పందించి నిధులు మంజూరు చేయించారని, ఎన్నికల కోడ్ కారణంగా పనులు నిలిచిపోయినప్పటికీ ప్రస్తుతం ప్రత్యేక చొరవ తీసుకుని పనులు ప్రారంభమయ్యేలా చేశారని తెలిపారు. "హర్షగూడ ప్రజల అవసరాన్ని గుర్తించి రహదారి కోసం నిధులు మంజూరు చేయించడం, పనులు తిరిగి ప్రారంభమయ్యేలా ప్రత్యేక చొరవ చూపడం అభినందనీయం. సబితమ్మ ఆదేశాలతో రోడ్డు పనులు ప్రారంభమైనందుకు హర్షగూడ ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియ జేస్తున్నాం" అని రవి నాయక్ తెలిపారు. రహదారి పనులు పూర్తయితే హర్షగూడతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. గుంతలమ యమైన రహదారికి కొత్త రూపు రావడంతో వాహనదారులకు, పాదచారులకు ఇబ్బందులు తగ్గనున్నాయి.

# నేతన్న పట్టుదలకు పట్టం



సంప్రదాయ కళల్లో చేనేతది ప్రత్యేక స్థానం. మనం కట్టుకునే వస్త్రాల వెనుక నేతన్నల శ్రమ ఎంతగానో ఉంటుంది. ఆరు గజాల చీరను అగ్గిపేటలో పట్టించే తీరును చూస్తే ఆశ్చర్యపోవాల్సిందే. అలాంటి వినూత్న ఆలోచనలకు బీజం వేస్తూ.. జాతీయ స్థాయి అవార్డులను కైవసం చేసుకుంటున్నారు తెలంగాణ నేతన్నలు. ఈసారి ఆ అవకాశం 15 నెలలపాటు శ్రమించి ఇక్కత్ డిజైన్‌తో ఆరు గజాల పట్టు చీరను రూపొందించిన గంజి వెంకటేశ్‌కు లభించింది. జాతీయ చేనేత పురస్కారం–2025కు ఎంపికై ఇటీవల 12వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారాయన. తన శ్రమకు తగిన గుర్తింపు వచ్చిందంటున్న వెంకటేశ్ బతుకమ్మతో పంచుకున్న విశేషాలు, ఆయన మాటల్లోనే.. మాది యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్. నిరుపేద కుటుంబం మాది. మేము మొత్తం నలుగురం అన్నదమ్ములం. నేను రెండోవాణ్ని. అమ్మానాన్నలిద్దరూ నేత పనిచేసేవారు. నా చిన్నతనంలో తిండికి ఇబ్బంది లేకపోయినా మేము పెరిగేకొద్దీ ఆర్థిక సమస్యలు చుట్టుముట్టాయి. ఒకానొక దశలో తిండికి లేక పస్తులున్న రోజులూ ఉన్నాయి. అమ్మానాన్నల కష్టం చూసిన నేను పదో తరగతి పూర్తికాగానే చదువుకు స్వస్తి పలికి మగ్గం పనిలోకి దిగాను. నన్ను చూసి నా తమ్ముళ్లిద్దరూ పనిచేయడం మొదలుపెట్టారు. ఇక అప్పటి నుంచి అమ్మానాన్నల బరువు తగ్గిస్తూ 2003 వరకు ఉమ్మడిగా కలిసిమెలిసి పనిచేస్తూ వచ్చాం.

# కాంగ్రెస్ 1000 రోజుల విధ్వంస పాలనపై బీఆర్ఎస్ పోరుబాట



● రేపు దేవరకొండలో భారీ ర్యాలీ- బస్‌స్టాండ్ వద్ద మహాధర్నా

దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్

**దేవరకొండ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వద్దు :** కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ప్రజలకు జరిగిన అన్యాయాలు, ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాలను నిరసిస్తూ రేపు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో దేవరకొండ నియోజకవర్గ కేంద్రంలో భారీ ర్యాలీ, మహాధర్నా నిర్వహించనున్నట్లు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ తెలిపారు. మంగళవారం దేవరకొండ పట్టణంలోని మహాధర్నా నిర్వహించనున్న స్థలాన్ని రమావత్ రవీంద్ర కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.....రేపు దేవరకొండ పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల నుంచి భారీ ర్యాలీ ప్రారంభమై, బస్‌స్టాండ్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తోందని ఆయన విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి దేవరకొండ నియోజకవర్గంలోని మాజీ మండలాల అధ్యక్షులు, సర్పంచులు, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు, ముఖ్య కార్యకర్తలు, నాయకులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రమావత్ రవీంద్ర కుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ బిల్యా నాయక్, పార్టీ దేవరకొండ మండల అధ్యక్షులు TVN రెడ్డి, కేతావత్ రుప్లా నాయక్, బొడ్డుపల్లి కృష్ణ, కేతావత్ హరిలాల్, రామావత్ తులిసీరామ్, వడత్య బాలు, పగిడిమర్రి నాగరాజు, పండు, అజయ్, జైపాల్ తదితరులు ఉన్నారు.

# దేవరకొండ ఏరియా ఆస్పత్రిలో అభివృద్ధి పనుల ప్రారంభం

## డయాలసిస్ కేంద్రం విస్తరణ కౌన్సిలర్ కేతావత్ రుప్లానాయక్





**దేవరకొండ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వద్దు:** దేవరకొండ పట్టణంలోని 16వ వార్డు పరిధిలోని ఏరియా ఆస్పత్రిలో మంగళవారం నూతన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ హాజరయ్యారు. వారితో కలిసి 16వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ కేతావత్ రుప్లా నాయక్ అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఇందులో భాగంగా ఏరియా ఆస్పత్రిలో 5 పడకల డయాలసిస్ కేంద్రాన్ని 10 పడకలకు విస్తరించడం, సదరం క్యాంపు, నూతన అంబులెన్స్ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ రుప్లా నాయక్‌లి మాట్లాడుతూ.. తన వార్డులో ఉన్న ఆస్పత్రి అభివృద్ధికి పార్టీలకు అతీతంగా కృషి చేస్తానని అన్నారు. తనకు ఎమ్మెల్యే బాలు నాయక్ అన్ని విధాలుగా సహకరిస్తున్నారని, త్వరలో 100 పడకల ఆస్పత్రిని 200 పడకలకు పెంచుతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐవీసా, దేవరకొండ =ఐూ, మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్లు ఆలంపల్లి నర్సింహా, వడ్త్య దేవేందర్, హన్మంత్ వెంకటేష్ గౌడ్, మండల అధ్యక్షుడు మరుపాకుల సురేష్ గౌడ్, కౌన్సిలర్లు, నాయకులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

# సర్వేలో బీఆర్ఎస్‌కు పెరిగిన ఆదరణ..

# కాంగ్రెస్ పాలనపై అసంతృప్తి




**హైదరాబాద్, సెప్టెంబర్ 1(భవిష్యత్ ప్రజాపాలన):** తెలంగాణ రాజకీయ పరిస్థితులపై గత రెండు నెలలుగా నిర్వహించిన ప్రజాభిప్రాయ సర్వేలో బీఆర్ఎస్‌కు గ్రామీణ ప్రాంతాల్లో ఆదరణ పెరిగినట్లు చాణక్య స్ట్రాటజీస్ ఎండీ ముకేష్ తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన సర్వే వివరాలను వెల్లడించారు. రాష్ట్రంలోని 119 నియోజక వర్గాల్లో ఒక్కో నియోజకవర్గం నుంచి సుమారు 800–1,000 మంది చొప్పున మొత్తం 1,06,800 మంది నుంచి అభిప్రాయాలు సేకరించినట్లు తెలిపారు. పాలనపై సంతృప్తి, రాబోయే ఎన్నికల్లో ఓటు ప్రాధాన్యత, ప్రభుత్వ హామీల అమలు, ఎమ్మెల్యేల పనితీరు, యువత అభిప్రాయాలు, రాజకీయ పార్టీలకు ఉన్న ఆదరణ తదితర అంశాలపై ప్రజలను ప్రశ్నించినట్లు చెప్పారు. "ఏ ప్రభుత్వ పాలన బాగుంది?" అన్న ప్రశ్నకు 53 శాతం మంది బీఆర్ఎస్ పాలనకు, సుమారు 30శాతం మంది కాంగ్రెస్ పాలనకు అనుకూలంగా స్పందించి నట్లు వెల్లడించారు. రాబోయే ఎన్నికల్లో ఎవరికి ఓటు వేయాలనే విషయంలో కొంతమంది ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 50ఏళ్లకు పైబడిన ఓటర్లలో బీఆర్ఎస్‌కు మొగ్గ కనిపిస్తోందని, కాంగ్రెస్ హామీల అమలుపై మహిళలు, రైతుల్లో అసంతృప్తి ఉన్నట్లు తెలిపారు. ఉచిత బస్సు, సన్న బియ్యం, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల వంట పథకాలు కాంగ్రెస్ కుకొంత అనుకూలంగా ఉన్నప్పటికీ ఇతర హామీల అమలులో జాప్యం ప్రభావం చూపుతోందన్నారు. యువతలో కాంగ్రెస్ ప్రభుత్వంపై గణనీయమైన అసంతృప్తి ఉన్నప్పటికీ ఆ ఓటు పూర్తిగా బీఆర్ఎస్‌కు మళ్లలేదని, యువత కొత్త నాయకత్వం, కొత్త రక్తాన్ని కోరుకుంటోందని చెప్పారు. బీఆర్ఎస్ గ్రామ, మండల స్థాయిలో క్యాడర్‌ను పునర్నిర్మించుకుని ప్రజలకు అందుబాటులో ఉండే కొత్త నాయకత్వాన్ని ముందుకు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత నాయకత్వాన్నే కొనసాగిస్తే కాంగ్రెస్‌పై ఉన్న వ్యతిరేకతను పూర్తిగా బీఆర్ఎస్ అనుకూలంగా మార్చుకోవడం కష్టమని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో బీజేపీ గ్రాఫ్ కూడా తగ్గుముఖం పడుతోందని, యువతను ఆకట్టుకునే నాయకత్వం బీజేపీలో లేదన్న అభిప్రాయం యువతలో ఉన్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్, మహేశ్వరం తదితర ప్రాంతాల్లో బీజేపీ ఓటు శాతం తగ్గుతున్నట్లు పేర్కొన్నారు. మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఎల్‌బీనగర్, శేరిలింగంపల్లి తదితర ప్రాంతాల్లో గతంలో టీడీపీకి ఉన్న ఓటు బ్యాంకులో గణనీయమైన వర్గం ప్రస్తుతం కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నప్పటికీ ఎన్నికల సమయానికి పరిస్థితులు మారవచ్చన్నారు. 119 మంది ఎమ్మెల్యేల పనితీరుపై ప్రజలను నేరుగా ప్రశ్నించి ర్యాంకింగ్ కార్డులు రూపొందించామని, జిల్లాల వారీగా టాప్–3 ఎమ్మెల్యేలతో పాటు మంత్రుల పనితీరుపై ప్రోగ్రెస్ రిపోర్టు సిద్ధం చేసినట్లు ముకేష్ తెలిపారు. రానున్న GHMC, MLC ఎన్నికలు కీలకంగా మారనున్నాయని, GHMC ఎన్నికలకు ముందు చివరి పది రోజుల్లో రాజకీయ సమీకరణాలు మారే అవకాశం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తిని బీఆర్ఎస్ సమర్థంగా ఉపయోగించుకుంటే సింగిల్ లార్జెస్ట్ పార్టీగా అవతరించే అవకాశం ఉందని, అయితే యువతను ఆకర్షించే కొత్త నాయకత్వాన్ని ఎవరు ముందుకు తీసుకువస్తారన్నదే రాబోయే ఎన్నికల్లో కీలక అంశంగా మారనుందని చాణక్య స్ట్రాటజీస్ ఎండీ ముకేష్ పేర్కొన్నారు.

# సెప్టెంబర్ 9 న జరిగే మండల కమిటీల జాతీయ సదస్సు విజయవంతం చేయండి




**భవిష్యత్ ప్రజాపాలన పాలకుర్తి:** మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశం.. ఈ కార్యక్రమానికి సభ అధ్యక్షత మండల ఇంచార్జీ యాదగిరి స్వామి మాదిగ వహించగా... ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ జనగామ జిల్లా ఇంచార్జి బోడ సునీల్ మాదిగలి పాల్గొని మాట్లాడుతూ సెప్టెంబర్ 09న వరంగల్ జిల్లాలో జరిగే ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి నూతన మండల కమిటీల జాతీయ సదస్సును విజయవంతం చేయడానికి ప్రతి మండలంలోని నూతన కార్యవర్గం సిద్ధం కావాలని జనగామ జిల్లా వ్యాప్తంగా నూతన నాయకత్వాన్ని నిర్మించి అధిక మందితో విజయవంతం చేయాలని ప్రతి మండలంలో యువకులకు ప్రాధాన్యత ఇవ్వాలని ముందు జరగబోయే సమ సమాజ నిర్మాణానికి యువత పోరాటం చేయాలని వారు పిలుపునిచ్చారు... ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా మాజీ అధ్యక్షులు పైస రాజశేఖర్ మాదిగ, మాజీ ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి సందెన రవీందర్ మాదిగ, నాయకులు జలగం నరేష్ మాదిగ, దండు రామచందర్ మాదిగ, ఎల్లయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 2 - పెన్షన్ విద్రోహ దినం

# బ్లాక్ డేగా ఉద్యోగుల నిరసన

● సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపిఎస్‌ను పునరుద్ధరించాలి: హైదరాబాద్




**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 2:** సిపిఎస్ విధానానికి వ్యతిరేకంగా ఈరోజు సెప్టెంబర్ 1ను ఉద్యోగులు బ్లాక్ డే / పెన్షన్ విద్రోహ దినంగా పాటించారు. హైదరాబాద్ సిటీ చైర్మన్ కట్టకూరి శ్రీకాంత్, కన్వీనర్ గండూరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని భీమా భవన్, అబిడ్స్ మరియు ఎకనామిక్స్ & స్టాటిస్టిక్స్ డిపార్ట్‌మెంట్, ఖైరతాబాద్ వద్ద హెచ్ ఓ డి ఉద్యోగుల ఆధ్వర్యంలో లంచ్ అవర్ డెమాన్స్ట్రేషన్ నిర్వహించారు. ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని సిపిఎస్ విధానాన్ని రద్దు




చేసి ఓపిఎస్‌ను పునరుద్ధరించాలని నినదించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చైర్మన్ శ్రీ మారం జగదీశ్వర్ సెక్రటరీ జనరల్ ఎలూరి శ్రీనివాసరావు హాజరై ఉద్యోగుల పోరాటానికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సిపిఎస్ విధానాన్ని తక్షణమే రద్దు చేసి, ఉద్యోగులకు సామాజిక భద్రత కల్పించే పాత పెన్షన్ విధానం ఓపిఎస్‌ను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 10న నిర్వహించనున్న "చలో హైదరాబాద్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉద్యోగులకు పిలుపునిచ్చారు.

**ప్రధాన డిమాండ్లు**

సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి OPSను వెంటనే పునరుద్ధరించాలి.

2వ పిఆర్సిని వెంటనే అమలు చేయాలి.

పెండింగ్‌లో ఉన్న 6 విడతల డి ఎ& డియర్ ను వెంటనే విడుదల చేయాలి.

పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి. నూతనను సమర్థవంతంగా అమలు చేయాలి.

హెచ్‌ఓడి ఉద్యోగులకు సెక్రటేరియట్‌లో 12.5 శాతం కోటాను వెంటనే అమలు చేయాలి.

సెప్టెంబర్ 10న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని ఉద్యోగులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి.

ఈ కార్యక్రమంలో ముజీబ్ హుస్సేన్ టీఎన్జీఎస్ జనరల్ సెక్రెటరీ శ్యామ్ టీజీవోస్ జనరల్ సెక్రెటరీ ముత్యాల సత్యనారాయణ గౌడ్ కస్తూరి వెంకటేశ్వర్లు ఉమాదేవి శైలజ చంద్రశేఖర్ కొండల్ రెడ్డి గోవర్ధన్ రెడ్డి హైదరాబాద్ సిటీ నాయకులు, లక్ష్మణ్ నిరంజన్ రెడ్డి హరికృష్ణ మహేందర్ రావు అమరేందర్ బాబు శంకర్ మహేష్ గౌడ్ వరలక్ష్మి ప్రభాకర్ మోహన్ విజయ్ రమేష్ అర్మని రాజు పి లక్ష్మీ నరసింహస్వామి ప్రభాకర్ రెడ్డి లక్ష్మీ బాలాజీ వివిధ శాఖల ఉద్యోగులు, సంతోష్ బాల నర్సింగరావు పేరెంట్ అకౌంట్ డిపార్ట్మెంట్ నుంచి శ్రీను ఎకనామి క్రైమ్ స్టేటస్ డిపార్ట్మెంట్ దేవేందర్ ఆర్ అండ్ బి డిపార్ట్మెంట్ నుంచి మధు గ్రౌండ్ వాటర్ డిపార్ట్మెంట్ ఈశ్వర్ ఆనంద్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ డిపార్ట్మెంట్ ఫిషరీస్ విలియమ్స్ సతీష్ శర్మ లేబర్ డిపార్ట్మెంట్ ఎక్సైజ్ మహేందర్ యూనిట్ అధ్యక్షులు, కార్యదర్శులు మరియు ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాల నిర్వహణకు పోలీసుల అవగాహన సదస్సు

● డీజేలకు అనుమతి లేదు.. మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి: సీఐ రవీందర్

● డీజే రహిత పటాన్‌చెరుగా తీర్చిదిద్దాలి సీఐ రవీందర్








**పటాన్‌చెరు, సెప్టెంబర్ 1:** గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని పటాన్‌చెరు సీఐ రవీందర్ గణేష్ ఉత్సవాల నిర్వాహకులకు సూచించారు. రామచంద్రాపురం ఏసీపీ శ్రీనివాస్ సూచనల మేరకు బుధవారం సాయంత్రం పటాన్‌చెరులోని ముదిరాజ్ సంఘం భవన్‌లో గణేష్ మండపాల నిర్వాహకులతో పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన గణేష్ ఉత్సవాల నిర్వాహకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ రవీందర్ మాట్లాడుతూ గత ఏడాది పోలీస్‌స్టేషన్ పరిధిలో 495 గణేష్ మండపాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుశాఖ అనుమతి తీసుకోవాలని సూచించారు. గణేష్ విగ్రహాల ప్రతిష్ఠాపన, ఉత్సవాలు, ఊరేగింపులు, నిమజ్జనం సందర్భంగా పోలీసుశాఖ సూచించిన నిబంధనలు, భద్రతా చర్యలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. ప్రధాన రహదారులపై మండపాల ఏర్పాటుతో ట్రాఫిక్‌కు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గణేష్ ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదని సీఐ రవీందర్ స్పష్టం చేశారు. ప్యాడ్ బ్యాండ్, మిక్సర్ తదితర అధిక శబ్ద పరికరాలు లేకుండా ఒక్క స్పీకర్‌తో నిర్వహించే మండపాలకు మాత్రమే నిబంధనల మేరకు అనుమతి ఇస్తున్నట్లు తెలిపారు. పటాన్‌చెరును డీజే రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు నిర్వాహకులు పోలీసుశాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 14వ తేదీ నుంచి గణేష్ విగ్రహాల నిమజ్జనం పూర్తయ్యే వరకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో అవసరమైన భద్రతా చర్యలు చేపడతామని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠ భద్రత కల్పిస్తామని, ఉత్సవాల నిర్వాహకులు పోలీసుశాఖకు సహకరించాలని కోరారు. గణేష్ పండుగను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సీఐ రవీందర్ సూచించారు. ఈ సమావేశంలో ఎస్సైలు మహేశ్వర్ రెడ్డి, వినోద్, అభిమాన్ సింగ్, పోలీసు సిబ్బంది, వివిధ గ్రామాలకు చెందిన గణేష్ ఉత్సవాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# నాగారం గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ




ప్రజా సంక్షేమమే లక్ష్యంగా... ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనం అందించడమే ధ్యేయంగా నాగారం గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నాగారం గ్రామ సర్పంచ్ గొరిగే ఉప్పలమ్మ బిక్షపతి గారు అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా గ్రామ పంచాయతీ పాలకవర్గం నిరంతరం ప్రజల కోసం పనిచేస్తుందని సర్పంచ్ తెలిపారు. ప్రజల సమస్యలు– గ్రామ అభివృద్ధి – సంక్షేమ పథకాల అమలు విషయంలో ఎల్లప్పుడూ ప్రజల వెంటే ఉంటామని తెలిపారు. నాగారం గ్రామ పంచాయతీ పాలకవర్గం ప్రజా సేవే మా లక్ష్యం... గ్రామ అభివృద్ధే మా సంకల్పం.

Edited,Printed,Published and Owend by CHITLA DIVYA ,Printed at POTHUGANTI RACHANA , G2, TSRINIVAS, ROAD NO : 4 , RANGAREDDY , Hyderabad- 500035 . Published at H.NO : 177/P , PLOT NO : 402 ANJAMMA RESIDENCY , MANIKONDA , Hyderabad - 500089, Telangana. Editor : CHITLA VIJAYKUMAR REDDY , RNI : TGTEL/26/A0153 e-mail : bhavishyatprajapalana@gmail.com , Cell : 81061 86888

# దేవరకొండ ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత అంబులెన్స్ సేవలు ప్రారంభం



● జెండా ఊపి ప్రారంభించిన స్థానిక ఎమ్మెల్యే బాలు నాయక్, జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

**దేవరకొండ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వడ్త్య:** పేద ప్రజలకు అత్యవసర వైద్య సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో దేవరకొండ ప్రాంతీయ ఆసుపత్రికి 'సమాచార హక్కు ప్రచార్ సమితి' రాష్ట్ర అధ్యక్షులు కాట్రవత్ రాజు నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత అంబులెన్స్ సేవలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రాంతీయ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్, జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, డీసీహెచ్ఎస్ మాత్రు నాయక్ ముఖ్య అతిథులుగా హాజరై, జెండా ఊపి అంబులెన్స్ సేవలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ, ఆపదలో ఉన్న పేద రోగులకు సకాలంలో అత్యవసర వైద్యం అందేలా ఉచిత అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తీసుకురావడం ఎంతో అభినందనీయమని కొనియాడారు.



అనంతరం సమాచార హక్కు ప్రచార్ సమితి రాష్ట్ర అధ్యక్షులు కాట్రవత్ రాజు నాయక్ మాట్లాడుతూ... ఆపదలో ఉన్న ప్రజల ప్రాణాలను కాపాడటం, అత్యవసర సమయాల్లో పేద రోగులకు అండగా నిలవడమే తమ సంస్థ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ ఆర్డీవో పద్మప్రియ, మున్సిపల్ చైర్పర్సన్ పున్న శైలజ, ఆర్టీఐ కమిటీ సభ్యులు ఎస్.కె. కైసర్, ఎం. నరేష్, లక్ష్మీనారాయణ, హరీష్, వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, అరుణ్, అఫ్రోజ్ తదితరులతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఆసుపత్రి సిబ్బంది, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సమాచార, పౌర సంబదాల శాఖ అదనపు సంచాలకులుగా డి.ఎస్. జగన్



**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ సెప్టెంబర్ 2 :** సమాచార, పౌర సంబంధాల శాఖలో డి.ఎస్. జగన్ అదనపు సంచాలకుడిగా పదోన్నతి పొందారు. పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన అనంతరం ఆయన బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం డి.ఎస్. జగన్ డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి డి.ఎస్. జగన్కు పదోన్నతి సందర్భంగా అభినందనలు తెలియజేశారు. సమాచార, పౌర సంబంధాల శాఖ ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరవేయడంతో పాటు ప్రభుత్వం, ప్రజలు, మీడియా మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని మంత్రి ఆకాంక్షించారు. అనంతరం డి.ఎస్. జగన్ సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ డా.జి. ముకుంద రెడ్డిని కూడా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్పెషల్ కమిషనర్ ఆయనకు పదోన్నతి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. అదనపు సంచాలకుడిగా బాధ్యతలు స్వీకరించిన డి.ఎస్.జగన్ మాట్లాడుతూ, తనపై ప్రభుత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా విధులను సమర్ధవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలకు విస్తృతంగా చేరవేయడంలో శాఖ అధికారులతో సమన్వయంతో పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులు, సిబ్బంది డి.ఎస్. జగన్కు శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజా సమస్యలపై సమరభేరి



● జిఎం సంతోష్ని కలిసిన బీజేపీ నాయకులు గడ్డం సాయి కిరణ్

**ఉప్పల్, సెప్టెంబర్ 1(భవిష్యత్ ప్రజాపాలన):** వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని వెంకట్ రెడ్డి నగర్, రామ్ రెడ్డి నగర్, వాసవి నగర్ కాలనీలలో తీవ్రరూపం దాల్చిన మంచి నీరు, డ్రైనేజీ సమస్యల తక్షణ పరిష్కారం కోసం బీజేపీ నాయకులు గడ్డం సాయి కిరణ్ ఆధ్వర్యంలో కాలనీ వాసులు, వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కలిసి వాటర్ వర్క్స్ డిపార్ట్మెంట్ జనరల్ మేనేజర్ (జిఎం) సంతోష్ ని కలవడం జరిగింది. ఈ సందర్భంగా వెంకట్ రెడ్డి నగర్ డివిజన్లోని ఈ కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్రమైన ఆరోగ్య, మౌలిక వసతుల సమస్యలను జిఎం సంతోష్ దృష్టికి తీసుకెళ్తూ, గడ్డం సాయి కిరణ్ నిలదీశారు.



**ప్రధానంగా ప్రస్తావించిన అంశాలు & డిమాండ్లు:**

**కాలుష్య కాటు - వ్యాధుల భయం:** నల్లాలు తిప్పితే మొదటి 15 నిమిషాల పాటు మురుగునీరే (డ్రైనేజీ వాటర్) వస్తోందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కలుషిత నీరు తాగడం వల్ల స్థానిక ప్రజలు క్యాన్సర్, చర్మ వ్యాధులు, ఊపిరితిత్తుల సంబంధిత ప్రమాదకర రోగాల బారిన పడుతున్నారని తెలిపారు.

**డ్రైనేజీ పైప్లైన్ నిర్మాణాల అవసరం:**

**వెంకట్ రెడ్డి నగర్:** తీవ్రంగా దెబ్బతిన్న దాదాపు 1000 మీటర్ల డ్రైనేజీ లైన్ను తక్షణమే పునర్నిర్మించాలి.

**రామ్ రెడ్డి నగర్:** 400 మీటర్ల డ్రైనేజీ లైన్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి.

వాసవి నగర్: స్ట్రీట్ నంబర్లు 3,4,5 లలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ మరియు తాగునీటి సమస్యలను వెంటనే సరిదిద్దాలి.

**తాగునీటి ఎద్దడి:** కాలనీలలో నీటి ప్రెజర్ లేక, పరిశుభ్రమైన తాగునీరు అందక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**సానుకూలంగా స్పందించిన జిఎం సంతోష్:**

సమస్య తీవ్రతను గుర్తించిన జి ఎం సంతోష్ వెంటనే స్పందిస్తూ, సంబంధిత డీజిఎం, ఏఈ లతో ఫోన్లో మాట్లాడి క్షేత్రస్థాయి పరిశీలనకు ఆదేశించారు. కాలనీలలో ఉన్న 1000 మీటర్లు,400 మీటర్ల డ్రైనేజీ లైన్ పనులతో పాటు కలుషిత నీటి సమస్యను అతి త్వరలోనే పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



**పాల్గొన్న నాయకులు& ప్రతినిధులు:**

ఈ కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు, కాలనీ అధ్యక్షులుసత్యనారాయణ గౌడ్, అశోక్, నాగరాజు, కుక్కలసత్యనారాయణఆవుల సుధాకర్, గడ్డం వెంకట్ సాయి మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మాజీ సర్పంచ్ గంగు కృష్ణమూర్తిని పరామర్శించిన ఎమ్మెల్యే యశస్విని



**భవిష్యత్ ప్రజాపాలన పాలకుర్తి:** పాలకుర్తి మండల కేంద్రంలో నివాసంలో అనారోగ్య కారణాలతో విశ్రాంతి తీసుకుంటున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ గంగు కృష్ణమూర్తి ని పాలకుర్తి శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు.ఈ సందర్భంగా కృష్ణమూర్తి అయ్య గారి ఆరోగ్య పరిస్థితిని ఎమ్మెల్యే అడిగి తెలుసుకుని, వైద్యులు సూచించిన చికిత్సను క్రమం తప్పకుండా కొనసాగించాలని సూచించారు. ఆయన త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ధైర్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా సేవలందించిన సీనియర్ నాయకులను గౌరవించడం తమ బాధ్యత అని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి కృష్ణమూర్తి చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈ పరామర్శ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# జీహెచ్ఎంసీ, మల్కాజిగిరి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లకు కొత్త లోగోలు

**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ సెప్టెంబర్ 2:** హైదరాబాద్ మహానగర పరిధిలోని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ), మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ), సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ)లకు రూపొందించిన కొత్త లోగోలను రాష్ట్ర ముఖ్యమంత్రి, మున్సిపల్ శాఖ మంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఖరారు చేశారు. పరిశుభ్రత, పచ్చదనం, సుస్థిర అభివృద్ధి, మెరుగైన పౌర సేవలు, నగర సుపరిపాలన.. అనే ప్రధాన భావాలను ప్రతిబింబించేలా మూడు కార్పొరేషన్ల లోగోలకు ప్రత్యేక రూపకల్పన చేశారు. జీహెచ్ఎంసీ లోగో పరిశుభ్రమైన, పచ్చని, ఆరోగ్యకరమైన,సుస్థిరమైన గ్రేటర్ హైదరాబాద్ లక్ష్యాన్ని ప్రతిబింబిస్తుంది. లోగోలోని ఆకుపచ్చ ఆకులు అభివృద్ధి, పచ్చదనం, పర్యావరణ పరిరక్షణకు సంకేతం కాగా, నీలిరంగు నీటి బొట్టు స్వచ్ఛమైన నీరు, నీటి సంరక్షణ, అత్యవసర పౌర సేవలను సూచిస్తున్నాయి. హృదయాకార రూపం ప్రజల పట్ల శ్రద్ధ, సంక్షేమం, ప్రజానుకూల పాలనను ప్రతిబింబిస్తుంది. నీలం, ఆకుపచ్చ రంగులు విశ్వాసం, బాధ్యత, సుపరిపాలన, ప్రకృతి, ప్రగతి, పర్యావరణహిత అభివృద్ధికి ప్రతీకలుగా నిలుస్తాయి. "పచ్చని, పరిశుభ్రమైన, మెరుగైన హైదరాబాద్" అనే దృక్పథాన్ని ఈ లోగో చాటుతుంది.సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లోగో ఆధునిక,పచ్చని, ఆరోగ్యకరమైన, ప్రగతిశీల నగరాన్ని ప్రతిబింబిస్తుంది. ఆకుపచ్చ ఆకులు పర్యావరణ పరిరక్షణను, మధ్యలోని నీటి బొట్టు స్వచ్ఛత, నీటి సంరక్షణ, కీలక మున్సిపల్ సేవలను సూచిస్తాయి. నీలం-ఆకుపచ్చ రంగుల సమ్మేళనం విశ్వాసం, పారదర్శకత, అభివృద్ధి, పర్యావరణహిత పాలనను తెలియజేస్తుంది. స్మార్ట్ మౌలిక వసతులు, మెరుగైన పౌర సేవలు, సుస్థిర అభివృద్ధితో మరింత పరిశుభ్రమైన, పచ్చని సైబరాబాద్ నిర్మాణ లక్ష్యాన్ని ఈ లోగో ప్రతిబింబిస్తుంది. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ లోగో ప్రకృతి, ప్రజలు, అభివృద్ధి అనే మూడు ప్రధాన భావాలకు ప్రతీకగా రూపొందించారు. హృదయాకారం లోని ఆకుపచ్చ రూపం ప్రజల పట్ల శ్రద్ధతో పాటు పరిశుభ్రమైన, సుస్థిరమైన పర్యావరణాన్ని సూచిస్తుంది.తాజా ఆకులు పచ్చదనం,అభివృద్ధి, ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు సంకేతాలు. నీలం రంగు విశ్వాసం, బాధ్యత, పారదర్శక పాలనను ప్రతిబింబిస్తుంది. "అభివృద్ధి, ప్రగతిశీల పాలన" అనే భావనను ఈ లోగో తెలియజేస్తుంది.

# విద్యుత్తు ఉద్యోగి కుటుంబానికి కోటి బీమా సొమ్ము

**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ సెప్టెంబర్ 2 :** ట్రాన్స్ కో హుజూరాబాద్ 132/11 సబ్ స్టేషన్ పరిధిలో ప్రమాదవశాత్తు మృతిచెందిన గ్రేడ్ - 2 ఉద్యోగి శంకర్ రెడ్డి సతీమణి బోడ స్వాతికి మంగళవారం ప్రజాభవన్లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రూ.కోటి ప్రమాద బీమా చెక్కును అందించారు. హుజూరాబాద్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న శంకర్ రెడ్డి 2025 అక్టోబర్ 1న విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా విధి నిర్వహణలోనే ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో ఆయన సతీమణి బోడ స్వాతికి రూ.కోటి ప్రమాద బీమా మొత్తానికి సంబంధించిన చెక్కును ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్వయంగాఅందించారు. ఈ సందర్భంగా బోడ స్వాతితో మాట్లాడుతూ కుటుంబ వివరాలు తెలుసుకున్నారు. ఆర్థిక పరిస్థితి, పిల్లల చదువులు ఇతర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ బీమా సొమ్ముతో పిల్లలను బాగా చదివించాలని చెప్పారు. విద్యుత్ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. ఉద్యోగులు విధి నిర్వహణలో ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయిన సందర్భాల్లో వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు అమలు చేస్తున్న రూ.కోటి ప్రమాద బీమా పథకం మొదట సింగరేణి సంస్థలో ప్రారంభమై, ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని విద్యుత్ సంస్థల్లో అమలవుతోంది. ఉద్యోగుల కుటుంబాలకు భరోసా కల్పించే ఈ ప్రమాద బీమా పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్కో సీఎండీ కృష్ణ భాస్కర్, ట్రాన్స్కో అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# క్రిటికల్ మినరల్స్పై తెలంగాణ ఫోకస్



● క్రిటికల్ మినరల్స్ పరిశోధనకు 'త్రిముఖ' భాగస్వామ్యం

● మోనాష్-ఐఐటీ హైదరాబాద్-సింగరేణి సంయుక్తంగా ముందడుగు

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ సెప్టెంబర్ 2 :** క్రిటికల్ మినరల్స్, ఖనిజ అన్వేషణ, అధునాతన ఖనిజ సాంకేతికతల రంగాల్లో దీర్ఘకాలిక పరిశోధన, సంస్థాగత భాగస్వామ్యాన్ని అభివృద్ధి చేసే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మోనాష్ యూనివర్సిటీ డీన్, ఇతర ఉన్నతాధికారులతో మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్లో సమావేశమయ్యారు. సమావేశంలో మోనాష్ యూనివర్సిటీ, ఐఐటీ హైదరాబాద్, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సంయుక్తంగా క్రిటికల్ మినరల్స్ రంగంలో పరిశోధనను వేగవంతం చేయడంపై చర్చించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. భారత్ పునరుత్పాదక ఇంధన రంగాన్ని విస్తరిస్తున్న తరుణంలో క్రిటికల్ మినరల్స్ ప్రాధాన్యం పెరుగుతోందన్నారు. తెలంగాణ కేవలం వీటికి వినియోగదారుగా మాత్రమే ఉండకూడదని, మొత్తం విలువ శృంఖలిలో కీలక భాగస్వామిగా ఎదగాలని ఆకాంక్షించారు. అకడమిక్ భాగస్వామ్యాన్ని కేవలం పరిశోధనకే పరిమితం చేయకుండా, వాణిజ్య స్థాయిలో విస్తరించగల సాంకేతికతల అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని ఆయన సూచించారు. ఈ భాగస్వామ్యానికి





సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను త్వరగా రూపొందించాలని అధికారులను కోరారు. తెలంగాణను క్రిటికల్ మినరల్స్ పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఐఐటీ హైదరాబాద్లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ను బలోపేతం చేసి అధునాతన పరిశోధన మరియు సాంకేతిక అభివృద్ధికి వేదికగా మలచాలని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. మోనాష్ యూనివర్సిటీ, ఐఐటీ హైదరాబాద్, సింగరేణి సంస్థలను సమన్వయం చేయడం ద్వారా ఖనిజాల అన్వేషణ, మినరల్స్ వెలికితీత, శుద్ధి సాంకేతికతలు, వ్యర్థాల నుంచి క్రిటికల్ మినరల్స్ను తిరిగి పొందే విధానాలపై దృష్టి పెట్టాలని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ వాహనాలు, బ్యాటరీ నిల్వ వ్యవస్థలు, ఎలక్ట్రానిక్స్ రంగాలకు అవసరమైన ముడి పదార్థాల కొరతను అధిగమించడానికి ఈ భాగస్వామ్యం దోహదపడుతుందని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో డీప్యూటీ సీఎం స్పెషల్ సెక్రెటరీ కృష్ణభాస్కర్, మోనాష్ యూనివర్సిటీ డీన్ ప్రొఫెసర్ యాయిన్నిస్ వెంటికోస్, ఆస్ట్రేలియా--ఇండియా క్రిటికల్ మినరల్స్ రీసెర్చ్ హబ్ వ్యవస్థాపకులు ప్రొఫెసర్ మోహన్ ఎల్లిషెట్టి, ప్రొఫెసర్ రామన్ సింగ్, సింగరేణి సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# తాళం వేసిన ఇంటిని టార్గెట్ చేసిన దొంగలు



● రాఖీ పండుగకు కూతురి ఇంటికి వెళ్లిన మహిళ.. తిరిగి వచ్చేసరికి బంగారం, వెండి, నగదు మాయం

**భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి, శంకర్పల్లి, సెప్టెంబర్ 1, చేవెళ్ల నియోజకవర్గం :** శంకర్పల్లి పట్టణ పరిధిలోని అయ్యప్పరెడ్డిగూడలో తాళం వేసి ఉన్న ఒంటరి మహిళ ఇంట్లో చోరీ కలకలం రేపింది. పోలీసుల వివరాల ప్రకారం.. అయ్యప్పరెడ్డిగూడకు చెందిన పంకంటి సరస్వతి (55) ఆగస్టు 30న రాఖీ పండుగ సందర్భంగా మోమిన్పేట్లోని దుర్గం చెరువు గ్రామానికి కూతురు, అల్లుడితో కలిసి వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండగా, సెప్టెంబర్ 1న ఉదయం సుమారు 9.30 గంటలకు పక్కింటి వారు ఫోన్ చేసి ఇంట్లో దొంగతనం జరిగినట్లు సమాచారం అందించారు. వెంటనే ఇంటికి చేరుకున్న సరస్వతి ఇంట్లో పరిశీలించగా సుమారు 3 తులాల బంగారం, 30 తులాల వెండి, కొంత నగదు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు శంకర్పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇంటిని తాళం వేసి కుటుంబ సభ్యులు బయటకు వెళ్లిన విషయాన్ని గుర్తించిన వ్యక్తులే చోరీకి పాల్పడ్డారా అనే కోణంలోనూ పోలీసులు విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. చోరీకి పాల్పడిన వారిని గుర్తించేందుకు పోలీసులు ఆధారాలను సేకరిస్తున్నారు.

# సుస్థిరాభివృద్ధి దిశగా రామ్ కీ సేవలు

సేవా భావనతో ప్రారంభమైన బుడిబుడి అడుగుల ప్రయాణం సమాజంలో విశాలమైన మార్పులకు దారి తీస్తే అది నిజమైన అభివృద్ధి ప్రయాణంగా నిలుస్తుంది. సేవా భావంతో రామ్ కీ ఫౌండేషన్ ప్రారంభించిన ప్రయాణం అందుకు ప్రతీకగా నిలిచింది. అవసరం, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, సామాజిక సమస్యలను గుర్తించి పరిష్కార మార్గాలను అమలు చేసేలక్ష్యాలతో ప్రారంభమైన ఈ సంస్థ, కాలక్రమేణా విస్తరించి దేశవ్యాప్తంగా సేవల పరిధిని విస్తరించుకుంది. 20 ఏండ్లుగా కొనసాగుతున్న రామ్ కీ ఫౌండేషన్ సేవా ప్రస్థానం ఎందరికో స్ఫూర్తి.ఆధ్యాత్మిక యాత్రా ప్యాకేజీలను బుక్ చేయడం 2006లో రామకీ గ్రూప్ ఆధ్వర్యంలో కార్పొరేట్ సామాజిక బాధ్యత భావనతో ఈ ఫౌండేషన్కు శ్రీకారం చుట్టారు. ప్రారంభంలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల అవసరాలను అంచనా వేసేందుకు సర్వేలు నిర్వహించి, అక్కడి సమస్యలను సమగ్రంగా అధ్యయనం చేశారు. ఆరోగ్యం, విద్య, ఉపాధి, పర్యావరణ పరిరక్షణ వంటి రంగాల్లో తక్షణ అవసరాలను గుర్తించి వాటికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందించారు.

# ఓటర్ల జాబితాలో తప్పులకు తావులేకుండా చర్యలు




- **సర్వపక్ష సమావేశంలో ఈఆర్వో నారాయణ్ అమిత్ ఐఏఎస్ ఆదేశాలు**

**హైదరాబాద్ (శేరిలింగంపల్లి):** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ-2026 ప్రక్రియను పారదర్శకంగా, ఎలాంటి తప్పులకు తావులేకుండా పూర్తి చేయాలని శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మలేంపాటి, ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. జోనల్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన ఆధ్వర్యంలో మంగళవారం సర్వపక్ష రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ్ అమిత్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, చిరునామా మార్పులు, మరణించిన లేదా వలస వెళ్లిన ఓటర్ల గుర్తింపు ప్రక్రియలో రాజకీయ పార్టీలు తమ బూత్ స్థాయి ఏజెంట్ల ద్వారా అధికారులకు సహకరించాలని కోరారు. క్షేత్రస్థాయిలో అందుతున్న ఎన్యుమరేషన్ ఫారాల పరిశీలన, డిజిటలీకరణ, ధ్రువీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి బూత్ పరిధిలో బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి వివరాలను సమగ్రంగా పరిశీలించి, వాస్తవ పరిస్థితుల ఆధారంగా నివేదికలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. సర్వపక్ష సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన పలు అనుమానాలు, అభ్యంతరాలు, ఫిర్యాదులను ఈఆర్వో నారాయణ్ అమిత్ పరిశీలించారు. ఆయా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత సహాయ ఎన్నికల నమోదు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఓటర్ల జాబితా ప్రక్షాళనలో రాజకీయ పార్టీలు, ప్రజలు భాగస్వాములు కావాలి: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమని, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసేందుకు ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు అధికారులకు సహకరించాలని నారాయణ్ అమిత్ పిలుపునిచ్చారు. సమావేశంలో సహాయ ఎన్నికల నమోదు అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు, సూపరింటెండెంట్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.



# సీపీఎస్ రద్దు చేయాలి

- **పీఆర్సీ తక్షణమే ప్రకటించాలి**
- **పీఆర్టీయూ మహాధర్నాలో పలువురు వక్తల డిమాండ్**

**భవిష్యత్తు ప్రజాపాలన/హైదరాబాద్:** ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పీఆర్టీయూ-తెలంగాణ ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో మహా ధర్నా నిర్వహించారు. ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సుమారు 7,500 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పులగం దామోదర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షం గౌడ్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలని, 2003 డీఎస్సీ ద్వారా నియమితులైన ఉద్యోగులకు పాత పెన్షన్ అమలు చేయాలని, పీఆర్సీని తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. సీపీఎస్ రద్దుతో పాటు మెరుగైన పీఆర్సీ ప్రకటించాలని, ఉద్యోగులకు సంబంధించిన సుమారు రూ.16 వేల కోట్ల బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.





ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో రెండు డీఏలు పెండింగ్‌లో ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య ఆరుకు చేరిందని ఆరోపించారు. 2023 చివరి నాటికి ఉద్యోగుల బకాయిలు రూ.4 వేల కోట్లు ఉండగా ప్రస్తుతం రూ.16 వేల కోట్లకు చేరాయని పేర్కొన్నారు. ఉద్యోగుల నుంచి హెల్త్ స్కీమ్ కోసం నాలుగు వాయిదాలు వసూలు చేసినప్పటికీ ఈహెచ్‌ఎస్ సక్రమంగా అమలు కావడం లేదని విమర్శించారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని అన్నారు. పాలిటెక్నిక్‌ల విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను పునఃపరిశీలించాలని కోరారు. పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పులగం దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ పీఆర్సీ, ఈహెచ్‌ఎస్, 2003 డీఎస్సీ ఉద్యోగులకు పాత పెన్షన్, సీపీఎస్‌పై అధ్యయనానికి కమిటీ ఏర్పాటు వంటి హామీలను ప్రభుత్వం మరిచిపోయిందని ఆరోపించారు. ఆరు నెలల్లో పీఆర్సీ నివేదిక ఇస్తామని ప్రకటించినా ఇప్పటివరకు నివేదిక రాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని విమర్శించారు. గత నాలుగు నెలలుగా ఈహెచ్‌ఎస్ కోసం డబ్బులు కట్ చేస్తున్నప్పటికీ అనేక ఆసుపత్రుల్లో హెల్త్‌కార్డులు పనిచేయడం లేదని ఆరోపించారు. ఈ ధర్నాలో మాజీ ఎమ్మెల్సీ బి. మోహన్‌రెడ్డి, పీఆర్టీయూ కోశాధికారి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఖైరతాబాద్‌లో అభివృద్ధి ఏది?

**హైదరాబాద్, సెప్టెంబరు 1:** కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తిచేసుకున్నా ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి కనిపించడం లేదని బీఆర్ఎస్ ఖైరతాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మన్నే గోవర్ధన్ రెడ్డి విమర్శించారు. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రజలకు అందుబాటులో లేకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.
మంగళవారం ఎమ్మెల్యే కాలనీలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో గోవర్ధన్ రెడ్డి మాట్లాడారు. నియోజకవర్గంలో తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, పారిశుద్ధ్యం, మౌలిక వసతులకు సంబంధించిన అనేక సమస్యలు ఉన్నప్పటికీ వాటి పరిష్కారంపై ఎమ్మెల్యే దృష్టి సారించడం లేదని ఆరోపించారు.

**సర్వేలో చివరి స్థానమా?**

చాణక్య స్ట్రాటజీస్ నిర్వహించిన సర్వేలో హైదరాబాద్ ఎమ్మెల్యేల పనితీరు ర్యాంకుల్లో దానం నాగేందర్ చివరి స్థానంలో నిలిచారని గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే పనితీరుపై వచ్చిన ఈ ఫలితం ఖైరతాబాద్ నియోజకవర్గానికి తలవంపులు తెచ్చేలా ఉందని వ్యాఖ్యానించారు. ప్రజల మధ్య ఉండి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించాల్సిన బాధ్యత ఎమ్మెల్యేపై ఉందన్నారు.

**భూవివాదాలు, సెటిల్‌మెంట్లపై ఆరోపణలు**

ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన ఎమ్మెల్యే భూవివాదాలు, సెటిల్‌మెంట్ల వ్యవహారాలకు ప్రాధాన్యం ఇస్తున్నారంటూ గోవర్ధన్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలపై ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి చేశాం**

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో హైదరాబాద్ నగర అభివృద్ధికి, పేదల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టామని గోవర్ధన్ రెడ్డి తెలిపారు. తాగునీరు, విద్యుత్, రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేశామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఖైరతాబాద్‌లో పలు పెండింగ్ అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదని ఆరోపించారు.



**సెప్టెంబరు 8 వరకు నిరసనలు**

కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో చేసిన వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు వివిధ నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గోవర్ధన్ రెడ్డి తెలిపారు. సెప్టెంబరు 8 వరకు జరిగే కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఖైరతాబాద్ నియోజకవర్గ ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని, ప్రజలకు అండగా ఉంటుందని గోవర్ధన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నరసింహ, అయూబ్, నవీన్, ముస్తాక్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి రిటైర్ అయిన వెంటనే పెన్షన్ మంజూరు చేయాలి

- **జే.ఏ.సి. ఆధ్వర్యంలో పెన్షన్ విద్రోహదినోత్సవం విజయవంతం....**

**జిల్లా చైర్మన్ బావండ్ల వెంకటేష్**

**నాగర్ కర్నూల్ : భవిష్యత్ ప్రజా పాలన జర్నలిస్ట్ రఘు సాగర్ :** తెలంగాణ రాష్ట్ర ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపుమేరకు,మంగళ వారం నాడు టీజీఈజెఎసి, నాగర్ కర్నూల్ జిల్లా ఆధ్వర్యంలో పెన్షన్ విద్రోహ దినం విజయవంతంగా నిర్వహించారు.నాగర్ కర్నూల్ ఐడిఓసి కార్యాలయం ముందు పాల్గొని సి.పి.ఎస్ రద్దుచేసి, ఓ.పి.ఎస్ అమలు చేయాలని, ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం రెండో పి.ఆర్. సి.వెంటనే అమలు చేయాలని, పెండింగ్లో ఉన్న 6డి.ఏ.లనుల వెంటనే విడుదల చేయాలని,ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ పూర్తిగా అమలు చేయాలని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శనను భోజన విరామ సమయంలో నిర్వహించారు.నాగర్ కర్నూల్ జిల్లా చైర్మన్ భావండ్ల వెంకటేష్ మాట్లాడుతూ ఉద్యోగుల డిమాండ్లను వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీ.జీ. ఈ.జె.ఎ.సి.అడిషనల్ సెక్రటరీ జనరల్ శ్రీధర్ శర్మ,కో చైర్మన్ మధుసూదన్ రెడ్డి, జేఏసీ కోశాధికారి షర్ఫుద్దీన్, జేఏసీ సభ్యులు గోదరాజు, యార బాలరాజు, ఎస్. టి.ఓ.రాజు గౌడ్, సయ్యద్ నసీరుద్దీన్, దత్తాత్రేయరావు, కోట్ర బాలాజీ, మలిపెద్ది సురేష్ కుమార్, స్కైలాబ్, చెన్నకేశవులు, కరీముల్లా, రామకృష్ణ, కళ్యాణ కృష్ణారావు, మహిళా నాయకులు శివ, రత్నమ్మ, అరుణ, అలివేలు, శోభారాణి, వివిధ సంఘాలకు చెందిన నాయకులు పాల్గొని విజయవంతం చేశారు.




# నేత్రదానం ఆవశ్యకత పై అవగాహన కార్యక్రమం

**జిల్లా వైద్య మరి ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. కృష్ణ**

**నాగర్ కర్నూల్ : భవిష్యత్ ప్రజా పాలన జర్నలిస్ట్ రఘు సాగర్ :** నేత్రదానం పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే. కృష్ణ తెలిపారు. మంగళవారం నాడు నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో 41 వ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు నేత్రదానం యొక్క ఆవశ్యకతపై వక్తృత్వ మరియు వ్యాసరచన పోటీలు నిర్వహించి విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, కన్సోలేషన్ బహుమతులను అందించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ డాక్టర్ కృష్ణ మాట్లాడుతూ ఎవరైనా ఒకరు మరణించిన తర్వాత నేత్రదానం చేయడం వల్ల ఇద్దరికీ చూపు వస్తుందని, కావున వ్యక్తి మరణించిన తర్వాత వారి కుటుంబ సభ్యులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నేత్రదానం చేయాలని డి ఎం హెచ్ ఓ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నేత్రదానం చేయాలనుకునేవారు వారి దగ్గర్లోని ఆరోగ్య కేంద్రము ను గాని లేదా ఆరోగ్య సిబ్బందిని కలిసి తమ అంగీకారము తెలపాలన్నారు. వ్యక్తి మరణించిన 6 గంటల లోపే నేత్రదానం చేయాలి అని డి ఎం హెచ్ ఓ తెలిపారు. 2025-26 సంవత్సరంలో ఆర్ బి ఎస్ కే సంచార వైద్య బృందం మరియు నేత్రాధికారులు నాగర్ కర్నూల్ జిల్లాలోని 276 ప్రభుత్వ పాఠశాలలలో 35,586 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, 1,736 విద్యార్థులకు దృష్టిలోపాలు ఉన్నట్లు గుర్తించారు. వీరిలో 1,256 మంది బాల బాలికలకు ఉచితంగా అద్దాలు పంపిణీ చేస్తున్నామని, అందులో భాగంగా పాఠశాలలోని 20 ఉంది విద్యార్థులకు కంటి అద్దాలను డి ఎం హెచ్ ఓ అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ భరత్ కుమార్ రెడ్డి, పాఠశాల ఇంచార్జ ప్రధానోపాధ్యాయులు ఆనంద ప్రసాద్, ఉప జిల్లా మాస్ మీడియా అధికారి రాజగోపాల చారి, డిపిఓ రేనయ్య, నేత్రాది కారులు కొట్ర బాలాజీ ,దత్తాత్రి రావు, ఉపాధ్యాయులు సలీం, ఎల్. వేణు, ఇతర ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.









# 1000 రోజుల పాలన పేదల అభివృద్ధి కోసమే

**డాక్టర్ పిడమర్తి రవి**

**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 2 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 1000 రోజుల విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా హిమాయత్ నగర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రామన్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ పిడమర్తి రవి హాజరయ్యారు ఈ సందర్భంగా పిడమర్తి రవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాపాలనలో వెయ్యి రోజులు పేదల కోసమే ప్రజా పాలన జరిగిందని పేదలకు ఇందిరమ్మ ఇల్లు రేషన్ కార్డులు మహిళ ఉచిత బస్సు సౌకర్యం అనేకమంది పేదల భూములను కార్పొరేట్ శక్తులు కబ్జాకు చేస్తున్న సందర్భంలో హైదరాబాద్ పేదల భూములను రక్షించిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చెందు తుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై గ్రామస్థాయిలో ప్రతిఒక్కరు సంతోషం గా ఉన్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై ప్రగాఢ నమ్మకం పెరిగిందని రానున్న రోజుల్లో ముఖ్యమంత్రి మరియు మంత్రి మండలి ఆధ్వర్యంలో చేపట్టే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి ప్రజా పాలన ప్రతి పేదవారు నేరుగా ప్రభుత్వని కలిసి తమ విజ్ఞప్తులను సమర్పించుకునే సమయం ఇస్తున్నందుకు రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు అని అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ టీపీసీసీ నాయకులు బట్టు శ్రీహరి నాయక్, శ్రీధర్ గౌడ్, సతీష్ కుమార్, చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ బొమ్మెరస్టాలిన్, బోరెల్లి సురేష్, దేవరకొండ నరేష్ చందర్ నాయక్ నక్క మహేష్ బాలు తదితరులు పాల్గొన్నారు.



బుధవారం,
సెప్టెంబర్ 02, 2026

భవిష్యత్ ప్రజాపాలన
తెలుగు దినపత్రిక



# తెలంగాణ ప్రభుత్వం సమాచార పౌర సంబంధాల శాఖ




**పత్రిక ప్రకటన 1 తేదీ:01-09-2026 మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా :** మైనారిటీ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా బలపడడానికి



ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన ద్వారా పొందే ఆర్థిక సహాయం ఎంతగానో దోహద పడుతూశీదన్నారు - గౌరవ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్, పరిశ్రమలు, వాణిజ్యం మరియు శాసనసభ వ్యవహారాల మరియు జిల్లా ఇన్ చార్జి మంత్రి దుద్దీళ్ళ శ్రీధర్ బాబు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరం లో జరిగిన ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన పథకం చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్ఎల్ సి పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్ ఎల్ ఎ అరికేపుడి గాంధీ, హజ్ కమిటీ సభ్యులు మహమ్మద్ ముజుబుద్దీన్, ఒబెదుల్ల కొత్వాల్ మైనారిటీ ఫైనాన్స్ ఛైర్మన్, జిల్లా కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తో కలిసి జిల్లా ఇన్ చార్జి మంత్రి దుద్దీళ్ళ శ్రీధర్ బాబు పాల్గొన్నారు. మహిళలును కోటీశ్వర్లును చేయాలనే రాష్ట్ర ముఖ్యమంత్రి గారి ఆలోచనే ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన పథకం. స్వయం ఉపాధి మరియు చిన్న వ్యాపార కార్యకలాపాలను ప్రోత్సహించడం ద్వారా మైనారిటీ మహిళలు ఆర్థికంగా స్వతంత్రులుగా ఎదగడానికి ప్రభుత్వం అమలు చేసే ఈ పథకం వారిని ఆర్థికంగా బలోపేతము చేస్తుందన్నారు. మహిళలకు ఇచ్చే ప్రతి రూపాయ కుటుంబం కోసమే ఖర్చు చేస్తుంది కావున ఈ ప్రజా ప్రభుత్యము మహిళలకు పెద్ద పీట వేసింది అని తెలిపారు. ఈ పథకం క్రింద మేడ్చల్ జిల్లాలో 225 మైనారిటీ మహిళ లబ్ధిధారులకు ఒక్కొక్కరికి 50,000 రూపాయలు చెక్కులను అందించడం జరిగింది. పారదర్శకతను నిర్ధారించడానికి ప్రభుత్వం సహాయ మొత్తాన్ని నేరుగా లబ్దిదారుల బ్యాంకు ఖాతాలోకి జమ చేయడం జరగుతుంది. తుర్క కాశి ముస్లిం వర్గానికి కుల వృత్తికి ఉపయోగపడే అరవై వేలు విలువ చేసే జనరేటర్ & టూల్ కిట్‌లను 57 లబ్ధిదారులకు పంపిణీ చేశారు. రేవంత్




అన్నాకా సహారా - మిస్కినో కే లియే పథకం క్రింద మైనారిటీల జీవనోపాధి కి అవసరమైన లక్ష రూపాయలు విలువ చేసే మోపెడ్‌లను. స్వయం ఉపాధి క్రింద మహిళలకు కుట్టు మెషిన్ లను అందించడం జరుగుతుంది. మత, సామాజిక, మౌలిక సదుపాయాల కోసము ఆర్థిక సహాయం, విదేశాలలో ఉన్నత విద్యని అభ్యసించడానికి ముఖ్యమంత్రి ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం ద్వారా మైనారిటీ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడం జరగుతుందన్నారు. ఈ ప్రజా ప్రభుత్వము 1000 రోజుల పూర్తి చేసుకున్న సందర్భంగా మహిళలకు ఆర్థిక చేయూత అందించడం ఎంతో గర్వంగా ఉంది అని మంత్రి అన్నారు. ప్రజా ప్రభుత్వం ఆరు గ్యారంటీ లను చిత్తశుద్ధి తో అమలు చేస్తూన్నది. గృహజ్యోతి క్రింద





200 యూనిట్స్ ఉచిత విద్యుత్, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలఅందరికి ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా CURE పరిధిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మానించడం జరగుతుంది. విద్యాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి వసతులతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రతిష్టాత్మకంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేసింది. అర్హులైన ప్రతి ఒకరికి నూతన స్మార్ట్ రేషన్ కార్డ్ లను జారీ చేసి అందరికి సన్న బియ్యం అందచేస్తుంది. రైతులు ఆర్థికంగా బలోపేతం కావడానికి చవ్యవసాయ పని ముట్లు, రైతు భరోసా, రైతు భీమా పథకాల అమలులో రాష్ట్రము సింహాబాగంలో నిలిచిందన్నారు. యువతకు ఉపాధి కల్పనలో భాగంగా నైపుణ్యం అభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేశామని మంత్రీ తెలిపారు. అనంతరం లబ్దిదారులకు చెక్కుల పంపిణీ, జనరేటర్ & టూల్ కిట్ అందచేశారు. ఈ కార్యక్రమంలో గ్రశీథాలయ ఛైర్మన్, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్, కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్, ఆర్టిఎ సభ్యుడు, మున్సిపల్ చైర్ పర్సన్స్, TGLDA ఛైర్మన్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కాంతమ్మ, ప్రజాప్రతినిదులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

# పెన్షన్ భద్రతే ఉద్యోగుల భవిష్యత్తుకు భరోసా

- **పాత పెన్షన్ పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలి**
- **పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా ప్రభుత్వ సిటీ కళాశాలలో నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన**

**మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన :** పాత పెన్షన్ పథకాన్ని తొలగించి కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చిన సెప్టెంబర్ ఒకటో తేదీని పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ ప్రభుత్వ సిటీ కళాశాలలో బోధన, బోధనేతర సిబ్బంది నిరసన చేపట్టారు. ఉద్యోగ సంఘాల పిలుపు మేరకు మంగళవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసనను శాంతియుతంగా వ్యక్తం చేశారు. పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని, ఉద్యోగుల పదవీ విరమణ అనంతర జీవితానికి ఆర్థిక భద్రత కల్పించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం వల్ల ఉద్యోగుల భవిష్యత్తు ఆర్థిక భద్రతపై అనిశ్చితి ఏర్పడుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వ సేవలో జీవితాంతం పనిచేసిన ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం గౌరవప్రదమైన జీవితం అందేలా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు.

**కాంట్రిబ్యూటరీ పెన్షన్ వద్దు.. పాత పెన్షన్ పథకమే ముద్దు**

నిరసన సందర్భంగా ఉద్యోగులు పాత పెన్షన్ పథకం అమలు చేయాలని నినాదాలు చేశారు. ఉద్యోగుల సామాజిక భద్రత, కుటుంబాల భవిష్యత్తు, పదవీ విరమణ అనంతర జీవన ప్రమాణాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. “పెన్షన్ భిక్ష కాదు.. ఉద్యోగి జీవితాంతం చేసిన సేవకు దక్కే హక్కు. ఉద్యోగి భవిష్యత్తుకు భరోసా కల్పించడమే నిజమైన ఉద్యోగ సంక్షేమం” అంటూ ఉద్యోగులు నినదించారు.

**ఆరు కరువు భత్యాలు.. పాత బకాయిలు వెంటనే చెల్లించాలి**

ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ఆరు కరువు భత్యాలను, అలాగే పాత బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలను పరిశీలించి, అర్హత మేరకు తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఉద్యోగుల వేతనాలు, కరువు భత్యాలు, ఇతర ఆర్థిక ప్రయోజనాలు వారి సేవకు సంబంధించినవని, వాటి చెల్లింపులో జాప్యం లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**“మా సొమ్ము.. మా హక్కు.. కాపాడే బాధ్యత ప్రభుత్వానిదే”**

ఉద్యోగుల నిరసనలో “మా సొమ్ము.. మా హక్కు.. వాటిని కాపాడే బాధ్యత ప్రభుత్వానిదే”, “ఉద్యోగుల హక్కులను కాలరాయొద్దు”, “పాత పెన్షన్ పథకాన్ని వెంటనే అమలు చేయాలి”, “పెండింగ్ కరువు భత్యాలు వెంటనే చెల్లించాలి” అంటూ నినాదాలు మార్మోగాయి. ఉద్యోగుల హక్కులను ప్రభుత్వం దయాదాక్షిణ్యాలతో ఉచితంగా అందించే ప్రయోజనాలుగా చూడరాదని, ఉద్యోగులు తమ సేవా కాలంలో అందించిన సేవకు అనుగుణంగా లభించాల్సిన హక్కులుగా పరిగణించాలని వారు పేర్కొన్నారు.

**ఉద్యోగుల సంరక్షణ ప్రభుత్వ బాధ్యత**

ప్రభుత్వ ఉద్యోగులు తమ జీవితంలోని విలువైన కాలాన్ని ప్రజాసేవకు అంకితం చేస్తున్నారని ఉద్యోగులు పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు నిరంతరాయంగా అందించడంలో




ఉద్యోగుల పాత్ర కీలకమని, అలాంటి ఉద్యోగుల భవిష్యత్తు భద్రతకు ప్రభుత్వం తగిన ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. పదవీ విరమణ అనంతరం ఉద్యోగి కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా ఉండేందుకు పాత పెన్షన్ పథకం భద్రత కల్పిస్తుందని, అందువల్ల పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించే అంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.

**న్యాయమైన డిమాండ్లపై సానుకూల నిర్ణయం తీసుకోవాలి**

ఉద్యోగుల పెన్షన్ సమస్యతో పాటు పెండింగ్ కరువు భత్యాలు, పాత బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని ఉద్యోగులు కోరారు. ఉద్యోగ సంఘాలతో చర్చించి సమస్యల పరిష్కారానికి ఆచరణాత్మక చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. “ఉద్యోగి భవిష్యత్తుకు భద్రత కల్పిస్తేనే ప్రజాసేవకు మరింత నిబద్ధత పెరుగుతుంది. ఉద్యోగి హక్కులను కాపాడటం అంటే ప్రజాసేవకు వెన్నుదన్నుగా నిలవడమే” అని ఉద్యోగులు పేర్కొన్నారు. పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా నిర్వహించిన నిరసనలో ప్రభుత్వ సిటీ కళాశాలకు చెందిన బోధన, బోధనేతర సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి పాల్గొన్నారు. పాత పెన్షన్ పథకం పునరుద్ధరణ, పెండింగ్ కరువు భత్యాలు, పాత బకాయిల చెల్లింపు వంటి తమ డిమాండ్లను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.

# రోజువారీ ప్రోటీన్ అవసరాలను సోయాబీన్స్ తీరుస్తాయా.. రోజుకు ఎంత తీసుకోవాలి..?

భారతీయుల ఆహారంలో ప్రోటీన్ లోపం ఒక ముఖ్యమైన పోషకాహార సమస్యగా మారుతోంది. దేశవ్యాప్తంగా నిర్వహించిన ఆహార సర్వేలు, జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5), భారత వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్)కు సంబంధించిన నివేదికల ప్రకారం.. 70 శాతానికి పైగా భారతీయుల్లో ప్రోటీన్ లోపం ఉన్నట్లు, దాదాపు 90 శాతం మందికి తమ



రోజువారీ ప్రోటీన్ అవసరం ఎంత అన్నదానిపై స్పష్టమైన అవగాహన లేదని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో తక్కువ ఖర్చుతో, సులభంగా లభించే మొక్కల ఆధారిత ప్రోటీన్ వనరులపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. రోజువారీ ఆహారంలో అన్నం, గోధుమ పిండి వంటి ధాన్యాలకు అధిక ప్రాధాన్యం ఉంటుంది. వీటిలో కార్బొహైడ్రేట్లు ఎక్కువగా ఉండడంతోపాటు, శరీరానికి అందే ప్రోటీన్ పరిమాణం కూడా పరిమితంగానే ఉంటుంది. అందుకే ప్రోటీన్ అవసరాలను తీర్చుకునేందుకు సోయాబీన్స్ వంటి పోషక విలువలు అధికంగా ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవడం ఉపయోగకరంగా ఉంటుంది.

**ప్రోటీన్లకు మంచి వనరు..**

మొక్కల ఆధారిత ఆహారాల్లో సోయాబీన్స్ ను ప్రోటీన్‌లకు మంచి వనరుగా పరిగణిస్తారు. అయితే పచ్చి సోయాబీన్స్‌ను ఉడికించిన తర్వాత అందులో ఎంత ప్రోటీన్ ఉంటుంది ఒక కప్పు ఉడికించిన సోయాబీన్స్ రోజువారీ ప్రోటీన్ అవసరాల్లో ఎంతవరకు తీర్చగలదు ? అనే విషయాలు చాలామందికి తెలియవు. ఐసీఎంఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్) రూపొందించిన ఇండియన్ ఫుడ్ కంపోజిషన్ టేబుల్స్ (ఐఎఫ్‌సీటీ) 2017 ప్రకారం.. 100 గ్రాముల పచ్చి సోయాబీన్స్‌లో సుమారు 35.58 గ్రాముల నుంచి 37.80 గ్రాముల వరకు ప్రోటీన్ ఉంటుంది. అయితే సోయాబీన్స్‌ను ఉడికించినప్పుడు అవి గణనీయమైన మొత్తంలో నీటిని పీల్చుకుంటాయి. దీంతో వాటి బరువు, పరిమాణం పెరుగుతుంది. సుమారు 170 గ్రాముల బరువుండే ఒక కప్పు ఉడికించిన సోయాబీన్స్‌లో దాదాపు 28 నుంచి 31 గ్రాముల ప్రోటీన్ లభిస్తుంది.

**ఎంత ప్రోటీన్ అవసరం..?**

ఐసీఎంఆర్-ఎన్ఐఎన్ 2020 పోషకాహార మార్గదర్శకాల ప్రకారం.. శరీర బరువులో ప్రతి కిలోగ్రాముకు 0.66 గ్రాముల ప్రోటీన్ అవసరం ఉంటుందని అంచనా. సిఫార్సు చేసిన రోజువారీ పరిమాణం (ఆర్‌డీఏ) ప్రతి కిలోగ్రాము శరీర బరువుకు 0.83 గ్రాములుగా ఉంది. ఉదాహరణకు 60 కిలోల బరువున్న ఒక వ్యక్తికి రోజుకు సుమారు 50 గ్రాముల ప్రోటీన్ అవసరం అవుతుంది. ఈ లెక్కన ఒక కప్పు ఉడికించిన సోయాబీన్స్ తీసుకోవడం ద్వారా రోజువారీ ప్రోటీన్ అవసరాల్లో 55 నుంచి 60 శాతం వరకు పొందవచ్చు.

# గణేష్ ఉత్సవాలు ఘనంగా.. ప్రశాంతంగా నిర్వహించాలి



- **భక్తులకు అసౌకర్యం కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి**

**ఎమ్మెల్యే నవీన్ యాదవ్**

**హైదరాబాద్, సెప్టెంబరు 1:** జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించిన గణేష్ ఉత్సవాలు-2026 ఉన్నతస్థాయి సన్నాహక సమన్వయ సమావేశంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గణేష్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. పారిశుద్ధ్యం, భద్రత, విద్యుత్, వైద్య సేవలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని, మట్టి విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహించాలని ఎమ్మెల్యే కోరారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించి పర్యావరణహితంగా ఉత్సవాలను నిర్వహించాలని ప్రజలకు, ఉత్సవ నిర్వాహకులకు విజ్ఞప్తి చేశారు. ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, సజావుగా జరిగేలా అధికారులు, ఉత్సవ నిర్వాహకులు, ప్రజలు పరస్పర సహకారంతో ముందుకు సాగాలని నవీన్ యాదవ్ కోరారు. ఈ సమావేశంలో మంత్రులు, ఎంపీలు, రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# ఆపన్నులకు అండగా ప్రజా ప్రభుత్వం





- **ప్రతి కుటుంబానికి భరోసా.. 20 మందికి రూ.12.27 లక్షల సీఎంఆర్ఎఫ్ సాయం**

**హైదరాబాద్, సెప్టెంబరు 1:** ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ ప్రభుత్వం అందిస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ఆర్థిక సహాయాన్ని జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ అందజేశారు. యూసుఫ్‌గూడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 20 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.12,27,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే స్వయంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నవీన్ యాదవ్ మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి అండగా నిలిచి, అవసరమైన వారికి ప్రభుత్వ సహాయం అందేలా చూడటమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# ఆహారాలను కట్ చేసేందుకు ఎలాంటి చాపింగ్ బోర్డులను ఉపయోగించాలి..?

ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడంపై చాలామంది శ్రద్ధ పెడుతుంటారు. అయితే ఆ ఆహారాన్ని తయారు చేసే సమయంలో ఉపయోగించే వస్తువుల విషయంలో మాత్రం అంతగా దృష్టి పెట్టరు. ముఖ్యంగా కూరగాయలు, పండ్లు, మాంసం వంటి ఆహార పదార్థాలను కట్ చేయడానికి ఉపయోగించే చాపింగ్ బోర్డు విషయంలో పరిశుభ్రత, క్రాస్ కంటామినేషన్ వంటి అంశాలను తప్పక పరిగణనలోకి తీసుకోవాలి. మనం ఎలాంటి ఆహారాన్ని తయారు చేస్తున్నామనే దానిపై కూడా చాపింగ్ బోర్డు ఎంపిక ఆధారపడి ఉంటుంది. ప్లాస్టిక్, చెక్క, స్టీల్.. ఇలా వివిధ రకాల చాపింగ్ బోర్డులు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. వీటిలో ఒక్కో రకానికి కొన్ని ప్రయోజనాలు, కొన్ని ప్రతికూలతలు ఉన్నాయి. ముఖ్యంగా పరిశుభ్రత, కత్తి పదును, నిర్వహణ వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని వీటిని ఎంచుకోవాల్సి ఉంటుంది.

**ప్లాస్టిక్ చాపింగ్ బోర్డులు..**

ప్లాస్టిక్ చాపింగ్ బోర్డులు తేలికగా ఉండటంతోపాటు తక్కువ ధరకు లభిస్తాయి. డిష్‌వాషర్‌లో కూడా సులభంగా శుభ్రం చేసుకోవచ్చు. అయితే కత్తితో పదేపదే కోయడం వల్ల వీటి ఉపరితలంపై లోతైన గాట్లు ఏర్పడే అవకాశం ఉంటుంది. ఆ గాట్లలో బ్యాక్టీరియా పేరుకుపోయే ప్రమాదం ఉంటుంది. చెక్క బోర్డులతో పోలిస్తే ప్లాస్టిక్ బోర్డులు కత్తుల పదును త్వరగా తగ్గిస్తాయి. అలాగే కాలక్రమంలో వీటి నుంచి మైక్రోప్లాస్టిక్ కణాలు ఆహారంలోకి చేరే అవకాశం ఉందనే ఆందోళనలు కూడా ఉన్నాయి. చెక్కతో తయారు చేసిన చాపింగ్ బోర్డులు కత్తి బ్లేడ్ పదును కాపాడటంలో సహాయపడతాయి. చెక్కలో సహజసిద్ధమైన యాంటీమైక్రోబయల్ లక్షణాలు ఉండటం వల్ల బ్యాక్టీరియా ఉపరితలం నుంచి దూరమై, నిర్వీర్యం కావడానికి సహాయపడతాయి. అయితే చెక్క బోర్డులకు ప్రత్యేకమైన నిర్వహణ అవసరం. వాటిని క్రమం తప్పకుండా నూనెతో సంరక్షించాలి. చేతితో శుభ్రం చేయడం మంచిది. ఎక్కువసేపు నీటిలో నానబెడితే చెక్క వంకరగా మారడం లేదా పగుళ్లు ఏర్పడే అవకాశం ఉంటుంది.

**స్టీల్ బోర్డులు అయితే..**

ఇక స్టీల్ చాపింగ్ బోర్డులు పూర్తిగా పోరస్ లేని ఉపరితలంతో ఉంటాయి. ఇవి తుప్పు పట్టకుండా ఉండటంతో పాటు, అచ్చు ఏర్పడే అవకాశం తక్కువగా ఉంటుంది. వాసనలను కూడా పీల్చుకోవు. చాలా కాలం మన్నికగా ఉండటంతో పాటు సులభంగా శానిటైజ్ చేసుకోవచ్చు. అందువల్ల పరిశుభ్రత పరంగా ఇవి ఉపయోగకరంగా ఉంటాయి. అయితే స్టీల్ బోర్డులకు కూడా కొన్ని ప్రతికూలతలు ఉన్నాయి. గట్టి ఉపరితలం కారణంగా కత్తి అంచు త్వరగా మొద్దుబారే అవకాశం ఉంటుంది. ఉపయోగించే సమయంలో శబ్దం కూడా ఎక్కువగా వస్తుంది. అలాగే ఆహారం లేదా కత్తి జారిపోయే అవకాశం ఉండటంతో జాగ్రత్తగా ఉపయోగించాలి. పచ్చి మాంసం వంటి పదార్థాలను కోసే సమయంలో చాపింగ్ బోర్డు పరిశుభ్రతకు మరింత ప్రాధాన్యం ఉంటుంది. చెక్క బోర్డులు పోరస్‌గా ఉండటం వల్ల మాంసం నుంచి వెలువడే ద్రవాలను పీల్చుకునే అవకాశం ఉంటుంది. కత్తి వల్ల ఏర్పడిన గాట్లలో కూడా ఆ ద్రవాలు చేరుతాయి. బోర్డును సరిగ్గా శుభ్రం చేయకపోతే బ్యాక్టీరియా అక్కడే మిగిలిపోయే అవకాశం ఉంటుంది. ఆ తర్వాత అదే బోర్డుపై ఇతర ఆహార పదార్థాలను కోస్తే క్రాస్ కంటామినేషన్ జరిగే ప్రమాదం ఉంటుంది.

# సీసీటీవీ కెమెరా వంద మంది కళ్లతో సమానం



- శ్రీరాం కాలనీకి నిఘా కవచం.. 32 కమ్యూనిటీ సీసీ కెమెరాల ప్రారంభం
- నేరాల నియంత్రణకు పటిష్ట నిఘా.. ప్రజల భద్రతకు శ్రీనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ వర్గాల చేయూత

**మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన:** ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ హైదరాబాద్ నగర పోలీస్ శాఖ చేపడుతున్న కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలకు ప్రజల భాగస్వామ్యం మరింత బలాన్నిస్తోంది. ఇందులో భాగంగా పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీరాం కాలనీలో 32 కమ్యూనిటీ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆర్‌జీఐఏ డివిజన్ ఏసీపీ శ్రీకాంత్ గౌడ్ సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి. లక్ష్మీ నారాయణ రెడ్డి, స్థానిక ప్రజలు, శ్రీరాం కాలనీ వాసులు పాల్గొన్నారు. "ఒక్క సీసీటీవీ కెమెరా.. వంద మంది కళ్లతో సమానం. నేరం జరిగిన తర్వాత నిందితులను పట్టుకోవడం కంటే.. నేరం జరగకుండా ముందే అడ్డుకోవడమే అసలైన భద్రత." శ్రీరాం కాలనీలో ఏర్పాటు చేసిన 32 కమ్యూనిటీ సీసీ కెమెరాలు ఇకపై కాలనీకి నిరంతరం నిఘా కళ్లుగా పనిచేయనున్నాయి. ప్రధాన రహదారులు, ముఖ్యమైన కూడళ్లు, ప్రజల రాకపోకలు అధికంగా ఉండే ప్రాంతాలు, ఇతర కీలక ప్రదేశాలపై నిరంతర నిఘా కొనసాగించేందుకు ఈ కెమెరాలు ఉపయోగపడనున్నాయి. సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలను గుర్తించడంతో పాటు అవాంఛనీయ ఘటనలను ముందుగానే గుర్తించి అవసరమైన చర్యలు తీసుకునేందుకు పోలీసులకు అవకాశం ఉంటుంది. ఏదైనా నేరం జరిగిన సమయంలో ఘటనకు సంబంధించిన దృశ్యాలు, నిందితుల కదలికలు, వాహనాల వివరాలు వంటి కీలక ఆధారాలను సేకరించడంలో సీసీ కెమెరాల ఫుటేజీ ఎంతో ఉపయోగపడనుంది.



**శ్రీరాం కాలనీకి 32 నిఘా కళ్లు**

కాలనీలోని ముఖ్యమైన ప్రాంతాలను కవర్ చేసేలా ఏర్పాటు చేసిన 32 సీసీ కెమెరాలు స్థానికుల భద్రతకు అదనపు రక్షణగా నిలవనున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో అనుమానాస్పద కదలికలను పర్యవేక్షించడంలో ఇవి కీలకంగా మారనున్నాయి. నేరాలను నియంత్రించడంతో పాటు నేరాలకు పాల్పడే వారికి పోలీసుల నిఘా ఉన్నదనే భరోసా కల్పించడంలోనూ సీసీ కెమెరాలు దోహదపడతాయని అధికారులు తెలిపారు. "కెమెరా ఉన్న ప్రతి ప్రాంతం పోలీసుల నిఘాలో ఉన్నట్టే.. నిఘా పెరిగితే నేరాలకు అవకాశం తగ్గుతుంది. సాంకేతికతను ప్రజల భద్రత కోసం వినియోగించడమే లక్ష్యం."



**ప్రజల భద్రతకు సమాజం చేయూత**

శ్రీరాం కాలనీలో కమ్యూనిటీ సీసీ కెమెరాల ఏర్పాటుకు శ్రీనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ కమ్యూనిటీకి చెందిన దాతలు అందించిన సహకారం అభినందనీయమని అధికారులు పేర్కొన్నారు. పోలీసులపై మాత్రమే ఆధారపడకుండా ప్రజల భద్రత కోసం స్థానిక సమాజం కూడా బాధ్యత తీసుకోవడం కమ్యూనిటీ పోలీసింగ్‌కు మంచి ఉదాహరణగా నిలుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆర్‌జీఐఏ డివిజన్ ఏసీపీ శ్రీకాంత్ గౌడ్, పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి. లక్ష్మీ నారాయణ రెడ్డి దాతలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల భద్రత కోసం అందించిన సహకారం ఎంతో విలువైనదని పేర్కొన్నారు. "ప్రజల భాగస్వామ్యం ఉన్న చోట పోలీసింగ్ మరింత బలపడుతుంది.. పోలీసులకు ప్రజలు అండగా నిలిస్తే నేరాల నియంత్రణ మరింత సులభమవుతుంది."

**నేరాల నియంత్రణకు సాంకేతికత అండ**

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు చర్యలు చేపడుతున్నారు. కమ్యూనిటీ సీసీ కెమెరాల ఏర్పాటు అందులో కీలకమైన భాగంగా మారుతోంది. నేరం జరిగిన తర్వాత దర్యాప్తు చేయడమే కాకుండా నేరం జరగకుండా ముందస్తు నిఘా ఏర్పాటు చేయడం కూడా పోలీసింగ్‌లో ముఖ్యమైన అంశమని అధికారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో శ్రీరాం కాలనీలో 32 సీసీ కెమెరాల ఏర్పాటు ప్రజల భద్రతను మరింత పటిష్టం చేయనుంది. "ఒక్క కెమెరా ఒక నిఘా కన్ను.. 32 కెమెరాలు 32 నిఘా కళ్లు.. ఈ నిఘా కళ్లు శ్రీరాం కాలనీ భద్రతకు నిరంతరం కాపలా కాస్తాయి."

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

ప్రజలు తమ పరిసరాల్లో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు లేదా కార్యకలాపాలు కనిపించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ ఘటన జరిగినా ఆలస్యం చేయకుండా పోలీసులను సంప్రదించాలని సూచించారు. కాలనీ భద్రత విషయంలో స్థానికులు పోలీసులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని తెలిపారు. ప్రజలు, పోలీసులు, స్థానిక సంఘాలు, వ్యాపార వర్గాలు కలిసి పనిచేసినప్పుడే కమ్యూనిటీ పోలీసింగ్ లక్ష్యం పూర్తిస్థాయిలో నెరవేరుతుందని పేర్కొన్నారు. "భద్రత అనేది పోలీసుల ఒక్కరి బాధ్యత కాదు.. ప్రతి పౌరుడి బాధ్యత. ప్రజలు అప్రమత్తంగా ఉంటే.. పోలీసులు సమర్థంగా నిఘా పెడితే.. నేరాలకు అడ్డుకట్ట వేయడం సాధ్యమే."

**భద్రతకు మరో ముందడుగు**

శ్రీరాం కాలనీలో ఏర్పాటు చేసిన 32 కమ్యూనిటీ సీసీ కెమెరాలతో స్థానిక ప్రజలకు భద్రతపై మరింత నమ్మకం ఏర్పడనుంది. పోలీసుల నిఘా వ్యవస్థకు ప్రజల సహకారం తోడవడంతో కాలనీలో శాంతిభద్రతలను మరింత పటిష్టంగా నిర్వహించేందుకు అవకాశం ఏర్పడింది. సీసీటీవీ కెమెరా కేవలం ఓ పరికరం కాదు.. నేరాలను అడ్డుకునే నిఘా కన్ను. ఒక్క కెమెరా వంద మంది కళ్లతో సమానం అన్నట్టుగా, శ్రీరాం కాలనీలో ఏర్పాటు చేసిన 32 కెమెరాలు ప్రజల భద్రతకు నిరంతర కాపలాదారులుగా నిలవనున్నాయి. ఈ కార్యక్రమంలో స్థానికులు నాయకులు ప్రజాప్రతినిధులు పోలీసు సిబ్బందిలో తదితరులు పాల్గొన్నారు.

# భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉప్పల్ శాఖ నూతన కమిటీ



**ఉప్పల్,సెప్టెంబర్1 (భవిష్యత్ ప్రజాపాలన):** భాగ్యనగర్ గణేష్ ఉత్సవసమితి ఉప్పల్ శాఖ కన్వీనర్ ఆకుల రాజేష్ అధ్యక్షత జరిగిన సమావేశంలో ఉప్పల్ శాఖ పూర్తి నూతన కమిటీ ప్రకటించడం జరిగింది. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి మల్కాజ్‌గిరి పార్లమెంట్ అధికార ప్రతినిధి మరినేని ఫణీందర్, ఉప్పల్ నియోజకవర్గ కో-కన్వీనర్ ఎలగోని ప్రకాశ్ గౌడ్, ఉప్పల్ శాఖ భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సీనియర్ నాయకులు రావుల బాలకృష్ణ గౌడ్, బొంగు రమేష్ గౌడ్ , ఉప్పోజు బల్వంత చారి, రెడ్డి గారి దేవేందర్ రెడ్డి సూచనలు, మార్గదర్శకత్వంలో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉప్పల్ శాఖ కో-కన్వీనర్లుగా బచ్చు శివ కురుమ, ఎర్ర నర్సింగ్, వెంకట్ ముదిరాజ్, కోకా రవి వరుణ్ నియమితులయ్యారు. ఉప్పల్ శాఖ డివిజన్ ఇన్‌చార్జ్‌గా నామ శ్రవణ్ ప్రత్యేకంగా నియమితులయ్యారు. అదేవిధంగా విభాగాల వారీగా బాధ్యతలను అప్పగిస్తూ ఆర్‌టీఏ శాఖ ఇన్‌చార్జ్‌గా జెన్నీ వెంకటేష్, పోలీస్ శాఖ ఇన్‌చార్జ్‌గా నవీన్ గౌడ్, జీహెచ్ఎంసీ శాఖ ఇన్‌చార్జ్‌గా రావుల అఖిలేష్, న్యాయ సలహాదారుగా జస్వంత్ రెడ్డి, డివిజన్ కో-కోఆర్డినేటర్‌గా విజయ్ గౌడ్, హెచ్ఎండబ్ల్యూఎస్ ఇన్‌చార్జ్‌గా సతీష్ చారి,



విద్యుత్ శాఖ ఇన్‌చార్జ్‌గా అంబటి సందీప్, మీడియా ఇన్‌చార్జ్‌గా కొత్తపల్లి శివ, సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా వినయ్, కార్యాలయ ఇన్‌చార్జ్‌గా మామిండ్ల యశ్వంత్ నియమితులయ్యారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన యువత పెద్ద ఎత్తున హాజరై నూతన కమిటీకి తమ మద్దతు తెలిపారు. గుండె పునీందర్, అడెపు రమేష్, మట్టె అభిరామ్ రెడ్డి, ఆల్వాల్ బాలు ముదిరాజ్, ఎర్ర వంశీ, కప్ప నవీన్, వినోద్, బోడిగె విజయ్ గౌడ్, సప్పిడి వివేక్, ఈగ వినయ్,అరుణ్, అభిషేక్,నీలం దీపక్ తదితరులు పాల్గొని తమ సూచనలు, అభిప్రాయాలను తెలియజేశారు.

# సూర్యగిరి ఎల్లమ్మ బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి





- రావిర్యాలలో ఘనంగా 43వ వార్షిక బోనాల ఉత్సవాలు
- అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే
- భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ నాయకులు, భక్తులు

**మహేశ్వరం, భవిష్యత్ ప్రజాపాలన:** మహేశ్వరం నియోజకవర్గం రావిర్యాలలోని సూర్యగిరి ఎల్లమ్మ దేవస్థానంలో 43వ వార్షిక బోనాల ఉత్సవాలు, కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఉత్సవాల్లో పాల్గొని ఎల్లమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి**

ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న అనంతరం సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గ ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి కుటుంబంలో సంతోషం, శాంతి, సౌభాగ్యం వెల్లివిరియాలని కోరుకున్నారు. రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ దేవస్థానానికి ప్రత్యేకమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉందని, ఏటా నిర్వహించే బోనాల ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోందని పేర్కొన్నారు.

**భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవాలు**

43వ వార్షిక బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని దేవస్థానంలో ప్రత్యేక పూజలు, అమ్మవారి కల్యాణ మహోత్సవం తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిశాయి. కుటుంబ సమేతంగా భక్తులు దేవస్థానానికి చేరుకుని ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్నారు. తమ కుటుంబాలకు ఆరోగ్యం, సుఖసంతోషాలు ప్రసాదించాలని అమ్మవారిని ప్రార్థించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

**బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సందడి**

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, భక్తులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఉత్సవాల్లో పాల్గొన్న సబితా ఇంద్రారెడ్డి భక్తులతో మాట్లాడి కార్యక్రమాల వివరాలను తెలుసుకున్నారు. ఆలయ అభివృద్ధి, భక్తులకు అవసరమైన సౌకర్యాలపై కూడా నిర్వాహకులతో మాట్లాడారు.

**సంప్రదాయాలకు ప్రతీకగా బోనాల పండుగ**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బోనాల ఉత్సవాలు ప్రజల మధ్య ఐక్యత, భక్తిభావం, సామాజిక సౌహార్దాన్ని మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. "అమ్మవారి ఆశీస్సులు ఉన్న చోట ప్రజలకు ధైర్యం, కుటుంబాలకు సంతోషం, సమాజానికి శాంతి ఉంటాయి. ఎల్లమ్మ తల్లి కృపాకటాక్షాలు మహేశ్వరం నియోజకవర్గ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను." భక్తుల భారీ హాజరుతో సూర్యగిరి ఎల్లమ్మ దేవస్థానంలో బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొనడంతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, భక్తుల్లో ఉత్సాహం నెలకొంది.

# రైతు నేస్తం కార్యక్రమంలో ఎరువుల సరఫరా యాప్‌పై రైతులకు అవగాహన





- ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సప్లై (ఎఫ్ఎఫ్ఎస్) యాప్ ద్వారా పారదర్శక ఎరువుల పంపిణీ: వ్యవసాయ సంచాలకులు డాక్టర్ బి.గోపి

**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాప్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ సెప్టెంబర్ 2:** రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమం 105వ ఎపిసోడ్ మంగళవారం ఉదయం 10 గంటలకు




ప్రసారమైంది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సంచాలకులు డాక్టర్ బి.గోపి, ఐఏఎస్ పాల్గొని రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సప్లై (ఎఫ్ఎఫ్ఎస్) యాప్ ద్వారా అన్ని రకాల ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచుతున్నామని వ్యవసాయ సంచాలకులు తెలిపారు. ఈ యాప్ విధానంపై క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణాధికారులు, మండల వ్యవసాయ అధికారులు రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 22 జిల్లాల్లో ఈ యాప్ ద్వారా ఎరువుల అమ్మకాలు జరుగుతున్నాయని, మిగిలిన 10 జిల్లాల్లో కూడా రేపటి నుండి యాప్ ద్వారా సేవలు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్టు ఆయన వివరించారు.రాష్ట్ర యూరియా యాప్ ద్వారా ఇప్పటివరకు 33.97 లక్షల మంది రైతులు 141.93 లక్షల యూరియా బస్తాలను బుక్ చేసుకోగా, వారిలో 128.93 లక్షల బస్తాలను కొనుగోలు చేసినట్టు తెలిపారు. అదేవిధంగా, ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారా ఇప్పటివరకు 15.01 లక్షల క్యూఆర్ కోడ్‌లు జనరేట్ కాగా, 59.78 లక్షల బస్తాలు బుక్ కాబడ్డాయని, వాటిలో 41.68 లక్షల బస్తాలను రైతులు కొనుగోలు చేసినట్టు వివరించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఏడు రకాల వరి సన్నరకాలు సాగుచేసిన రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసి, వారికి క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ అందించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో, ఆ వంగడాలు సాగుచేసిన రైతులు తమ విత్తన కొనుగోలు వివరాలను సంబంధిత డీలర్ల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. డీలర్ల వద్ద కొనుగోలు చేయకుండా సొంత విత్తనాలు వినియోగించిన రైతులు స్వీయ ధృవీకరణ పత్రం సమర్పించి, వ్యవసాయ విస్తరణాధికారి వద్ద తమ సాగు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. ఈ రెండు అంశాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో భాగంగా ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌పై కమిషనరేట్ అండ్ డైరెక్టరేట్ ఆఫ్ అగ్రికల్చర్ కార్యాలయానికి చెందిన ఏడీఏ (ఫర్టిలైజర్స్) కుమారి మాధవి వివరణాత్మక ప్రసంగం అందించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎరువుల సరఫరాను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఈ యాప్‌ను వినియోగంలోకి తెచ్చినట్లు ఆమె తెలిపారు. ఎరువుల బుకింగ్, పంపిణీ ప్రక్రియను ఆన్‌లైన్‌లో పర్యవేక్షించడం వల్ల కృత్రిమ కొరత, బ్లాక్ మార్కెటింగ్ వంటి సమస్యలకు అడ్డుకట్ట వేయవచ్చని వివరించారు. ఈ యాప్ పనితీరుపై ప్రత్యేక వీడియో ప్రదర్శన కూడా రైతులకు అందించారు. ఇదే కార్యక్రమంలో ఎల్‌నినో ప్రభావం, రాష్ట్రంలో వర్షపాతం పరిస్థితి, భూగర్భ జలమట్టాలు, సాగునీటి ప్రాజెక్టుల అంశంపై భారత వాతావరణ శాఖ శాస్త్రవేత్త డాక్టర్ శ్రావణి, భూగర్భ జల శాఖ సంయుక్త సంచాలకులు, సాగునీటి శాఖ ఎస్ఈ రమేష్ తదితరులు రైతులకు కీలక సూచనలు అందించారు. అకాల వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రబీలో ప్రత్యామ్నాయ పంటలు, ప్రస్తుత పంటల నిర్వహణపై పీజేటీఏయూ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ లతీఫ్ పాషా అవగాహన కల్పించారు. సమగ్ర ఎరువుల యాజమాన్యంలో భాగంగా సాంప్రదాయ యూరియాతోపాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారైన నానో యూరియా వినియోగంపై ఇఫ్కో క్షేత్రస్థాయి అధికారి బాలవికాస్ వివరించారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం అడ గ్రామానికి చెందిన రైతు నాగరాజు తన సోయాబీన్ పంటలో నానో యూరియా వినియోగం ద్వారా పొందిన అనుభవాలను రైతులతో పంచుకున్నారు. చివరగా శాస్త్రవేత్తలతో రైతులు నేరుగా మమేకమై తమ సందేహాలు నివృత్తి చేసుకున్నారు.

Edited,Printed,Published and Owend by CHITLA DIVYA ,Printed at POTHUGANTI RACHANA , G2, TSRINIVAS, ROAD NO : 4 , RANGAREDDY , Hyderabad- 500035 . Published at H.NO : 177/P , PLOT NO : 402 ANJAMMA RESIDENCY , MANIKONDA , Hyderabad - 500089, Telangana. Editor : CHITLA VIJAYKUMAR REDDY , RNI : TGTEL/26/A0153 e-mail : bhavishyatprajapalana@gmail.com , Cell : 81061 86888